సుబ్బావధాని, దంటు

చిత్రమాధవనాటకము

గుంటూరు, 1912

Record no. 490

Subbāvadhāni, Daṇṭu

Citramādhavanāṭakamu

Guṇṭūru, 1912

Record no. 490

Bibliographic Record Target

సుబ్బావధాని, దంటు.

చిత్రమాధవనాటకము : అయిదంకములనాటకము / బ్రహ్మశ్రీ దంటు సుబ్బావధానిగారిచే రచియింపఁబడినది.- గుంటూరు : భాగవతుల సుబ్బయ్య, 1912.

viii, 110, 2 p. ;20 cm.

Record no. 490

Subbāvadhāni, Daṇṭu.

Citramādhavanāṭakamu : ayidaṅkamulanāṭakamu / brahmaśrī Daṇṭu Subbāvadhānigāricē raciyimpam̐baḍinadi.- Guṇṭūru : Bhāgavatula Subbayya, 1912.

viii, 110, 2 p. ;20 cm.


Record no. 490

An Adaptation of

SHAKSPEARE'S

Comedy of Errors.

First Edition 2000 Copies.



CHIT[illegible]ADHAVA NATAKAMU.

A Drama in five Acts

BY

Dantu Subbavadhani

CHANDRIKA PRESS, GUNTUR.

1912.

PUBLISHED BY

BRAHMASRI

Bhagavatula Subbayya Garu.

Price Rs 0-12-0

ఓం శ్రీగుర్జయతు

చిత్రమాధవనాటకము.

అయిదంకములనాటకము.

ఇది

బ్రహ్మశ్రీ దంటు సుబ్బావధానిగారిచే

రచియింపఁబడి

గుంటూరు

చంద్రికా ముద్రాయంత్ర కార్యస్థానమున

ముద్రింపఁబడి

బ్రహ్మశ్రీ భాగవతుల సుబ్బయ్యగారిచేఁ

ప్రకటింపఁబడియె.

1912

వెల 0—12—0

పీఠిక

మనహిందూదేశమందలి కవిసార్వభౌముఁడగు కాళిదాసుఁడు పాశ్చాత్యులగు కావ్యవిమర్శకులెల్ల రేపాశ్చాత్య కవిపుంగవునితోఁ దుల్యుఁడని నిశ్చయించిరో యాకవిరాట్టగు షేక్సిపియరు రచించిన (Comedy of Errors) అను నాటకమందలి కథను చిత్రమాధవము అనుపేరుగల యాంధ్రనాటకముగ రచింపఁబడినది.

ఇందలి ప్రధానరసములు అద్భుతము, హాస్యము. హాస్యము వచ్చుపట్లఁ గవిప్రయుక్తములైన గ్రామ్యోక్తులు నిజముగా హాస్యరసము నుత్పాదించును. శైలిరసానుగుణ్యముగనుండి మృదువై పండితపామరహృద్యముగ నున్నది. గ్రంథమంతయు గ్రామ్యభూయిష్ఠముగఁ జేయవలయునను నవీనభాషాసంస్కర్తలమార్గ మనుసరింపక హాస్యములేనితావుల సలక్షణముగఁ గావ్యమును రచించినారు.

ఇందలి కథ కడుచిత్రమయినదని చదువరులే గ్రహింపకమానరు. బ్రహ్మసృష్టిలో నొకరింబోలి యొకరు నిర్మింపఁబడకపోయినను గవి బ్రహ్మశక్తియం దట్టిలోపము లేదని తెల్పుటకో, యట్టిసృష్టియే బ్రహ్మయొనర్చియున్న యెడల లోకమున కుప్పతిలు నిడుమ లిట్టివని సూచించుటకో, యీకథ కల్పింపఁబడినది. షేక్సిపియరుయొక్క ప్రకృతిపరిశీలనయందలి నైపుణ్యమును కథావస్తురచనయందలి చాతుర్యమును ఆంధ్రలోకమునకుఁ దెలియ జేయఁ బ్రయత్నించిన యీబ్రహ్మశ్రీ దంటు సుబ్బావధానికి మహాజను లాగ్రంథపఠనముచేఁ బ్రోత్సాహము కలుగఁ జేయుదురుగాక.

19--9--12
గుంటూరు,

వంకీపురం క్రిష్ణమాచార్యులు బి,ఎ.ఎల్,టి.
అసిస్టెంటు ఎ,యి.యల్,యమ్. కాలేజి,
గుంటూరు.

ఈనాటకమునవచ్చుపాత్రములు

పురుషులు.

నిరంకుశుఁడు	పాండ్యదేశప్రభువు
వర్ధమానుఁడు	కొంకణదేశప్రవర్తకుఁడు.
మాధవుఁడు-పాండ్యదేశవాసుఁడు మాధవుఁడు కొంకణదేశవాసుఁడు	వర్ధమానునికొడుకులు ఏకనామరూపులు
పల్లవుఁడుపాండ్యదేశజుఁడు పల్లవుఁడుకొంకణదేశజుఁడు	మాధవుల సేవకులు ఏకనామరూపులు
వీరబ్రహ్మసోమయాజులు	నగలుచేయునొకకంసాలి
వెంకటరత్నము	పాండ్యదేశప్రవర్తకుఁడు
హుళక్కి	భూతవైద్యుఁడు
జులూంఖాను	రక్షకభటుఁడు
అరుణాచలం వెంకటస్వామి	పాండ్యమాధవునిసేవకులు
వెంకటస్వామి	రామామణితమ్ముఁడు
ఒకవర్తకుఁడు	
సేవకుఁడు	
మాదిగరాముఁడు	
రాజసేవకుఁడు	

స్త్రీలు

కోకిలవాణి	పాండ్యమాధవునిభార్య
శుకవాణి	కోకిలవాణిచెల్లెలు
రామామణి	వేశ్యాకాంత
యోగిని	వృద్ధస్త్రీ

సూత్రధారుఁడు నటి, భటులు పౌరులు మఱికొందఱువత్తురు.

శ్రీశారదాయైనమః

శ్రీకుమారసంభవాంధ్ర కాదంబర్యాద్యనేక మహాగ్రంథకర్తలగు బ్రహ్మశ్రీ శ్రీవేదమూర్తులయిన కురుకంటి సూర్యనారాయణ శాస్త్రిగారిచేఁ బ్రేమాసూచకముగా స్వశిష్యుఁడగు నిక్కవికి నొసంగఁబడిన చంపకమాలిక.

చ॥ భువికవిలోకమెల్లెడల మోదమెలర్పగఁ జూడఁబోలుని
క్కవనఁపుముద్దు పల్కులుసుఖంబుగ దంటవధానికబ్బెనాం
గ్లవరకలాకులాధ్యయనకాలము నం బదిమూఁడిలోనసం
స్తవముగఁదెల్గుపాఠములఁ సారెసువాకకసిక్తుఁఘారమం
దవహితశైలి టీచరుగనర్మిలియేసిట నూజవీటసం
స్తవముగఁజెప్ప వేళలనెచక్కని ధాటిఁగచిన్నవాడుబా
ల్యావశతఁదుంట్రలన్ గొనడులాతులనేరని లక్ష్యపెట్టడే
యవగుణమించుకేర్పడిన నాత్మసుహృత్తులనైనగైతలో
నవుర యితండుశిష్యుఁడని యాదృతిఁజెప్పుటగాదుచిన్నిచి
న్నివియొకకొన్నిపద్దెములో నిద్దపుఁగద్దెములో హుషారుగా
నవనవలీలలన్ దొడగినప్రమతఁజూపగఁ జూచునంతలో
నవిగమకంపురూపములనచ్చెరు వయ్యెడునాకునంతెగా
కవిచెవిఁబడ్డనయ్యవి మరిఁతెలుగా గ్రహియింఁచుసాహితీ
లవములవన్నెకెక్కి విమలంబుగఁజాటువులల్ల నేర్చిగా
రవముగసభ్యసీమలఁ జిరప్రియవక్తృతఁజూపఁదేరిరా
ణువలెసగంగఁగబ్బముల నూతనపద్ధతిఁవ్రాయఁగల్గిశా
స్త్రివిదులుమెచ్చునట్లు వసుధాపరిపాలురయొద్ద భూరిగా
రవములుపొందఁజాలి యదిరాయనునట్లవలీలఁజిత్రమా
ధవమనునాటకంబది సదారసవంతముగాగఁ జేసియీ
వివిధమనోజ్ఞసారసవివిస్తృతసత్పదగుంభజృంభసం
భవరసికత్వతత్వగుణ వత్వకవిత్వ విలాసనసంపదం
బవలుఁను రేలునామదికమోదముదంబిడఁ జాలునౌరయీ
సువిశదశేముషీధనుఁడు సుబ్బవధానిసుమానిఫీనినా

జ్ఞవమిక నేమి చెప్పుదున ఖండరసంబగు చిత్రమాధవం
బవనిని స్టేజిమీద నిడియాడినచోఁ గనుపించు దీని వై
భవమిది లోకనీతిపార పాటవపుష్టిఁ దగద్దంచుఁ దెల్పుని
ల్పవలదు మధ్య నెప్పుడు భళా తుది దాఁక పఠింప దీనిలో
నివిధము తేట తెల్లమగు నిక్కగజాతి వచః ప్రచారముల్
నవుల నొసంగు నెల్లరకు లాలితపాత్రవచఃప్రశంసలి
ట్టివతోటు కెందునుం గనము ఔంకిరసంబుల కింకబొంక మొ
క్కవిధమయాదినుండి రుచికల్పము బల్ యమకంబు నొప్పునిం
దవమతిచేఁ యబోలదిటు లంకములై దిటనొప్పు చిత్రమా
ధవమిది చిత్రనామమును దాల్పనగుఁ బహుచిత్రకల్పనా
సవములనించు కంతలు పసందుగనున్న వినాట కాంగముల్
దవిలి రుచించు శబ్దలలితత్వము వ్యంగ్యము లెందుఁ జూచినన్
రవళిఁ జెలంగు భావముల రంజిలు సుబ్బవధాని నాటకం
బవిరళ పాండితీ ప్రతత నియామకుడన్న పరెడ్డిపల్లి భూ
ధవుడలజోగరావు ప్రభుతా విభుతానిధి దీక్షితుండుదా
వివరణశైలితోఁ జదివి వేయివిధంబుల మెచ్చిమెచ్చి చెం
దొవ చెలికాని లాగు వెయినూట పదారులు కల్కతాపురిన్
దవిలి భిషక్కలాభ్యసన ధాటికి పేలుగనీయఁ బూనియీ
కవిని వినోద పెట్టెను జగంబున వైద్యము బజ్వరిల్లఁ జే
యవినుడు విజ్ఞులార యెవరైనననూయను బాగు లేదనన్
జివుకదు చిత్రమాధవము చిత్రము చూపర కెద్దువహ్వారే
దివులు దోలంగె నాదు నెఱిదీవన శిష్యుడు మేలుగోరువా
డవికలశీలి నెచ్చెలి నయజ్ఞుడభిజ్ఞుడు బాలుడైనయి
క్కవి చిరకాలమాయువు సుఖంబును సంపద కీర్తి నొందుచుం
బ్రవిమలభక్తి నాయెడల మానక దానికనుండు గావుతన్ ॥

కురుకంటి సూర్యనారాయణశాస్త్రి
నూజవీడు

29-8-12

శ్రీ చిత్రమాధవ నాటకము

శా॥ శ్రీ రమ్యంబగు నాత్మరూపములొగిన్ సేవించి సేవించ న
ల్పారాద్ధీరత జీవభేదములతో నద్వైతులై ద్వైతులై
తారేరో దెలియంగలేక తెలియన్ దార్ఢ్యంబుతో నుండి సం
సారాంతర్గతులైన మాధవులు నిచ్చల్ మిమ్ము రక్షించుతన్ ॥

(నాంద్యంతమున సూత్రధారుఁడు నల్గడల పరికించి)

బళిరే! ఏమి యీసభాభవనము.

సీ॥ ఉభయభాషాకవితోద్రేక బిరుదంబు
గలకవిప్రవరు లొక్కకడ వెలుఁగఁ
సరసనాటక కావ్య సాహిత్యకలనంబు
గలుగు పండితులొక్కకడను మెఱయ
హూణభాషాపరిజ్ఞానపారగులైన
విద్వాంసులొకదండ వెలయుచుండ
అలసత లేక సర్వాగమంబుల నేర్చు
విద్యార్థులొక చెంప వేగిరింప
గీ॥ రసికులొకవంక సుగుణులౌ రామలొక్క
వంక భూపతులొకవంక బాళిమీఱ
నిండియుండిరి కన్నులపండువుగను
భవనమెల్లను నేఁడు నాభాగ్యమహిమ ॥

రంగస్థలమిప్పుడే మాధవవిలాసంబు చిత్రించినట్లున్నది.

(పారిపార్శ్వకుఁడొక్కజాబును సూత్రధారునకందించును)

సూత్ర—(లేఖను చదువుకొని సంతసముతో) ఈసుమనఃప్రవరులనం

దటి నెట్టు లానందపెట్టుదునాయని, తటతటపడుచున్న నాచేతోదీపమునకు, నీసభవారు పంపినలేఖ కాచావరణమైనది. మేలు మేలు.

చ॥ సరసులువీరె నల్గడలచావడి హావడినిండియుండిరే
సరణిరసప్రదర్శనము సాగఁగనే నని యూగునామదిం
దిరముపుట్టిల్లెని త్తరినిఁ దీరుగ యోచనదోచుచుండె నా
భరమికఁదీరిపోవ సభవారు లిఖించిరి త్రోవనొక్కడున్॥

(తెరవంకచూచి) నటీ! నటీ! నర్తకీ! (అని పిలచి పలుకకున్నచో)

గీ॥ లాతివెలఁదుల లోలుండనైతిననుచు
నాతితలఁచెనో యేమొకో నాదుపిలుపు
చెవినఁబెట్టదు పలుకదు చేరరాదు
సవతితలపున సతులిల నవయకుంద్రె॥

నటి—(ప్రవేశించి రంగస్థలమందొక కంబంబుననున్న యద్దమందు సూత్రధారుని ప్రతిబింబముజూచి)
ఆర్యపుత్రా! ఇదుగో వచ్చితిని. ఇప్పటికైన నామీద దయవచ్చె నింతియచాలు.

సూత్ర—(స్వగతము) ఏమిది, నే నిక్కడపిలచిన నక్కడమాటలాడకుండెనేమి! కట్టా! నామనంబున బెద్దయనుమానము బొడసూపుచున్నది.

నటి—(స్వగతము) చేరబిలచి మారుపలుకకుండెనేమి యీవింత.

సూత్ర—(స్వగతము) మటియొక్కమారు పల్కరించిచూచెదగాక.
(ప్రకాశముగా) నేనిక్కడబిలచిన నీవక్కడపలికెదవేమి?

నటి—[సంభ్రమముతో] ప్రమాదము. ప్రమాదము. నాదికాదీదోషము. ఈకంబమున నద్దమింతచేసినది. నీప్రతిబింబము నన్ను

మోసపుచ్చినది.

సూత్ర—నీప్రతిబింబము నన్నును మోసపుచ్చినది.

నటి—నాప్రతిబింబముకన్న మిన్నయైన బింబాధరలు మిమ్ము నెప్పుడు మోసపుచ్చుచుండగా, నాప్రతిబింబము మోసపుచ్చెనన్న నమ్ముటెట్లు. ఇప్పుడు మాత్రము కావలసివచ్చితినా.

సూత్ర—ముద్దరాలా! అసలు తక్కువ అనుమానమెక్కువ. రిత్త యనుమానమెంత యాగడమయిన చేయగలదు. ఈమాటలు మనకెప్పు డునున్నవే. ఈబుధాగ్రగణ్యులందఱు మనవలన రసగ్రహణము చేయగోరుచున్నారు. ఏదైన నొకనాటకమును ప్రదర్శింపవలయును సుమా.

నటి—ప్రకరణమేమి.

సూత్ర—నేను నాటకమన నీవు ప్రకరణమనియెదవేమి?

నటి—ఆర్యపుత్రా అదికాదు. ప్రస్తుతమేమియని నాయభిప్రాయము.

సూత్ర—బాగు! బాగు! దశవిధనాటకములలోఁ బ్రకరణముకూడ నొకభేదముగాన నదియనుకొంటిని. పోయినపొడుగు వినిమయములు వ్యత్యయములే. దీనికేమిగాని సభాస్తారులందఱు నీగానామృతము వీనులార గ్రోల నుత్సాహపడుచున్నారు.

నటి—ఋతువేది యధికరించఁదగును.

సూత్ర—ఇప్పుడు హేమంతముకాదా.

నటి—హేమంతమా! వసంతమా!

సూత్ర—మఱచితి! మఱచితి. వసంతమే. మాధవవిలాసమే వర్ణనీయమగు.

నటి—ప్రదర్శనీయమగు నాటకమిదమిద్ధమని నిశ్చయించితిరా!

సూత్ర—నీపాట కానిచ్చులోపల నాలోచించెదను.

నటి—ఇదుగో పాడుచున్నాను,

గీ॥ సరసశుకకోకిలాలాప సంభృతంబు
మధురమాధవసంవాద మంజులంబు
పల్లవాస్త్రప్రభావసంపల్లవంబు
లలితబహుచిత్రమైన కాలంబుసూవె॥

సూత్ర—మేలు! మేలు! నటీ! ఏదీ! ఇంకొకమాటు.

నటి—[తిరిగి యాపద్యమునే చదువుచు]
నేనుపాడినందుకు మీరువినినందుకు సరిపోయినది. మ్ముందుసంగతి యేమైన ముడిపడినదా!

సూత్ర—ముడిపడ కేమి. మఱచితినటీ! సభవారియభిప్రాయము నీలేఖపైన వ్రాసిపంపిరి. చూడుము.

నటి—(చూచి చదువును)

క॥ చూచితి మితిహాసంబులఁ
జూచితిమి పురాణములను సుందరగాథల్
సూచితి మదృష్టపూర్వము
నీచతురతఁజూపి మాకునింపుము వేడ్కల్॥

[కొంచెము విమర్శించి] కట్టా! నాకుఁ గడు నధైర్యము గలుగుచున్నది. ఇప్పు డేనాటకముఁ బ్రదర్శించి యీరసికుల రంజింపఁగలుగుదుమో తోచకున్నది.

సూత్ర—ఇంతసందియమేలా! నీనోటివెంటనే చెప్పితివికా. నీధృవాగాన సూచితమైన చిత్రమాధవమునే ప్రదర్శింతము. అయ్యది యదృష్టపూర్వము. అఖిలజన మనోరంజనము.

—ఆర్యపుత్రా! సంతోషము. కృతికర్తయెవ్వరో మనపాలిటి పుణ్యమూర్తి.

సూత్ర—నటీ! వినుము.

సీ॥ భీమనవంటి గంభీరవాక్యమువాడు
సోమనబోల్ చిత్రసూక్తివాడు
తిక్కనకెనవచ్చు తిన్ననినుడివాడు
తిమ్మననామాట తీపివాడు
సూరనబోల్ గాథ సోయగంబుగలాడు
కాళిదాసునిబోలు కవితవాడు
దండిపీడనఁబోలు దండివర్ణనవాడు
పెద్దనబోలు బల్ సుద్దివాడు

గీ॥ ఐంగలండవకవులలో లింగడనుచు
పేరుగాంచినవాడు షేక్స్పియరుసుకవి
కామెడీఆఫెరర్సను నామమునను
వ్రాయ నుతిగాంచెఁ దొలుత నాంగ్లేయభాష॥

నటి—ఇదియంతయుఁ బరిహాసముగాఁ దోచుచున్నది. ఆంగ్లేయభాషలో వ్రాసినవాడెట్టివాడైన నాటకమెట్టిదైన నాయసమంజూషములోని పాయసమువంటిదేకదా.

సూత్ర—ఇంత తొందఱయేల! నామాట నానోటిలోనుండగనే యెన్నిమాటలాడితివి. ఆనాటకరాజమిప్పు డాంధ్రలోకమున కుపయోగించునట్లు లాంధ్రీకరించఁబడినది.

నటి—అట్టిమహాకవి షేక్స్పియరుచే రచియింపఁబడిన, నాటకరాజమును దెనుంగుబాస రచించిన కవివర్యుని నామధేయంబెఱుంగ నామనము కుతూహలపడుచున్నది.

సూత్ర—

సీ॥ పండితుండే కాదు నిండు సభలలోన
    పన్యసింపఁగఁజాలు వాజ్మిను వె
కవితయే కాదలంకార శాస్త్రాంబుధి
    పారమొందఁగఁజాలు ధీరుడరయ
సాహితియే కాదు సంగీతమందున
    మెఱుగు లెఱిగినయట్టి సరసుడరయ
విద్వాంసుడే కాదు విద్యార్థికోటికి
    బోధసేయఁగఁజాలు బుధవరేణ్యు

గీ॥ డహాహ యొక్కఁటఁగలఁడు లేఁడంచు నొకట
    జెప్పశక్యమె శ్రీ వెంకటప్ప శాస్త్రి
    జ్ఞానసర్వస్వమును లోనఁ బూనియుండె
    నతనికొమరుండు సుగుణుండు వితతయశుఁడు

సీ॥ ఆవాసమా పార్థివావాసమై యొప్పు
    విభవాలకిక్క నూజ్వీటిపురము
గురువులా కురుకంటి వరవంశమణులైన
    సూర్యనారాయణ సూరివరులు
హితవర్యులెన్నగా శతవధానులు శివ
    రామశాస్త్ర్యాదులు రమ్యకవులు
చదువులా హూణాంధ్ర సంస్కృతసాహిత్య
    మైయొప్పు నతని కోయతివమిన్న

గీ॥ దంటుకులవార్ధిచంద్రుడై ధన్యతగను
    వానినెన్నెద సుబ్బావధానిసుకవి

    సతమురచియించె లలితమౌ నాంధ్రమందు
    చిత్రమాధవమను పేరఁ జిత్రఫణితి

నటి—ఈమహాశయునికీ యుద్యమము స్వోత్సాహమా? ప్రోత్సాహమా?

సూత్ర—రెండును గంపలగూడెము సంస్థానాధీశ్వరుండయిన కోటగిరి జగన్నాథరాయలీకవివర్యుని తమయాస్థానమునకు రావించి బహుమానములు జరపిననాఁడు సభలో రాయలదత్తపుత్రుండైన వెంకట కృష్ణరాయనిచే నాశువుగాఁ జెప్పబడిన యీ మౌక్తికచాటు ప్రబంధరాజమే యీకవికింగల ప్రోత్సాహమును వేనోళ్ళ చాటుచున్నది.

నటి—ఆమౌక్తికమును నాకొక్క పరికర్ణభూషణంబు గావింపుము.

సూత్ర—

సీ॥ అష్టావధానమ్ము నాచరించెదవంచు
    మృదువైనకవితఁ జెప్పెదవటంచు
బాల్యమ్మునను చిత్రమాధవమ్మును నవ
    రసములనొప్పించి వ్రాసితంచు
కొంకింతయు లేక వేంకటేశ్వరసహ
    స్రంబు మధురశైలి సలిపితంచు
వాగ్ధోరణీశక్తి పలుమారుగనినల్వ
    చెలువనీ వాయిలో వెలసెనంచు

గీ॥ దలచి నూటపదార్లు నాతండిడియొసగె
    కొద్దియంచెంచకీవు గైకొనగదయ్య
    నూటపదియారులేగాదు కోటియైన
    దగునెనీకింక సుబ్బావధానిసుకవి

నటి—ఆర్యపుత్రా! సంతోషము! సంతోషము! అట్టిప్రోత్సాహము
న్న కవివరేణ్యున కెట్టిలోపములు కలుగనేరవు గదా.

[తెఱలో)

ఉ॥ పుట్టితివీవుకొంకణపుభూమిని నేమనినిన్ను గాతునే
పెట్టినయానతప్పదునె బెట్టిదముల్ దలపెట్టిమీవిభుం
డిట్టనరానిచట్టముల నిట్టటుచేసెనునాదు సాహులన్
గొట్టుమనీదుమస్త మెదఁగోరిభజింపుము నీదువేల్పులన్

నటి— ఆర్యపుత్రా! నాకుభయమగుచున్నది. ఎవ్వరివీవీరాలాపములు

సూత్ర—ప్రేయసీ! తొందరపడకుము పాండ్యదేశభూపతియగు నిరంకుశుండు శత్రుదేశమయిన కొంకణదేశమునుండి యిచ్చటకు వచ్చినవాని నెవనినో శిక్షింపుచు కోపముతో వచ్చుచున్నాడు. మనమిక్కడ నుండరాదు. పోవుదము రమ్ము.

(నటీసూత్రధారులు నిష్క్రమింతురు]

శ్రీ శారదాయై నమః

చిత్రమాధవనాటకము

ప్రథమాంకము

ప్రథమ రంగము.

మధురాపురంబున పాండ్య దేశాధీశ్వరుని సభామంటపము.
(ప్రవేశము నిరంకుశుఁడు, వర్ధమానుఁడు, భటులు.)

వర్ధ—మహాప్రభో! దోసము చేసినవాఁడఁగాను. తెలియక వచ్చితిని. నన్ను క్షమింపవేడెద. దేవరవారికి నామీఁద దయపుట్టదేని నన్నుఁ ద్వరలో నంతమొందించి నావంతల నంతముఁ జేయ వేఁడుచున్నాఁడ.

నిరం—కొంకణదేశపుఁగోమటీ! నీవింకఁ బలుమారు చెప్పంబనిలేదు. రాజశాసనములు పక్షపాతము సహింపవు. ఈనడుమ మీనాటి యేలిక మాసీమలనుండి బేరములకై వచ్చిన సాహుకార్ల నిర్బంధించి వేయిరూప్యంబులిచ్చిన విడుదలపెట్టుచు లేనిచోఁ దలఁగొట్టుచు నింకఁ బెక్కులు బెట్టిదపుంబనులఁ దలపెట్టుటచేఁ గలిగినకోపమ్ముఁ బాపనోపము. ఆయూరీయూరికి నెంతదూరమో, యీయూరాయూరికి నంతియదూరము.

ఉ॥ కొంకణదేశవాసులిటఁగొంకక జంకకవచ్చి, చొచ్చి యే
వంకలఁ గానవచ్చినను బ్రాణము సర్వము పోవుఁగాని వే

టంకము లిచ్చెనేనియు దిటంబుగ మస్తకముందునంచు ని
శ్శంకతఁ జట్టముల్ నెఱపి సల్పుదుఁ బాలనఁ దత్ప్రకారముల్॥
ఉ॥ పుట్టితివీవు కొంకణపుభూమిని నేమని నిన్నుఁగాతు నా
పెట్టిన యానతప్పుదువె బెట్టిదముల్ దలపెట్టి మీవిభుం
డిట్టనరాని చట్టముల నిట్టులఁ జేసెను మాదు సాహసుల్
గొట్టుదు నీదుమస్తమెదఁ గోరి భజింపుము నీదువేల్పులన్॥
వర్థ— గీ॥ విసివి వేసారి వంతల కసటుఁగుడిచి
యసువులే దాల్ప నాకు వెక్కసముతోఁచెఁ
గఱకులాటను నీనుడుల్ గొఱకు నాదు
దుఃఖపాశంబు మొదలంట; దొరకె మేలు॥

నిరం—(ఆశ్చర్యముతో) కోమటీ! నీయిల్లువదలి యీపాండ్యదేశంబున కేమికతంబున వచ్చితివి? చావన్న నావంతయు భీతిలేక యిట్టులాడుటకుఁ దెంపెట్లుపుట్టె? నీచరిత్ర వినవలతుము.

వర్థ—ఉ॥ చెప్పఁగరాని ముప్పులను జెప్పుమఁటన్న వచింప భారమా
ముప్పులమున్నియుండినను మొండినిఁగాన నశింపకుంటి నా
ముప్పులు దైవయోగమునమూఁడెను నాదొకయింత లేదు వే
బొప్పులు తిన్నబుఱ్ఱకిఁకఁ బోరలఁబడ్డను బీరమూడునే॥
ఉ॥ కొంకణదేశమందుఁ బెదకోమటి గీమున బుట్టియుంటి నే
వంక కళంకులేని యొకపంకజనేత్రను గట్టికొంటి నే
శంకయు జంకులేక యలసాహెబుమూరులఁగూడి బేరముల్
బింకముతోడఁ జేయఁదరి పేదయి పిమ్మట నమ్మకానకై॥
మ॥ వరకాశ్మీరపు మేలు శేలువలు చెల్వంబైన దువ్వాల్వలున్
మురిపెంపున్ సరిగంచుఢక్కపురిమేల్ నూల్ నేతలున్ వ్రాతలున్
బరిణల్ దంతపుఁ బెట్టెలున్ బవడముల్ పాండ్యంపుముత్యంబులున్
గరమొప్పన్ గ్రహియించి బేరమునఁ బైకంబొందఁగా సాగిలిన్॥
మ॥ సిరియా బాక్ట్రియ రోము పారసికమున్ సిద్దీలదేశంబునన్
దిరుగన్ గాలముపుచ్చ నాదు నెలలెంతేగుంది సూనాస్త్ర భీ

కరమౌ కాండములన్ గృశించి నిలువన్ గాలాడకింటన్ సుఖం
ప గమింపన్ ననుగూడి కాంత వెడలెన్ బార్సీల దేశానకై॥

దేవా! యాపారసీకదేశమందు నన్నుఁగలసికొని నాభార్య నాతో సుఖంబుండె.

ఉ॥ బేరముహెచ్చె లాభములఁ బేరిచి బీరముగల్గు బేరినై
మారశిలీముఖంబులను మ్రందుచుఁ గుందుచునున్న కాంతతోఁ
గోరికలూర నేనట నకుంఠిత లీలల సంచరింప న
వ్వారిజనేత్ర తాఁగవలబాలుర నిద్దఱఁగాంచె నయ్యెడన్॥

మహాప్రభో! అదేమి వింతయో! యాముద్దుకుఱ్ఱ లిద్దఱేకరూపులై నామములఁగాని యానవాలు పట్టుటకు వీలులేకయుండిరి. అట్టి సూనులఁ గాంచినందులకు మే మపరిమితానందమును బొందుచుంటిమి. ఆసమయముననే మాయింటి ప్రక్కనున్న సత్రమునందొక పేదరాలిద్దఱుబాలుర నేకరూపులఁ గాంచికన్నందులకు వారి నెట్లుపోషింతునాయని కన్నీరు మున్నీరుగా విలపించుచుఁ దుదకు గుండె రాయి చేసికొని యాముద్దుకుఱ్ఱల నిద్దఱ నమ్మఁజూపెను. లేమియెంత లేసిపనులఁ జేయింపలేదు? అంతట నోదేవా! నేనాబుడుతలఁగొని నా కొడుకులతోఁ బాటు పెంచుకొనుచుంటిని. ఇట్లుండ నాభార్య యింటికిఁ బోవ నన్ను వెన్నంటి తొందరచేయుచుండ, రాజా! యేమనివిన్నవింతు? నొక్కస్థిరవాసరంపు దుర్ముహూర్తంబునఁ బసోరాబయలు వెడలి యొక్క మంచినావ విచారించుకొని పయనమైతిమి. హా! దైవమా! నాపడ్డ యిడుములన్నియు నానోటనే వచింపఁ జేయుచుంటివా!

ఉ॥ గాలియునగ్గిగూడి వడిఁగాలుచు లోకమునందు రందఱన్
గాలియు నీరుజేరి వడినాశముచేయును నౌకలన్నిటిన్
గాలము దాపుసేరుతఱిఁ గాలముఁబోలిన వార్ధిగాలియున్
గాలునిఁ జేర మమ్మనుపఁగా సమకట్టెను మేదినీశ్వరా!॥

శా॥ నిండెన్ గా విరిదిక్తటంబులను మున్నీరెల్ల ఘోషిల్లె మా
గుండెల్ ఝల్లనె వీచెవాయువులు దిక్కుడ్యంబులన్ ద్రొల్పఁగాఁ
దుండంబుల్ పదివేలు సాచి దివితోఁ దూటాడు యూథంబు నా
మెండై నిండెను మింటవీచికలు స్వామీ! యంతనాభీలమై॥
ఉ॥ ఎత్తినచాపలన్ దిగిచి యెల్గున ఫల్గున పార్థయంచుఁ బే
ఱెత్తిన భీతిమైఁ బిడుగు లేపునఁ జూపున రాలనార్చి మా
చిత్తములుత్తలంపడఁగఁ జేపడిఁగల్గిన నావవాండ్రు ప
ర్వెత్తిరి దోనెలన్ దవిలి యేదియుఁగానక యీదుచున్ వడిన్॥
ఉ॥ చేరులులేని యుయ్యెలను జేరి యపారము ఘోరమైన సం
సారముఁ బోలు నీరనిధిసారతరంగములందు నూగుచున్
భారము శౌరిపై నిలిపి బాలురు మాతయు భీతినేడ్వ మా
యూరును బేరమున్ సరకునూరకఁ దల్చుచునుంటి భూవరా॥

నిరం—నీవు చెప్పుకొలఁది నాకును వినవారట పుట్టుచున్నది. చివర
వరకుఁ జెప్పుము.

వర్థ—ఏమనివిన్నవింతుఁ బృథివీశ్వర? అంతట మునక పరువులోనున్న
పడవలో నుండనలవికాదని పిన్నశిశువును రెండవకవలలో రెం
డవవానిని నాభార్య విడిగానున్న నొక్క తెరచాప కొయ్య
కొక్కప్రక్కనుగట్టి తాను నావైపుననుండ మిగిలిన యిద్దఱికు
ఱ్ఱలతో నేను రెండవతట్టుననుంటిని. ఇట్లుండ నకాత్తుగా నోడ
లబుక్కుమని మునిగిపోవ బుడ్డనమ్మి గోదావరిఁబడ్డరీతిఁ జాపకొ
య్యనమ్మి సంద్రంబునఁ గొట్టుకొనిపోవుచుంటిమి.

గీ॥ పోఁగబోఁగను దరగల పోటుతగ్గ
గాలికాల్ నిల్పె నురుగులతూలుదడగ
జల్లుపెల్లాగె గుండెలఝుల్లడంగెఁ
గంటికట రెండుపడవలు గానవయ్యె॥

ఆపడవలు దరికిరాకమునుపే, అయ్యో! నాకు నోరాడకున్నది. నే
నింకఁ జెప్పజాలను. హా! దైవమా!

నిరం—అయ్యో! పాపము. మేము క్షమింప నవకాశము లేకపోయిన
ను జాలిపడవచ్చును గదా. చివరవరకుఁ జెప్పుము.

వర్థ—ఏ వేలుపులేని మాపాలిఁట నీపాటిజాలికలిగిన నాకీపాటిపాటువా
టిల్లకుండునుగదా. అదేటి గ్రహపాటో యలలపై నాడుచు
వచ్చుచున్న మా తెప్పకొయ్య యొక్క తిప్పకుఁదగిలి రెండు
వ్రయ్యలయ్యె. రెండవతుండు నేనుండు తుండుకంటె దుఃఖభర
మున సమానమయ్యు భారమునఁ దక్కువగుటచే గాలికిదూ
లుచుఁ గొట్టుకొనిపోయి పోయి యొక పడవచేరువకుఁ బోవ
నాకలాసులు నిరాశులయియున్న తల్లిని శిశువుల నిద్దఱ లోని
కందికొనిరి. అప్పటికే నాచూపుచూపుగాకుంట వారిని గుఱిం
చి నాకేమియుం దెలియదు.

గీ॥ ప్రాణకాంతను గోల్పోయి ప్రాణహీన
మైన నన్నును శిశువుల లోనకంది
కొనియె నొక్కఁడు మాయూరు గొనియె నన్ను
చిలుకపోయిన గూఁడేమిసేయుభూప॥

నిరం—పాపము! వారికొఱకా నీవిదుఃఖపడుట? వారితరువాతవృత్తాం
తమేమయినఁ దెలిసెనా! పిమ్మట నీస్థితి యెట్టులుండె?

వర్థ—మహాప్రభో! నానాదేశంబులందున్న మాయడితీదారుల కీవర్త
మానమెఱింగించి వారల వెదుక నియమించితిఁగాని నాభాగ్య
మిట్టులున్న వారలజాడ నాకెట్టు తెలియఁగలదు? ఇంటియొద్ద
నీబుడుతలఁ బెంచుకొని కాలక్షేపము సేయుచుంటిని. ఇట్లుండ
పదునెనిమిదేండ్ల ప్రాయముగల నాపెద్దకుమారుఁడు తనతోఁ
గూడ పెరిగిన సేవకునితోఁగూడ నొక్కనాడు ప్రసంగవశమునఁ
దనతల్లినిగురించి యడుగ నేనీప్రచారమంతయుఁ జెప్పితిని. వార
లందుమీఁదఁ దల్లినిఁదమ్ముల వెదుకుదుమని బయలువెడలి నేటి
కైదేండ్లాయె. నాగతి "నీటనున్నదానికై నోటనున్నదూడె"
నన్నట్టులాయె. నాకింట నిలువఁగాలాడక వీరికై యీడనాడఁ

బరికించి యీపురిఁ జేరఁ దుదకీగోరుచుట్టుమీఁద రోకంటిపోటు ప్రాప్తించె. నావంతలు, నాపట్టియాసలు, నాపయనంబులు, నేఁటితోఁ దీరిపోయె.

నిరం---సెట్టీ! నిను జూచుకొలఁది నాకు జాలిపుట్టుచున్నది. నేరాజునుగాన రాజునై యానవెట్టితిఁగాన యానవెట్టి తప్పుట రాజధర్మముకాదు గావున నేనిట్టాడవలసెఁగాని లేకున్న నీగతినున్న నిన్ను విడిపించుటకు నేను మొదటివాఁడనై యుందును. అయినను నీయెడఁ బ్రసన్నుండనైతి. ప్రొద్దుగుంకువరకు నీపురము నందెల్లఁదిరుగాడి నీమిత్రుల నరసివేడికొని వేయిరూప్యంబులు దెచ్చి దివాణంబునకు దాఖలు చేయఁగలిగితివేని నీప్రాణంబులు దక్కును. నేనింతియ నీకుఁ జేయఁదగిన మేలు. సేవకా! వీనిని గ్రహింపుము.

(భటుడు వర్ధమానుని స్వాధీనము చేసికొనుట)

అందఱు నిష్క్రమింతురు.

చిత్రమాధవనాటకము.

ప్రథమాంకము.

ద్వితీయరంగము.

(ప్రవేశము. కొంకణదేశపు మాధవుఁడు, పల్లవుఁడు, వర్తకుఁడు.)

వర్త—మీపున్నెంబాబు! మిములొన్నరన్నా అడిగితే మాది కొంకణదేశంకాదు. ఒంకణదేశమని చెప్పండి. ఇదినం పాతక్కాలాన మావైశ్యుడొకఆయన యీవూరొస్తే పట్టుకున్నారు. ప్రొద్దుగ్రుంకేవేళ కాయన సిరసు తీస్తారు. మారాజు మంచోడుకాడు. రాజుతల్చుకుంటే దెబ్బలకు కొదువాయేమి (అని పైకపు సంచి చేతికందిచ్చి) బద్దరం నాయనా!

మాధ-కొం--పల్లవా! నీవీసొమ్ముఁగొనిపోయి యావల మచ్చుల చావడిలో మెలఁకువతో మెలంగుచుండుము. నేనీనడుమ నీయూరనున్న వాణిజ్యసంఘంబులు, మేడలు, మిద్దెలు, రాచవీధులు, రచ్చలు పరికించి భోజన సమయమున కచ్చటికి వచ్చెదను. పయనమున నామేనెల్ల సొలసె. పవటిపూట నాప్రక్కనున్న సత్రమున నించుకంత విశ్రమింతును, జాగుసేయక పొమ్ము.

పల్ల-కొం-- చిత్తమయ్యా! (అని కొన్నియడుగులునడచి వెనుకకుఁ దిరిగి నవ్వుచు) ఒక్కమనవయ్యా! ఈమహాపట్టణంలో వింతలు విడ్డూరాలు శానా ఉంటయి. అయ్యగారు నీటుగోటుమీద పోత్తూ ఉంటారు. నీటుకత్తెలూ, ఆటకత్తెలూ, పాటకత్తెలూ, అందకత్తెలూ, కొంటెనకత్తెలూ, శంటుఘాలానికి యకరంకంచన్న

ట్టుగా బుంగ్రాలాగాలతో బజారున బుజాలు రాచుకొని తిరుగుతూఉంటారంట. నెమ్మదిగావెళ్ళి బద్దరంగాచూచి సేమంగా దయసెయ్యండి.

(అని నిష్క్రమించును.)

మాధ-కొం--(వర్తకునితో) వీఁడు గడుగడసరిసుఁడీ! సమయవేది నామనస్థితి కనుపెట్టి చమత్కారముగ నన్నానందపెట్టుచుండు. రండి! యీనాల్గువీధులు చూచిపోయిమనమక్కడనే భోజనము చేయుదము.

వర్త---ఆ! దానికేంతెగుస్తురూ! అందుకడ్డేమిటి అయ్యా! కాని యీతపకొదివెయ్యండి. ఇయ్యాల పెడవారింటో పప్పన్నం. ఆరింటికాడ భోజనాలు. ఆరిదగ్గిర మాక్యూస్తింత ఖాతావుండది. ఆలెక్కడి సూసుకొని అరింటికడనే భోంచేసి ప్రొద్దుగ్రుంకే వేళకు మీయింటికొస్తా. ఇప్పటికిశెలవు. (నిష్క్రమించును)

మాధ-కొం--చిత్తము— నేనీపురి నొక్కపరి నీమూలనుండి యామూలవరకుఁజూచి వేగమ తావునకుంబోయెద.

ఉ॥ తల్లినిఁ దమ్ములన్ గనక తల్లడపాటున నిన్ని నాళ్ళుగా
నెల్ల దిగంతముల్వెదకి యేడనుగానక యీడఁ జేరితిన్
దల్లిరో! నేలయీనిన విధంబుననున్న నరాటవీస్థలిన్
గల్లయకాని నిన్వెదుక నాకగునా విధి యెంత క్రూరుఁడో॥

(ప్రవేశము పల్లవుఁడు పాండ్యదేశజుఁడు).

అదేమి పల్లవుఁడప్పుడే వచ్చుచున్నాఁడేమి? (వానితో) ఏమిరా! యేటికింత వేగమే మఱలివచ్చితివి?

పల్ల-పా--డబ్బు నెచ్చానన్నట్టే వుండది ఆడాడ యెతుకులాడి యీడకొచ్చేతల్కి అల్సం అయ్యింది. సిప్పారిపోయె నెయ్యి పేరిపోయె గడేరం పన్నెండు కొట్టింది మాయమ్మగారు యీశ్చి నాచెంపమీద ఓటిగొట్టింది యిదేటయ్యగారూ! యేఁయేళాయె, యేయేళాయె, వంటయి అన్నం చల్లగచల్లారిపాయె.

అమ్మగారు నామీఁవబగ్గునమండిపడుతుండె. పొట్టతొందరలేనోరు యింటికొస్తారా! సల్ది గుడిచిపోయి నోరికి పొట్టతొందరుంటదా? యేటొచ్చీ పొద్దుటేలనుంచి బువ్వలేని శూద్రప్రాణానికి నాకేవచ్చిందిసావు.

మాధ-కొం--నీయమ్మకడుపు బంగారుగాను అంతటనిలు. గుఱ్ఱమును దిగు. నేనిచ్చిన పైకపుసంచి నెక్కడఁబెట్టితివిరా!

పల్ల-పా--ఆ. అయ్యా! మొన్న తమరిచ్చిన రెండురూపాయిలలో కొంత గుఱ్ఱపోడి కిచ్చానయ్యా! అద్దరూపాయిగామల్సు గుండీఁకు జర్జీఆయన కిచ్చానయ్యా! ఆరణాలుపెట్టి కూరలు దెచ్చానయ్యా! మిగిలినదమ్మగారికిచ్చానయ్యా! నాదగ్గరేమిలేదు.

మాధ-కొం--చీ! గాడిద. సమయాసమయములను గుర్తెఱుంగవలదా? హాస్యప్రసంగముల కిదియా సమయము. నాకుఁ జిరాకు పెల్లగుచున్నది. మనమీయూరికిఁగ్రొత్త. ఈయూరుమనకుఁ గ్రొత్త. ఎవనినమ్మి యెవనిచేత బెట్టితివేమిగ్రహచారము.

పల్ల-పా--కోడిగం కాదయ్య. అమ్మగారు కనిపెట్టుకొంది. భోజనానికి దయచెయ్యండయ్య. తప్పులన్నిమావి. ఒప్పులన్నియుమీవి. నేచేతులూపుకుంటూ వచ్చినట్టేయెత్తినా నీతప్పులన్నీ అమ్మగారు యియ్యాల నాచెంపమీద రాస్తది. ఒకటికి ఒకటే రాసద్దో. ఒకటికి రెండేరాసద్దో. నాకు పొట్టే గడియారం. యెక్కడున్నా భోజనాల యేలదెలియపర్చి నౌకరు గివుకరక్కరలేకుండా యింటికి దోలుకొసద్ది.

మాధ-కొం--ఓరీ పశువా! నీకు పిచ్చిపట్టినదా యేమి? సమయాంతరమందు సంతోషముగానున్నప్పుడుకాని యిప్పుడేల బేలవై ప్రేలెదవు. నాపైకమేమిచేసితివి?

పల్ల-పా--నాకయ్యా. నాకు తమరు పైకమిచ్చారా? ఇచ్చినదానికి లెక్క చేసితినిగా.

మాధ-కొం--ఛీ! భడవా! నీకొప్పఁజెప్పినదేమి చేసితివి?

పల్ల-పా--నాకొప్పజెప్పినదయ్యా. తమయింటికిలక్ష్మీనిలయమునకుఁదమను తోడుకొని రమ్మని మాఅమ్మ నాకొప్పజెప్పినారయ్యా. మాయమ్మగారు ఆమెచెల్లెలుగారు తమకోసం కనిపెట్టుక కూకుండారు.

మాధ-కొం--గీ॥ విసికి వేసారియున్నట్టివేళనీవు
కాలమెఱుఁగకహాస్యంపు గవచమొడలఁ
దాల్చి భయమేమిలేక సంతసమునుంటి
పగులమొత్తెద దానిలే బాలిశుండ॥

బాలిశాధమా? ఎవతెరా నీయజమానురాలిచ్చట? నిన్నెవరిక్కడకుబంపిరి?

పల్ల-పా--గీ॥ ఎవతెయింటను నీరాకకెదురుజూచి
కుడువనొల్లక నినువీడి కోపగించి
యంపెనన్నిట నినుదేగ నాపెసుమ్మ
నాదు యజమానురాలయ్య నీదుభార్య॥

మాధ-కొం--ఇంక నిట్టుల వదరుచుండెదవే. నీకిదే తగినశాస్తి.

(కొట్టును)

పల్ల-పా--బాబో! చాలయ్యా! తమరు చేతులు తూలగాయిచారించండీ. యిదల్పరాదు. అయితే నాకాలు జాడిస్తా.

(అని నిష్క్రమించును)

మాధ-కొం--(స్వగతం.)..

ఉ॥ ఎన్నఁడుమేరమీరక మదీరితముల్ నెరవేర్చు నీతఁడే
మెన్నడులేనిపోడుముల నీగతివాగె నిదేమిచిత్రమో

తిన్ననివానికిట్టు లతితీవ్రముగా నిటఁబిచ్చిపుట్టెనే
యన్నను దల్లికై వగవనాప్తుఁడుగూడ నిశైననెట్లకో॥

ఉ॥ మైకముఁజల్లి పైకమునుమాయముజేసిరొ మోసగాండ్రొగీ
దూకముతప్పి చిత్తమిటుఁదూగుచునుండెఁ బ్రయోగమేమొకో
వీకనుబారిపోయెనిఁక వీనిఁగనుంగొనుటెట్టులోక్కొ హా!
పైక మదెట్టువచ్చు మఱీపల్లవుఁడేగతిఁ జిక్కుదైవమా॥

ఈయూర మోసగాండ్రు నైంద్రజాలికులు గారడివాండ్రు మిక్కిలి గరని వాడుక. వారలెవ్వరేని వీనిపై తమ కౌశలముఁ బ్రయోగించి యుండరుగద. పయిక మేమాయెనో? పల్లవుఁడేమాయెనో. మచ్చుల చావడికై వెదకుచుఁ బోయెదఁగాక!

(అని నిష్క్రమించును)

ప్రథమాంకము సంపూర్ణము.

శ్రీ శారదాయై నమః.

చిత్రమాధవనాటకము.

ద్వితీయాంకము

ప్రథమరంగము.

(ప్రవేశము కోకిల-శుకము.)

కోకి---ఉ॥ అల్లదె రెండుగొట్టె గడియారము చెల్లెల! యిల్లుఁజేర నా
వల్లభుఁడింక రాఁడటకుఁబాపినపల్లవుఁజాడలేమ గా

శుక--- కల్లరి బావగారికొఱకై యిట మాడఁగ నేలయక్కరో!
చల్లగఁ గూడుమెక్కెదము సాగవె యిప్పటికైన వేగమే॥

చ॥ వణిజుఁడెవండొ తిండికయి వారినిఁబిల్చెనొ వీధినుండియే
చనిరొకొ యాస్థలంబునకుఁజాలుస్వతంత్రులుగారె పూరుషుల్
వినుసమయంబుఁజూచి తమవీలునుజూచియథేచ్ఛఁబోచు వే
చనెదరు వత్తురెయ్యెడలఁజానరొ నీవికఁ దాల్మిఁజెందుమా॥

కోకి---సోదరీ! మనకంటె వారలకెక్కువ స్వతంత్ర మెందుకుండవల
యునో!

శుక---ఏపాముపుట్టనయినఁ జేయిదోపి సంపాదించుకొని రావలసినవాఁ
డు మగవాఁడు. ఇంటనుండి వంటచేసి తిండితినవలసిన దాఁడది.

కోకి---అగు నేనెంత యణుకువతో నతని యనుగులకు మనుగులొత్తు
చున్న నన్నతఁడీసడించక మానఁడు.

శుక---నీకతఁడు కక్కులకళ్ళెమువంటివాఁడులే

కోకి---కక్కుల కళ్ళెములకు గుఱ్ఱములా యేమి?

శుక---ఉ॥ కాంత హయంబు పూరుషుఁడు కళ్ళెముపట్టిన రౌతుశీలమౌ
గంతులుకట్టికాంతలకుఁగాంతులుతిన్న నిత్రోవజూప నా
వంతయు వంతరాదు తగువట్టుగ రౌతిల జిక్కఁడేని హా!
చింతల రౌతుగుఱ్ఱమును జిక్కులపాలగు నక్కరో! భువిన్॥

నింగినున్న విహంగములును భూమినుండు మెకములు నీటనున్న
మత్స్యములు వారివారి మగలవశమై వారియాన మీరకుండు.
ఇంకఁ బురుషులన్ననో సర్వజంతువులకు యజమానులు. మన
కన్న నేమివింత.

కోకి---"పిల్లకాకేమెఱుఁగునుండేలుదెబ్బ"యన్నట్లునీపెండ్లియగుదాక
యెన్నెని నీతులు వల్కవచ్చునుగదా.

శుక-- ఓయబ్బో! ఇంతపాటి కంతయనుభవ మక్కరలేదులే?

కోకి---పురుషులకు స్వతంత్రముండవలయునని నీవిట్లిప్పుడుఁ బల్కుట
యేకాని నీయనుభవము వచ్చినప్పుడు నీవును స్వాతంత్ర్యము
న కాసపడక పోవుదువా? నేఁజూడక పోవుదునా?

శుక---నీవలె నిట్లు మగనికి నెదురాడక యడకువతో నుండనేర్చికొని
యెద.

కోకి---ఇట్లనే మగండు నక్కడక్కడఁదిరిగి వేళకానివేళల నింటికిఁజేరిన
చో నేమిసేయుదువు?

శుక---ఏయెడ నేమరక నాథుని కనుసన్నలఁ గొల్చుచు కలకల నవ్వుఁ
జిమ్ము ముఖంబుతో సంతతమతని కాహ్లాదముఁ బుట్టించుచు,

నొక్కవేళ నతండనాదరణము జూపినను విసుకుఁజెందక దుడుకుఁబనుల జేసెనని తూలనాడక కఠినుఁడని కసరికొట్టక కోపగించెనని చెంబులు బిందెలు నిటునటు గిరటువైవక మృదుమధుర భాషణంబులతో నతని చెవిదండఁజేరి యుల్లము పల్లవింపఁజేయుటయె సాధ్వీలక్షణము. అట్టియాచరణమే నాకలవడుటకు శారదాదేవి తోడగుఁగాక !

కోకి---అగునే సోదరీ! నీయన్నది కాదననుగాని నామాట నొక్కింత వినుము.

సీ॥ పల్లెత్తినపుడెల్లఁ బుల్లవంపులతోడ నారళ్ళఁ బెట్టెడు నత్తగారు
అనుగన్ననకుమాటలందిచ్చి విభునితోనవియివి చెప్పెడి యాఁడుబిడ్డ
పదమునఁ బదమునర్థ్యర్ధన్యములుతీసి వెలపించికొనియెడు మఱఁదికుఱ్ఱ
పుండ్లపై కారంబుపూసినయట్టుల గ్రొత్తకల్పనలతో నత్తతల్లి
గీ॥ మాటపోటులబోఁటిని వేటలాడ
నేలు నాథునికరుణయే డాలుసుమ్మ
శుక--- ఏరి స్తుద్ధులో నీకేల యేరియత్త
యాఁడుబిడ్డయు మఱఁదియు నక్కనీకు॥

కోకి---సరి. ఆమాట పోనిమ్ము. ఇందుల కేమనియెదవు?

చ॥ చదువగ నేర్చితిన్ బనులఁ జక్కఁగఁ దీర్చెదఁ బాడఁగల్గుదున్
హృదయము పల్లవించు నుడులెప్పుడుఁ జెప్పెద నక్కటా ననున్
ముదితను వీడి లాతిపురుబోఁడుల జాడలఁ బోవు నాథునిన్
ముదమునఁ జూడఁగా మనసుపుట్టునె సోదరీ నీవె చెప్పుమా॥

అదియునుంగాక

చ॥ మనసులు సంగమించు తరిమానినికాంతునకర్ధభాగమై
తనరు నిజేశు నన్నిఁట స్వతంత్రతఁ గొబ్బున గాన్గఁ బెండ్లమున్

గనుగొనినంతమాత్రన ముఖంబెడఁ ద్రిప్పుచుఁగాని పోకడన్
పనివడిపోవు నాథుఁగన నంతల స్రుక్కెదె యెట్టిపైనన్॥

శుక---ఈమాటలు మన కెప్పుడునున్నవే, మా బావగారు వచ్చుచున్నట్టులున్నారు. మాధవాగమనమును సూచించు బల్లవంబులఁ బోలె మాధవాగమనము నీపల్లవుండు సూచించుచున్నాఁడు.

(ప్రవేశము పల్లవుఁడు)

కోకి---పల్లవా! మీయయ్యగారి దర్శనమైనదా? దాపునకువచ్చిరా?

పల్ల-పా--అమ్మ! తాపులిచ్చిరమ్మ

కోకి---నీవాయనతో మాటలాడితివా! ఆయనమనసును దెలిసికొంటివా?

పల్ల-పా--అయ్యగారిమణచు నాచెవిమీఁద గట్టిగాఁ జెప్పిందుకాని ఆడ బాగా పాడగట్టలేదమ్మ.

కోకి---ఏమి! ఆయన భావము నీకు నాటనే లేదా?

పల్ల-పా--నాటకేమమ్మ. నాసెంపమీద గట్టిగా నాటిందిగా.

కోకి---నీగోలకూల? మీయయ్యగారింటికి వచ్చుచుండిరా లేదా? (స్వగతము) ఆహా! యేమి యీచోద్యము.

పల్ల-పా--ఎందుకిన్ని మాట లమ్మగారూ? అయ్యగారికి ఇయ్యాళ పైత్యం యెక్కువయ్యింది.

కోకి---ఏమిరా యీపైత్యాలాపములు?

పల్ల-పా--పిత్తంకొంచెం చెలించిందమ్మా! బోజనం యేలయ్యింది. ఇంటికి రా అయ్యగారూ అంటే నా యెయ్యిరూపాయిలసంచి యేడపెట్టావు తెమ్మన్నమాటే అదేమాట అదేమాట యిసుకెత్తిపోయిందమ్మగారు. బోజనంవేళ అయిందన్నా నాడబ్బు తెమ్మన్నమాటే, ఇంటికిరా అయ్యగారూ అన్నా నాడబ్బు దెమ్మన్నమాటే. అన్నం చల్లారిపోయిందన్నా నాడబ్బు దె

మ్మన్నమాటే. ఇదేందోమరి. అమ్మగారు కనిపెట్టుక్కూకుం
డదయ్యా అన్నానమ్మ. అంటే నీఅమ్మగారడవిలో గలవ
నాడబ్బుదెమ్మన్నారమ్మా. ఇంకేమి మననిచేయనమ్మ.

(కోకిల తెల్లపోయి వినుచుండుట)

శుక---ఎవరురా! యీయన్నది?

పల్ల-పా--ఇంకా ఉన్నారింకాఅన్నారమ్మ.నాకిల్లులేదిల్లాలులేది కెల్లారా
యెదన! అన్నారమ్మ. చివరకు తిక్కెక్కిపోయి నాకుశం
పమీద యీపుమీద చెవిమీద నాలుగుతాపులేసి త్రోలేసి
నారమ్మా.

కోకి---ఇదియంతయు నమ్మఁదగినదిగాలేదు. మఱియొకమారు పోయి
పిల్చుకొనిరమ్ము.

పల్ల-పా--మళ్ళీయెల్లటమే మళ్ళీ దెబ్బలకా. మాఅయ్యో! యింకో
ర్నన్నా పంపండమ్మా. నావల్లకాదు.

కోకి---వెధవా! నీచెంప పగులమొత్తెదను పోవుదువాలేదా?

పల్ల-పా--ఆ! అయ్యగారికణతనుకూడా ఓముద్దర గుద్దితే మధల తల
కాఁయూద్ది.

కోకి---పో! పో! త్వరగాపో! చెప్పినమాటవిను. చేటు తెచ్చికొనకు

పల్ల-పా--నేనేమి సింపిచాటననుకొన్నావా యేంటమ్మా! మీయిద్దరి
సందున ఎవరికాలికిఁదగిలినప్పుడారు తన్నటానికి యింకాకొన్నా
ళ్ళీతాపులు తినాలంటే మేదరింటికిపంపించి కొత్తపేళ్లైన నాలు
గెట్టించండి. పోతాలెండమ్మగారూ. మీకెందు కింతకోపము.
(పోవుచు) పల్లవ భచ్చన్నంచేసేటట్టుందీ కోకిలమ్మగారు.

శుక---ఎంత పొగరుపోతువురా నీవు.

కోకి---మాధవుని విడనాడి యీకోకిల యెట్లులుండఁగలదు? సోదరీ!
వాని ననవలసినదేమున్నది. హా! మాధవా! నీకునాపై నింత
పంతమా.

ఉ॥ చెక్కులతళ్కుతగ్గనోకో చేరెడుగావోకో నాదుకన్ను ల
మ్మక్కరో! చిక్కదే నడుము మక్కువఁజూపనో నేను నీయెడన్
జక్కవజంటఁబోలదోకో చన్గవ కన్గొనినంతమాత్రనే
టక్కులమారిచేత నకటా! యిటులైతివి ప్రాణనాయకా॥

కరిబృంహిత వృత్తము

వారయువతుల మేలివలపుల పాలఁబడితివె నాథ నిన్
గోరి వలచెడు వారిజ నయన ఘోరముగనిటఁగుందఁగా
సారముడిగెనో నాదునుడులను సారముడిగెనో మోవియం
దార! గుణమటరోరి చలమున నాలిఁ దెగడుటలీగతిన్॥

శుక---అక్కా! ఏటికీచింత? వారేపనిమీఁదఁబోయిరో. యేవిసుకదల
మీఁద నిట్టులనిరో. నీవూరక వందురఁదగదుసుమా.

కోకి- -అదికాదే సోదరీ!

చ॥ వెలవెలఁదిన్ మదిన్ దలఁచి వేసరుచుండెను సోదరీ! యతం
డిల వెలనాతివేసములు నెత్తులుజిత్తులు బాసలున్ వగల్
గలుగునె నాకు వారవరకామినికై తపియించువారికిన్
గులసతితీరులన్ మనసు కోరికతీరునె తీరునే వగల్॥

చ॥ నను విడనాఁడడంచు మఱి నాకొనఁగూర్చు సుఖంబుఁటంచు నే
ననుకొని లేనిపోనివి మనమ్మున నమ్మితి నామనమ్ము రా
తిన నోనఁగూర్చెనే విధిమదిన్ దిగులొందకయుండ జింతలన్
గునియుచుఁ గ్రుంకిచ త్తుననుఁగూడకయుండిన నాథుఁడెమ్మెయిన్

శుక---మాధవ పల్లవవైముఖ్యంబున నెందఱు నావంటి శుకులు చెప్పి
న నీకోకిల యెట్లు శాంతించును?

కోకి---ఈగొడవచాలు. మనమేపోయి స్వయముగాఁ బిలిచికొనివత్త
ము రమ్ము.

* ద్వితీయాంకము *

ప్రథమరంగము.

సంపూర్ణము.

చిత్రమాధవనాటకము

* ద్వితీయాంకము. *

ద్వితీయ రంగము.

(ప్రవేశము కొంకణదేశపు మాధవుఁడు)

మాధ-కొం--సత్రపుయజమానుఁ "డిప్పుడేమీకై కాఁబోలునుపల్లవుఁడు వెదకుచుఁ బోయె" నని చెప్పెను.

(ఎదుటఁజూచి యాశ్చర్యముతో)

గీ॥ మైకమెల్లను విడిపోయెఁ బైకమబ్బెఁ
బల్లవుండల చాంచల్యమెల్ల దొరఁగి
పండియుండెను మచ్చుల పంచలోన
నొకటికొకటియుఁ బొసఁగదహా! యిదేమొ? ॥

నిద్రమేల్కాంచిసంచిఁ జేతఁబట్టుకొనివాఁడేయిటులవచ్చుచున్నాఁడు.

(ప్రవేశము పల్లవుఁడు కొంకణ దేశజుఁడు)

మాధ-కొం--ఓహో! పల్లవుఁడుగారా! తమతిక్క తిరిగినదా! ఏదీ తమ హాస్యప్రసంగమింకొక్కపరిఁ జూపింపుఁడు. నీవు మచ్చుల చావడి నెఱుఁగవుగదా! భోజనమునకు నన్నుఁ బిలువుమని మీ యజమానురాలు నిన్నంపినదీ! నీకేమి పిచ్చిపట్టినదా, ఏటికిఁ బల్లవా! నీవట్లు వాగినది?

పల్ల-కొం--(తెల్లపోవుచు) ఎప్పుడయ్యా నేనట్టా మాట్టాడింది?

మాధ-కొం--ఇప్పుడే. ఇక్కడనే. అరగంట నిండాకాలేదు.

పల్ల-కొం--పైకమిచ్చి మచ్చులచావడికి పంపినతరువాత ఇప్పుడేగా తమకు నేనగపడ్డ?

మాధ-కొం--ఛీ! వికవ! "నాకు మీరు సొమ్మియ్యనేలేదు. నాయజమానురాలు భోజనముకొఱకు మీకై వేచియున్నదని" నీవు చెప్పలేదా? నేనప్పుడు నిన్నుఁ గసరికొట్టలేదా?

పల్ల-కొం--ఇయ్యాల అయ్యగారు బలే కులాసామీఁదుండారు. ఏంటి అయ్యగారూ ఇట్టామాట్టాడుతుండారు?

(తెరలో:—మాధవా! మాధవా!)

మాధ-కొం--నీసోదికేమిగాని యెచటనో స్త్రీస్వనము వినఁబడుచున్నది. చూడుము.

(ప్రవేశము-కోకిల—శుక)

కోకి---చ॥ ఎఱుఁగనిదానఁగాను నను నెట్లనో చూచెదవేల నాథ! న
న్నెఱుఁగవె నేను గోకిలను నీప్రియురాల నిదేమిసోదె మీ
మఱపదియెట్లుఁబుట్టె నను మానమదేల? మదేల మాఱె నీ
కఱకుఁదనంబుమాని ననుఁగారియవెట్టక యింటికేగుమా॥

మాధ-కొం--(స్వగతము) ఎవ్వరీతన్వీమణి? నాపేరీమె కెట్లు తెలియును?

కోకి---సీ॥ పాడనికోయిలల్ పల్కనీ కీరముల్
వినవెల్ల నవినిన్ను వినకయున్నఁ
గాయనీ వెన్నెలల్ పూయనీమల్లికల్
గవ్వసేయవు నీవు నవ్వకున్నఁ
బూయనీగంధముల్ డాయనితెమ్మెరల్
హాయి లేదికఁ గౌఁగలీయకున్న
విచ్చనీదామరల్ రెచ్చనీ తుమ్మెదల్
సొంపుసూపవు నీవు చూడకున్న

గీ॥ ననెడి నీమాటలకుఁ దగినట్టిదానఁ
గానవో నన్ను నీదానఁగానొ నేను
ఏలచూడవు మాటాడవేల కాల
మెల్ల మారెను? నీకేల తెల్లపోవ॥

మాధ-కొం--(స్వగతము :—ఆశ్చర్యముతో)

గీ॥ ఈపెయెవ్వరు నానామమీమె కెట్టుఁ
దెలసియుండును దెలసిన వలపుసూపు
టేమి యదిగాక మగఁడనుటేమి? వింత!
నిలచి చూచెదఁగాక యీపొలఁతి నుడులు॥

(కోకిల సమీపించఁగా మాధవుఁడు వెన్కకుఁబోవుట)

కోకి---చ॥ పిలచిన నిన్నుఁగానటుల వెన్కకుఁబోయెదవేల నాథ! నా
పలుకులు నీకువిన్పడవొ పారవొ నీకివి ముల్కులయ్యెనో
కులుకుమిటారినిఁ గొకతెఁగోరి యిటైతివొ? ప్రాణనాథ! నీ
కులసతితోడఁగూడ నిటఁగొంకుచు నుంటివిఁకేమి సేయుదున్॥

బంధురవృత్తము.

నినుఁగనుఁగొనఁగనె కనుగొనలలరున్ నీకనులెవ్వతె నిల్పెనొకో
నినువినఁగనె మదిదనియును నుడులన్ నీచెవులెవ్వతె నింపెనొకో
ననుఁగనుఁగొనఁగను మనసునన్నటులీ నాటకమెల్లను జూపెదొకో
మనవిని విని ననుఁదనుపుము కరుణన్ మానిని వేచుట మాన్యమొకో॥

మత్తకోకిల.

ఇంతలోన మనంబుమాఱఁగ నేమికల్గెను మాధవా!
పంతమా! కులకాంతనన్ గడువంతముంచుట నిన్ను నే
కాంతమందున స్వాంతమున కాహ్లాదమొసఁగవె నాకు! హా
సంత శోభలవీడి కోకిల చావకుండునె చెప్పుమా॥

మాధ-కొం--ఆహా! ఇదేటివింత! చూచినకొలఁది యీసుందరి రెచ్చు
చున్నది.

ఉ॥ బాటలఁబోవుజవ్వనులఁ బాటలఁబల్కులఁ గుల్కుబెళ్కులన్
బోఁటులువాకిటన్ నిలచి బోరలఁద్రోయుదు రందురెందు నీ
వీటనుబోఁటియోర్తు నను వేపఁగ నాయమ నీవు నామగం
డౌట తెలుంగవొక్కొయని యాఁడివెట్టు నిదేమిచిత్రమో! ॥

కోకి---ఉ॥ „నాతిచరామి యంచు"జనులందఱిముందరఁగట్టుకొన్న యీ
నాత్రిని వీడఁగానగునె నాయెడ దోసమదేమిగల్గె హా!
నాతులు నీతిఁదప్పిరన నాథులు సైఁపఁగలేరుగాని తా
రీ తగవేమఁదారిఁ జరియించిన దారలు సైఁపనేర్తురే॥

చ॥ వలచి విదల్చు బాసయిడి పల్కుడు నమ్మిననాతిఁ బాయుటల్
దలఁచుసిదెంతయంచుఁ దనతప్పులు మూఁపునసంచిలోన నా
పొలఁతుకపొల్లు రొమ్మునపయి మూగఁగఁ గేఁగినకిన్కఁదన్నుఁదాఁ
దెలియకయుండుఁ బూరుషుఁడదేంతి నీయెడఁదోఁచెనక్కటా॥

సీ॥ కంటినాయొకని నీకంటెనుక్కువత్తోడఁ
గనులు కడ్డీలతోఁ గాల్చరాదె!
వింటినాయొకని నీకంటె మన్ననతోడఁ
వీనుల సీసంబు వేయరాదె!
వలపునొకనితోఁబలికిన నానాల్కఁ
గఱకురంపముతోడ నఱుకరాదె!
కూరిమినొకని నేఁగోరిన నాగుండె
గొడ్డళ్ళఁ బగ్గులఁగొట్టరాదె!

గీ॥ నిన్నె యన్నిఁట నమ్మిననీరజాక్షి
నిటుల దిగనాడి వెలనాతి సటలఁదవిలి

పోవనినుఁబోవనిత్తునె? భోజన సమ
యమ్ముమించెను వేవేగ రమ్ము నాథ!॥

మాధ-కొం--సుందరీమణీ!

ఉ॥ ఈపురినాకుఁగ్రొత్త యిపుడే యిటఁజేరితి జాము గాదిఁకన్
బాపురె! నాకుభార్యనని బాసలు సేయుచునుంటి వంతఁ బో
కే పువ్వుబోఁడినో దవిలి యీగతినుంటివనటంటి నీమొగం
బేపువ్వుబోఁడి నీపురిని యేనెఱుఁగన్ జనుమమ్మ కొమ్మరో॥

ఆహా! ఏమీ! యీపట్టణపు వైచిత్ర్యము!

ఉ॥ బాటనుబోవువారలకు భారియలబ్బిన నేమికావలెన్
బోఁటిరొ! నీదుగున్నులును బొల్లివగల్ ననుబోర్లఁద్రోయునే
నీటులుగుల్కు వారసతి నేఁరిమిమించితివీవు నేఁటికిన్
దేటగనుంటిఁగాని యికఁద్రిప్పకునామది నీకుఁ మ్రొక్కెదన్॥

శుక---చాలుఁజాలు! బావా! నీకీలోకమంతయు మార్పుఁ జెందినట్లున్నది సరసమునకు మేరలేదా? యేమి! మాయక్క జాలిగుండెపడి యింతదనుక నిన్నిరీతులుగ వేడికొనిన నీవిదియా చెప్పవలసినమాట? ఇంతకుముందేకదా నీయొద్దకుఁ బల్లవునిచేత మాటఁబంపినది

మాధ-కొం--పల్లవునిచేతనా?

పల్ల-కొం--నన్నంటమ్మా పంపింది?

కోకి---నన్నా యనియెదవేల? నిన్నే. ఇంటికిరమ్మన్న రాక నాకితడిల్లులేదు ఇల్లాలు లేదనిచెప్పి నాల్గుతావులు తాచిపంపెనని చెప్పియుండలేదా నీవు?

మాధ-కొం--పల్లవా! నీవీమెతో మాటలాడితివా? నీవెక్కడ కేగినను గుక్క జట్టీలనే తెచ్చెదవు.

పల్ల-కొం--నేనయ్యా? యీయమ్మ నిదేసూట్టం.

మాధ-కొం--ఛీ! భడవా! నీవు నాకు వీధిలో చెప్పినదీపెమాటలే.

పల్ల-కొం--ఏమోనయ్యా! తమరట్టాశలవిస్తేనేనేమ్మాట్టాణ్ణు. నేఁబుట్టిన తరువాత నీమెత్తో మాట్టాళ్ళేదు

మాధ-కొం--లేకున్న నీమెకు మననామధేయములెట్లు తెలియును?

కోకి--- గీ॥ తగదునీవిఁక వానితోఁదగవులాడఁ
దగవుగననైతి నియ్యెడఁ దగమినాదె
తగదు మగనాలి నన్నిట్టు లగడుపరుప
చాలు మాధవ! వాదమ్ము చాలుఁ! జాలు!॥

ఉ॥ మామిడిమోకనీవు నవమల్లి నేఁబెనగొంటినిన్ను హా!
గాములు సక్కనున్న సరిగామనమిద్దఱముంటిమియ్యెడన్
బ్రేమసడల్ప నీవునను రేఁపఁగ వేపగలాఁతిఁ దీవియల్
బ్రామెను నిన్నునన్ను సిఁక గావులఁ బెట్టకయున్నె నిచ్చలున్॥

మాధ-కొం--ఈమె నన్ను వదలునట్లు లేదు.

మ॥ కలయో! భ్రాంతియొ! కల్లయో! హృదయ వై
కల్యంబో నిక్కంబొ యీ
తలిరుంబోఁడినిఁ బెండ్లియైతినొకొ నే
తప్పాడితిన్ గంటి నే
వెలఁదిన్ సుద్దులవింటినే యిపుడు నా
పేరేది యూరేది వ్యా
కులమయ్యెన్ మదిఁ దోచదేదియును నాకున్
నిద్రయో దెల్వియో॥

శుక---పల్లవా! నీవుపోయి వెంటనే వడ్డన చేయింపుము.

పల్ల-కొం--ఈగాచారం ఏడనుంచి వచ్చిందిరా దేవుఁడా! చివచత్తుల్లాగ దగులుకుండారు. ఇద్దరూ చెరోమొప్పున.

శుక---ఓరీ! యెద్దూ! కదలవేమిరా? మొద్దూ! మాటాడవేమిరా?

పల్ల-కొం--అయ్యగారూ! నేన్నే నేనా? మారిపోయిన్నా?

మాధ-కొం--నామనసుకూడా మారినట్లున్నది.

పల్ల-కొం--లేదయ్యగారూ! నావొళ్లుకూడా మారినట్లున్నది.

మాధ-కొం--నీయాకారము మారలేదురా!

పల్ల-కొ--సూడగా, సూడగా కోతినైనట్టున్నా; లేకుంటే ఈకొమ్మల కు నాకేమి సమ్మందం ఉంటది.

శుక---నీవు మారిపోయినట్టైన గాడిదవేకావలె.

పల్ల---నిజమేకావలె. నీవు నామీఁద సవారీతీస్తుండావు. నాకూ గడ్డి కావలె. నేగాడిదనే కాదయ్యగారూ లేకుంటే ఆమెకు నేనెవ రో తెలిస్తే ఆమెవరో నాకు తెలియకుంటదా.

కోకి---చాలుఁజాలునీరద్ది. రండి! రండి! నన్నే మేడ్పించెదరు. తగిన యజమానుఁడు, తగిననౌకరు. ,,తగ్గమేళమునకుఁ గొయ్యతా ళ” మన్నట్టున్నది. నాథా! మనమిద్దరముఁగలిసి భోజనము సేయుదము. అమ్మాయీ! పోవుదమురా! పల్లవా! వాకిటఁ గావలియుండి యెవరువచ్చిన యజమానుఁడు భుజించుచుండెన నియు రాసమయముగాదనియుఁ జెప్పివుచ్చుము.

(మాధవుని చేయి పట్టితీసికొనిపోవుట).

మాధ-కొం--

కం॥ ఏలోకంబుననుంటిని
యేలోకముబోవుచుంటి నేమి యొనర్పఁ
వ్యాళోపహతుఁడనైతినొ
కాలంబుదేశంబుఁబనియుఁ గానఁగనైతిఁ॥

పల్ల-కొం--వాకిట్లో కావలి ఉండానయ్యా!

కోకి---ఎవ్వరిని రానీయవద్దు. రానిచ్చినచో నీచెంపలు పగులును, భద్రము.

శుక---ఈదినము మాబావగారికేదో పట్టినది.

(అందఱు పాండ్యదేశపు మాధవుని గృహమునకుం బోవుదురు).

ద్వితీయాంకము

ద్వితీయరంగము

సమాప్తము.

చిత్రమాధవనాటకము.

తృతీయాంకము. *

ప్రథమ రంగము.

(పాండ్యదేశమాధవగృహప్రాంగణము).

ప్రవేశము. పాండ్యదేశపు మాధవుఁడు, పల్లవుఁడు, పా. వేంకటరత్నము, వీరబ్రహ్మసోమయాజులు.

మాధ-పా--వీరబ్రహ్మం (స్వ) ఓహో! ఈనడుమ నీతఁడు జన్నంబొనర్చెఁగాఁబోలును (ప్రకా) వీరబ్రహ్మసోమయాజులూ!

వీర---అంతన్నవాగు చివర "గారు" కూడా అంటింతురు. మీనోట్టి ముత్యాలు రాలిపోవు. అంతగా రాలిపోతే తీగతో బిగించేస్తాను. మావారందఱు మీవారిలోకొందఱు ఎవరోకొంతమంది లేకపోతే ఏమికనుక నన్నాలాగే పిలుస్తూవుండారు. (చేత నొక జాబుతీసి) ఇదుగో చిత్తగించండి; ఆవూరినుంచి వెంకటఛాతుళ్ళగారు రాసింది. బెమ్మశ్రీ వేదమూర్తులైన యీర బ్రమ్మసోమయాజులుగారి చముకానికి.

మాధ-పా--ఇప్పుడంత యెందుకులే. మాయింటికిఁబోవుదమురా. నా భార్య కదుననుమానస్తురాలు. వేళకింటికిఁబోకపోతినా వేధిం

చును. ఇప్పటికే భయమగుచున్నది. తల్పు తీయునో తీయదో ఇంతదనుకఁ బుదుచ్చేరి గొలుసులు చేయించుచు నీయింటికడ నుంటినని చెప్పుము. ఏలయన.

చ॥ గొలుసులు దండలడ్డిగలు కోకలు రూకలు దెచ్చియిచ్చినన్
వలతురుగాని భార్యలిలవట్టిమగండన నీసడింపరే!
కలిగిన లేకపోయినను గాసులదోసిల బోసిగాని యే
పొలఁతుక పోరుమాన్పఁజనఁబోలును చాలునె వట్టికూరుముల్॥

(పల్లవునిఁజూపుచు) వీఁడొకఁడసాధ్యుఁడు మంచివాఁడనరాదు. చెడ్డవాఁడనరాదు, అమాయకుఁడనరాదు. గడుసరియనరాదు, వీథిలో గంటక్రిందట నన్నుఁగలసికొని భోజనమునకుఁ బిలిచినట్టు నేరానన్నట్టు తన్ను నేను వేయిరూప్యంబులడిగినట్టు తానెఱుఁగనన్నట్టు దాననేఁగోపగించికొట్టినట్టు నిల్లులేదు ఇల్లాలులేదు పొమ్మనినట్టు నొకక్రొత్తకల్పన చెప్పుచున్నాఁడు. ఓరీ! తాగుఁబోతా! ఏమిరా యీగడబెడ.

పల్ల-పా--తమరేమి చలవిచ్చినా చరే! నాకుదెల్చిందేమో నాకుదెల్చు. ఇందాకటి యవారమంతా అచ్చరాలతోరాసి మోరులు గుద్దినట్టుండదన్నమాట. సూడండీ ఆయెఱ్ఱసిరాముద్దర్లు. ఎట్టా అనపడుతుండయ్యా.

మాధ-పా--రానురాను వట్టి గాడిదయగుచున్నాఁడు.

పల్ల-పా--చేసేతప్పులు మోసేగుద్దులు బట్టిసూస్తే అట్టనే అనపడుతూ ఉండదికాని, గాడిదకాడ ఒకటుండదయ్యా! తాపులుతిని కాలు విదిలిస్తుంది. ఆటిజోలికి తమవంటి మారాజులెల్లకూడదు.

మాధ-పా--(వెంకటరత్నముతో) వేంకటరత్నమా! బాగున్నవా! వ్యాపారము బాగుగా సాగుచున్నదా?

వెంక---దణ్ణాలయ్యా! దండాలు. తమదయవల్ల బాగానేవుండానయ్యా!

మాధ-పా--ప్రక్కనువిస్తరివేసి పట్టెడన్నమేరికిని బెట్టవుకాని వట్టిదండములు మాత్రము నీవద్దఁజౌక.

వెంక---అన్నా! నీకేమయ్యా! ఏడనైనా దొరుకుద్ది. ఓర్నడిగినా పెడతారు.

మాధ-పా--వట్టి వినయములకేమి! మాటలు నోటిలోనివేకదా రిత్త దండములకేమి? చేతులోనిపని. దమ్మిడీచేతఁబెట్టి దండములు పదిపెట్టిన సరిపోవునని నీయెత్తు. ఉండు. ఉండు. మాయింటితలుపు మూసియున్నట్టులుంది.

పల్ల-పా--(తలుపు కడకుఁబోయి) యెంకటాద్రి. రామదంపూ. అరుణాచలం. రంగడు. పలకరేమిరా.

(తెరలో) ఎవడోశ్! గొడ్డూ! ఓవడురా చవలా! గోల్చెయ్యక నడు. లేకుంటే నోరుమూసుకొని సూరుకాడకూకో. అమ్మోర్లరుల కోసమా నీయెత్తు. ఇంతమందిని పిలవటం. ఓరుండగా యెంతమందేంటి. నడు. నడు.

పల్ల-పా--ఓడసేయీాడు. కొత్తోడలాగుండాడు. అయ్యగారిదిలో నిలబడ్డారురా యెట్టిమొగమా

(తెరలో) ఏడనుంచి వచ్చిండో ఆడకే పొమ్మను. ఈదిలో నదేపనిగా నిలబడితే తోవడవగులుద్ది.

మాధ-పా--ఎవఁడురా లోపలమాటాఁడునది, వేగమే తల్పుతీయుము.

(తెరలో) సిత్తం అయ్యా! ఏవిటికో చెపితే నే చెపతాకా.

మాధ-పా--ఎందులకా? భోజనమునకు.

(తెరలో) ఇయ్యాలకాదు. ఇప్పుడసలే వీల్లకాదు. మీాసు వీలైనప్పుడు మీారురండి.

మాధ-పా--ఎవఁడవురా నీవు! నాయింటికి నేపోవ నీయడ్డేమి?

(తెరలో) ఎవడినా? ఇప్పటికివాకిటకావలిబంటును. నాపేరుపల్లవుఁడు.

పల్ల-పా--నువ్వొవఁడురా, నాపేరెట్టికోటానికి. నావుద్దోగం సెయ్యటానికి. నాపేరునెట్టుకుంటే నామొగం నీకోసద్దాయెట్టిమొగవా.

శుక---పల్లవా! ఎవరా తల్పుకడ?

పల్ల-పా--ఓరమ్మా! కీరమ్మగారూ. అయ్యగారిదిలో నిలపడ్డారంటే. తలుపుతీయండి.

శుక---ఏమిరా! యీాపరిహాసము. నేను నట్లనే మాట్లాడెదనులే. మీాయజమానుఁడాలస్యముగ వచ్చినఁ దలుపెట్లుతీయఁగును.

పల్ల-పా--యెనకటికేదో ఛాత్తరంచెప్పినట్టుగా నుండది.

మాధ-పా--శుకీ! తలుపు తీయుమమ్మా! నన్ను లోపలికి రానీయవు?

(తెరలో) ఈలులేదని చెప్పలేదంటయ్యా నీకు.

మాధ-పా--చీ! జాణా! తల్పుతీయుదువా లేదా?

(తెరలో) ఎవరికోసండీ.

పల్ల-పా--తలుపు పడమోదండి సూస్తారేం.

మాధ-పా--నీకింతకింతయున్నదిసుమా. తలుపు తీయుదువా? లేదా?

కోకి---ఇంతదనుకఁజెప్పినను బోవు. ఎవరా తలుపుదగ్గర?

మాధ-పా--ప్రేయసీ! నీవిదియంతయును వినుచుండియేనాయీాయల్లరి?

కోకి---ఉ॥ ప్రేలరి! నోరుమూయుమీఁక ప్రేయసి! యంచు నన్నుఁబిల్వనీ
నాలుకయెట్టువచ్చెఁదగునా! వెలచానలవాడగామపో
కూళతనంబుచూపకిదుగోఁబ్రియుఁబం పెద నిన్ను దోలఁగ
జేలవుగాక పొమ్మిపుడమేలు వచింతును బాలిశాధమా!॥

మాధ-పా--(తెల్లఁబోవుట)

వీర---మేరమీరిందే యీమె! ఆలు మొగులు సందున దొమ్మలాట. అద్దముమీద పెసరగింజ నిలిచినంతసేపునుకొంటే తొండముదిరి ఊసరవిల్లి అయ్యింది. సరసము పరుసమయ్యింది.

వెంక---మన కెందుకూ? మనమెటూ చెప్పద్దూ! పొరుగింటిజగడం యిన వేడుకనికాని యీనవ్వేవారందరికీ యిట్టాంటివి యెన్నో యింటికాడ. ఈదిలోకొస్తే నేనూ పెద్దమడిసినే! ఓయబ్బో!

పల్ల-పా--తలుపుదగ్గరనే ఉండారయ్యాగారూ. కొంచెం గదవాయిస్తే ఆళ్ళేతీస్తారు.

మాధ-పా--నేడేమో సందర్భమంతయు మారినట్లున్నది. లోపలికి పోవెరవుగానము.

పల్ల-పా--పలాసనిగుడ్డలు కట్టుకొంటిరి. బర్రని వడగాలి తోలుతుంటే లోపలికివెళ్ళి కమ్మని గుడ్డలేసుకొని యెచ్చని బువ్వదినక జాము ఏలనుంచి యీతలుపుకాడే బేరమేంది. ఈ పెనుగులాటేంది. నాకేయిసుకు వేసద్దయ్యాగారు.

మాధ-పా--ఏమైన నందికొనుము. ఈతలుపుఁ బగులఁగొట్టి లోపలికిం బోవుదము.

పల్ల-కొం--ఆడేమైన పగులాలగా నీసెంప పగులనూక్కపోతే సూడు నాదెబ్బ.

పల్ల-పా--ఓరే! యెత్తుకుమించినయెత్తు కెత్తుండవరే! నీయమ్మకడుపు కాల! నన్నైన రానియ్యరా లోపలికి.

పల్ల-కొం--గంగారమ్మ సమత్తబంతికే.

మాధ-పా--పల్లవా! యారోకలినందికొనుము నేలోపలికిపోకమానను.

పల్ల-పా--చిమ్మిరిలో పోసెయ్యటానికా?

మాధ-పా--ఛీ! వెధవా! త్వరగాపొమ్ము.

పల్ల-పా--ఉతకెత్తటానికయ్యా!

వెంక---అయ్యొ! అయ్యొ! అంతతొందరెప్పుడు పనికిరాదు. ఏముండదీ! మనకేలొజ్జ.

చ॥ నలుగురినోళ్ళలోఁబడకు నాతిని రచ్చనుబెట్టకెప్పుడున్
మెలఁకువతోడఁబొమ్మిప్పుడు మెల్లఁగరమ్మిట సంజవేళకున్
మెలఁతను కారణంబడిగి నెయ్యముజూపుము కిన్కఁబాపు మిం
పలరఁగ నిద్దరున్గలసి యాడెదరప్పుడు తాల్మిఁజెందుమా॥

ఇప్పుడు తలుపు గిలుపు పగులఁగొట్టి జొరపడితిరా,

ఉ॥ ఈసడివిన్నవారలిపుడెన్నియొ యున్నవి లేనివన్నియున్
బాసలగూర్చి వింతలుగ వాడలవాడల జెప్పికొందు రా
యాసమదేల? నీదుసతి నల్లరిసేయఁగనేల? నీవునున్
గాసిలనేల నిందలను? కష్టము పౌరులనోరుమూయుటల్॥

మాధ-పా--లోలోపలనే మింగికొనవలయును. గాని పైకి చెప్పికొనవలసినది కాదుగదా! కానీ మునిగిపోయినదేమి.

ఉ॥ కౌఁగిటఁగందమిచ్చి ముఖకాంతులఁ గండ్లకు గ్రపమిచ్చినన్
భాగగుపాటలందనిపి వాచవిగా నధరంబులిచ్చి సొం
పౌగతిఁబూలఁజుట్టి ముదమందఁగఁజేసెడిరామలుండఁగా
నాగఁగనేల కేళినిలయంబునకున్ జనుదెంతునిప్పుడే॥

కం॥ అటల పాటల సీటుల
మాటల మదనోగ్ర సంగమంబులయందున్
సాటియ రామామణికిల
బోటులు దానినెలవుఁగనఁబోలును నాకున్॥

వీరబ్రహ్మమూ!

వీర---మళ్ళీ అట్లాగేపిలుస్తారూ!

మాధ-పా--ఎరుగుదువుగా నర్తకి రామామణి గృహమా కేళిమందిరము? ఆచంద్రహారము నక్కడకే తీసికొనిరమ్ము.

వీర---చిత్తం. శలవుపుచ్చుకుంటానయ్యా!

వెంక---కొట్టుకాడికెల్తానయ్యా.

(అందఱు నిష్క్రమింతురు)

తృతీయాంకము

ప్రథమరంగము

సంపూర్ణము.

॥ చిత్రమాధవనాటకము ॥

* తృతీయాంకము *

ద్వితీయరంగము.

(ప్రవేశము-శుక-మాధ-కొం.)

శుక---బావా! ఇంతలోనే నీమగసితనమెల్ల మరచిపోయితివా యేమి? నాసోదరియెడ యాలవాలంబుగఁ గలిగిన భవదీయమోహలతికలు నేడెండిపోయెనా? లేక లాతికొమ్మలపైఁ బ్రాకెనా? మదీయ సోదరీ హృదయకాసార ముప్పొంగఁజేయుచుండెడి భవదీయ ప్రేమరసప్రవాహంబులు నేడువట్టిపోయెనా? లేక లాతికొలంకులకై ప్రాకుచుండెనా? ఏమిది? మాయక్క చక్కఁదనము, నెఱతనము, కలికితనముఁ జూచిగదా చెట్టఁబట్టితివి! కానమఱింత మక్కువఁ జూపుచుండవలదా? కాని యేమాట కామాటే

గీ॥ కోరిననునీవు మఱియొర్తు గుట్టుతోడఁ
గర్జములఁదీర్పనగునాలిఁ గండ్లుఁగప్పి
వేసి వగపులమాటల లేమమనసు
దన్పనగుఁగాని యీగతి తగునె చెపుము॥

చ॥ దుడుకుఁదనంబులెల్లఁ దమదుస్తులలోపలఁ గప్పిపుచ్చి యే
చెడుగును లేనివారివలె చెయ్వులఁ జూపుచు శాంతమూర్తులై

నుఱుఁగులమార్దవంబు పదినోరులుగట్టఁగఁ గుట్టుతోడ దుం
దుడుకులఁ జేయునార్యులసతుల్ దిగులొందరుగా దెయ్యాక్రియన్॥

బావా!

మ॥ నిజరూపంబది యేడఁ బెట్టినను నీనీడైనమాయప్ప కిం
పుజనింపన్ దయసేయరాదె యకటా! పూబోండ్లు కర్మంబునన్
గుజనుండౌ పతియబ్బెనేని సతముం గుందొందియింటన్ గృశిం
చి జవంబంకగఁ జత్తురంచు మదిలోఁ జింతింపుమా మాధవా॥

బావా! నీవిది యేమో ప్రజ్ఞ యనుకొంటివేమో. నీకిది తగదుసుమీ!
చే యెవతె చేతికిచ్చినఁ జెంగైన మాయప్పకీరాదా?

క॥ పరిపరివిధముల మనమున
దురపిల్లుచునున్న నాదు లోఁబుట్టువు నీ
సరసఁపుఁబలుకులఁ దేర్పఁగ
నరుగుము లోపలికి నిపుడె నయముగ బావా!॥

మాధ-కొం--(ముక్కున వ్రేలుపెట్టుకొని యాశ్చర్యముతో)

ఉ॥ సుందరి! నిన్ను నేనెఱుఁగఁ జోద్యము నీవిటనన్నెఱుంగ నీ
వెందులనేర్చినావో యిటు లెవ్వరినైనను బోల్చి చెప్ప నా
కిందొకఁడైన బోధపడదేమొకో? నీనుడులందు భావమో
యిందుముఖీ! రవంతతల కెక్కనిబాసల చేసిలౌ బళా!॥

సుందరీ!

ఉ॥ త్రిప్పితి నన్ను నేనిలఁ జరింపనివింత పొలంబులందు కన్
గప్పితి నీదుచంద్రమునఁ గాంత! భవన్ మృదుభాషణంబులన్
జిప్పిలు తేనెలానుటను జిత్తము మత్తిలిగాంచదర్థముం
జెప్పుమిదేమి యెందులకు నేనిల నేనొకొ నేనుగానొకో॥

తన్వంగీ! నీవెవ్వతవో! కలువరాణివగు వాణివో! స్పష్టచాతుర్య
మంతయు నీయందు గలదని తోఁచుచున్నది. అంతియకాక

వస్తువును వస్త్వంతరముగ మార్చు నద్భుతసామర్థ్యము నీ
కలవడినట్టు తోఁచుచున్నది

ఉ॥ కన్నులఁ జూపులన్ బొమలఁ గాయముగాయముగాఁగ సేసి నా
కన్నులు మోముజాబిలిన గప్పియు నవ్వులమచ్చుఁ జల్లి నా
కిన్నియుఁ జెప్పి నామనసు నెట్టులొమారిచి యన్యగాఁగ వే
పన్నియొనర్చితీవు నను బాలిక! బాలికగూఢభాషణల్॥

శుక---(స్వగతము)

మ॥ నుడులన్ బోడుములన్ మనోగతములన్ నూత్నంపులాగొప్ప ని
ప్పుడితండన్యశరీరముం జొరఁగనెప్పణ్యుండిటన్ జొచ్చెనో
కడువింతయ్యెఁ గళేబరంబది యెవాక్కన్యంబుహృద్యంబు నీ
తఁడుమా బావయొ కాడొకో యనుచుఁ జిత్తంబిత్తరిన్ గొంకెడిన్

(ప్రకాశముగా) బావా! నేఁ జెప్పుమాటలలో వింత యేమున్నది? లో
కములోని యాలుమగలపోల్కి మిమ్ములుండమంటి, నింతియకా?

మాధ-కొం--

చ॥ మఱువనయేని నేను నను మానిని! పెండిలి కానివాఁడనై
మఱచిననీవు సోదరిని మన్ననచేయుమగండఁ గాను హా!
తెఱవలపోకలద్భుతము తిన్ననివానినిఁ ద్రిప్పిత్రిప్పి యే
తెరవునుగాననీక పెడదీయుదు రేయెడ నాకిదేలకో॥

ప్రేయసీ! నీమాటలటుండనిచ్చి నామాట నొక్కింతవినుము.

మ॥ కలికీ! ముంచకు నన్ను నప్పదగు నక్కన్నిటి మున్నీటిలోఁ
వెలఁదీ! తేల్చుమునన్నుమన్ననను నీప్రేమాంబుధిన్ నీవె వే
యుడుపంబై పడవౌను చేర్పుము చెలీ! యుష్మన్మనోవేలకుం
జలమేలే శుకవాణి! లాతినుడులన్ జాలించి పాలింపుమా॥

మనోహారీ!

ఉ॥ విప్పినకొప్పుపైనొదిగి వెన్నునిపోలికగోళ్ళఁజన్గవన్
గప్పుచు సింగముంబలెను కమ్మనివాతెరలానిచిల్కతీ
రొప్పఁగ నిన్నుఁగూడి సుఖమొందక నేనిఁక నిల్వనోపహా
యొప్పులకుప్ప! నామదికి నొప్పగురీతిఁ జరించుటొప్పగున్॥

శుక---నీకున్మాద మావిర్భవించినదా యేమి? ఏమి యీయసంబద్ధము?

మాధ-కొం--నిజమే మదనోన్మాదముకావచ్చును.

శుక---కన్నుగానక పల్కుచుంటివి నన్నెవ్వరనుకొంటివేమి?

మాధ-కొం--నీముఖచంద్రరుచులచే నాకను దమ్మిలించుక మూఁతవడి నను బడియుండవచ్చును.

శుక---అయిన నీపైత్యాలాపములేల?

మాధ-కొం--అతనుతాపంబునగాగికాగి నీదరహాస చంద్రికలలో నంతలో శీతలమై చలువగ్రమ్మి యించుక తొందరమాటలు వచ్చినను రావచ్చును. ఇందులకుం దగినచికిత్సనీవు చేసినచో నంతయుఁ జక్కఁబడఁగలదు.

శుక---మాయక్కయే నీకుచక్కని యౌషధమీయఁగలదు పోపో.

మాధ-కొం---కాదుకాదు; నీవుతప్ప నొరులందుకుఁజాలరు. నాకంటికి కన్నువై నాకోర్కెకు గమ్యంబవయి నాప్రాణమునకు ప్రాణమై నాకిహలోక స్వర్గమై నాకలోకరంభవయియొప్పు నీకన్ననితరులందుకుజాలరు.

శుక---ఇన్నిఁటికిందగినది మాయప్పగాని నేనుగాను

మాధ-కొం---అట్లులైన నీవే మాయప్పవగుము. నేను నిన్నే కోరితి. నిన్నే వలచితి. నీవుకన్నియవు. నేను వడుగును. మనకిద్దర కీడు జోడుగానున్నది.

కం॥ మందాగమన విలంబము
సుందరి! నేసైపఁజాల సూనశరములన్
గుందెడినను నీకౌఁగిళు
లందనుపుము ప్రాణమిచ్చి లావణ్యనిధీ!

శుక---ఆ! ఆ! ఇదిగో మాయప్పను బిల్చుకొని వచ్చెదను. (అనికౌఁగలించుకొనఁబోగా, శుకము పారిపోవును)

మాధ-కొం--గీ॥ చంద్రమండలిఁబోలును సకియమోము
పల్లవములకు నెనవచ్చుఁబాణియుగము
బింబమోష్ఠంబు సుధయబ్బు వెలఁదినుడుల
మనమదేలకో కాఠిన్యమును వహించె॥

(ప్రవేశము పల్లవుఁడు, కొంకణదేశజుఁడు)

మాధ-కొం--(స్వగతం) అదుగో పల్లవుండు వచ్చుచున్నాఁడు. నాభావమునించుక మాటుపఱతుగాక! (ప్రకాశముగా)

పల్లవా! ఏమియీతొందర?

పల్ల-కొం--బుద్ధి! బుద్ధి! ఒల్లు తెలియలేదయ్యా! నన్దమఱుగుదురా! నేను పల్లవుఁడునేనా? నేను తమనౌకరునేనా? నేనునేనేనా?

మాధ-కొం--నీవుపల్లవుఁడవే; నీవ్రమానౌకరవే! నీవునీవే! నాకేమియు భేదమగుపడలేదురా.

పల్ల-కొం--నేనోయాడకూతురు మడిసినైనా? ఏం తెలియటంలేదు. బాబూ!

మాధ. కొం--ఏయాడకూఁతురు మగనివైతివిరా? తెలిసియుంటివా? మఱచియుంటివా?

పల్ల-కొం--లేదయ్యగారూ! ఓయాడకూతురు నన్నట్టకొనికదలనిచ్చిది కాదు. నన్నొదలనంటదిగద.

మాధ-కొం--మీకుమీకు నేమైన సంబంధముండెనటరా ? లేకున్న యాడుదాని కంతచొరవా ?

పల్ల-కొం--ఏమి లేదయ్యా ! ఏముండది. గవిడిగే దెలాగుండదయ్యా !

మాధ-కొం--ఓరీ కారుదున్న ! ఎవ్వతెరా యది?

పల్ల-కొం--మాదొడ్డదయ్యా ! మా పెద్దమడిసి అందరంటిదికాదు. మెడకుకాళ్ళకు కొక్కె మెట్టి నాలుగ్గాళ్ల యెడ్డగడితే యెట్టాంటిగొడ్డయినా సదుకొద్ది. ఊరికేదొర్లటమే మాలావుపెళ్ళొద్ది.

మాధ-కొం--లావుపెండ్లేమిరా ?

పల్ల-కొం--మాలావుగా ఉండదిగా ! వంటమడిసి వల్లంతాజిడ్డే. పెళ్ళి దివిటీలకు సమురక్కర లేదు. ఏడలేని సమురావంటనే యున్నది నాయనా ? ఆకోకంటిస్తే మూడుమాన్యాలకు నేగడొద్ది.

మాధ-కొం--దానిచాయ బాగున్నదిరా ? మేలిమిచాయయా ? చామనచాయయా ?

పల్ల-కొం--ఉండదయ్యా ! ఓపాటిగా ! సమ్రుంరాసిన సెప్పట్లాగ మడ్డి చెమటల మొగం. ఉంటది మొత్తంమీద ఓమోస్తరుగా ?

మాధ---చమట యేమిచేయునురా ? నీళ్ళు వేసి కడిగిననది యేపోవును.

పల్ల---ఒకటరెండుమ్మాలై తేనీలు ఆయిదవుపప్పుముద్దలాగు ఆతలకాయ లోనుంచి శమటోడుతూవుంటే నీలుకాదుగండా, గంగలో యేసినాఅంతే !

మాధ---దానిపేరేమిరా ?

పల్ల---పుస్పగంధి.

మాధ---చక్కని పేరురా.

పల్ల---పేరు మంచిదేగాని „ఇంటిపేరు కస్తూరివారు యింటినిండాగబ్బిలాలకంపు" అన్నట్టుగా వుండది దానియవారం.

మాధ---వెధవ ! వెక్కిరించుటకు పెద్ద. నీవందగాడవుగాబోలును.

పల్ల---ఇనండి ముందుండది తమాసా ! నేనేమో తన మొగుడంట. నా పేరంబిల్చింది. బువ్వెట్టింది. తిన్నా. నాబుజంమ్మీద పురిపిడికాయ నాయీప్రమీద పుట్టుమచ్చ. కాడినంబి ఆనాళ్ళు చెప్పింది. తమపాదాలపైన బత్తుండమట్టి ఎంతచెడ్డా నామనసు రాళ్తో చేసిందిగనుక యింతంతమాత్రంగా తమపాదాలకాడికొచ్చినదాని లేకుంటే అదిచేసినసొక్కి దానెంట కుక్కలాగ తిరుగుతూ వుండాలసిందే ?

మాధ---(స్వగతం) నీగతిన్ని నాగతి యొక్కతీరుగనే యున్నది.

మాధ---నీవుపరుగునబోయి పడవల రేవున నేమైన డింగీలు కలవేమో విచారించిరమ్ము. నేనీనడుమ నీపాఠశాలముందు వేచియుందును

(పల్లవుండు నిష్క్రమించును)

అరె ! ఏమియీయాగడము ! ఈయూరనందఱు నన్నెఱింగియుండ నేనెవ్వరి నెఱుంగను. ఇంకెన్ని యసందర్భములు పుట్టునో? త్వరగా తరలిపోవలె.

(అని యిల్లువదలి వీధిలోఁ బ్రవేశించి)

ఉ॥ గారడివాండ్రు మాయికులు కల్లరులెల్లెడనీపురంబులో
దారినపోవువారలను దప్పకతోలుదురొక్కరేమన
న్నారడివెట్ట నాయమ గృహంబునకుం జనుదెమ్ము నాథయం
చీరసలొప్పఁబల్కి తనయింటికి దోకొనిపోయెనక్కటా !॥

ఉ॥ అప్పుడెయున్నఁజెల్లెలినయంబును జందము తేటమాటసొం
పొప్పగ దోచెనాకు మదనోద్ధతిఁజిక్కె మనంబునాకు ము

న్నెప్పుడులేని భావములు నెప్పుడులేని తనూవిలాసముల్
జొప్పడె నింకిదేమగును సుందరి నెన్నఁడు చెందఁగల్గుదుర్॥

ఏది యెటులున్న నింకనీయూర నిలచినమాటదక్కఁదు. తరువాత సంగతి తరువాత విచారించుకొందము.

(ప్రవేశము వీరబ్రహ్మసోమయాజులు)

వీరబ్ర---మాధవయ్యగారా?

మాధ---(తెల్లఁబోవుచు) అగును నాపేరదియే.

వీరబ్ర---నేనెఱుఁగనాయేమిటి? యెరగనివానికి చెప్పినట్టుచెప్పితిరి. గొలుసిదుగోనయ్యా! చేత్తోఅది నిన్ననే అయ్యిందికాని గంధ్ర యిసక అయిపోయింది. అది తెప్పించి చింతపండులో ఉడకపెట్టి మెరుగుపెట్టేవరకీవేళఅయింది.

మాధ---(మాధవుఁడు అందుకుని) ఏమి చేయమన్నాఁడో దీనిని?

వీర---తమచిత్తము నేను తమకోసమే చేసినాను ఎవరికిచ్చినాసరే.

మాధ---నాకొరకా? నేను నీతో చెప్పనిదే.

వీర---ఒకమారుకాదు. డెబ్బయిపదకొండుమార్లు. వట్టుకెళ్ళి తమభార్యాగారికి చూపించిరండి. ఇదికొత్తనమూనా. ఆమె చాలా సంతోషించుతారు. మాపటికి తమబసకు వస్తాను. అప్పటికి పైకము యిస్తురుగానిలేండి.

మాధ---నీయమ్మకడుపు బంగారుగాను. పైకమిప్పుడే పుచ్చుకొనుము. గొలుసెక్కడనో నేనెక్కడనో.


వీర---యేంతమాషామనుష్యులయ్యామీరు. మీరంటే అంతనమ్మకము లేదనుకున్నారాఏమి? నాకు కొట్టుకాడా చాలామంది కనిపెట్టుకుని కూర్చున్నారు శలవు పుచ్చుకుంటా.

---అరెరే, యేమియీయాహాశ్చర్యము! దీనికేమనుకొనవలె. వచ్చిన బంగారునొల్లనిమాధుఁడుండునే. చాటలఁబోవువారలకు భార్యలే గాక పయిడి గొలుసులుగూడ దొరికిన యీపుర మహాత్మ్యము యేమనవచ్చును! ఇంక కొంతసేపుండిన నీలాభములు విపరీతములై పరిణమించునేమో! త్వరగాపోయి బజారులో పల్లవు నెదురు చూచుచునుండెద.

తృతీయాంకము

ద్వితీయరంగము

సమాప్తము.



శ్రీ శారదాయైనమః

చిత్రమాధవనాటకము

తృతీయాంకము

తృతీయరంగము-రామామణి గృహప్రాంగణము.

(ప్రవేశము-హుళ్ళక్కి--వీతోత్తరీయుఁడై)

హుళ---అక్కటా! నేనెంతమోసపోయితిని! ఈరామామణి కలనైన నన్నుఁదప్ప వేఱుపురుషునిఁగోరదని నమ్మినమ్మి చివరకీకుమ్మఁ దెచ్చికొంటిని. తల్లిదండ్రులు సెప్పిన హితవాక్యంబులు దిగనాడి, బందుగులాడిన నయవాక్యంబులు చీరికింగొనక, హితులాడిన యాప్తభాషణంబులు పెడచెవినఁబెట్టి, యిల్లాలి వేడికోలు గైకొనక మదాంధుండనై కన్నుఁగానక, వెనుకముందు లెఱుఁగక, వేటకానిచేఁ దరుమఁబడి నిజవాసంబువీడి పరుగులెత్తి మేరమీఱి చివరకేదో యొకదట్టంపు పూదీవబలోఁ గొమ్ములు చిక్కుకొన్నఁగదలనేరకయున్న లేడిజాడ, కాముఁడను బల్లిదఁపు వేటకానిచేఁ దరుమఁబడి యిల్లువీడి యీరామామణి యను వాగురం దగులుకొంటిని. ఇంత మృష్టాన్నంబువిడిచి పొరుగింటి యెంగిలి కాసపడితినిగదా.

గీ॥ నల్లరాతిపైన నలినంబు పుట్టునే
ఖరము నేర్చునొక్కొ తురగజవము
గృహిణికబ్బునట్టి కేవలశౌచంబు
వెలవెలందికెట్లు వెలయునిలను?॥

హా! రామామణీ! నేనేమి దోసముసేసితిని?

ఉ॥ కోకల రూకలన్ నగలఁ గోరినయట్టులఁ దెచ్చియిచ్చి నీ
వే కడకేగ వెంటఁజని యేపనిఁజెప్పినఁదోడఁజేసి యే
పోకలునీవుపోవ నటుపోయెడి నన్నిటవిత్తహీనతన్
వీక నిరాకరించి విరసన్ వెలికీడ్చుట నీకుఁబాడియే?॥

నీతల్లిచేత నన్ననరాని కారులాడించి పైఁబట్టఁగూడ గుంజుకొని బైటికి పోనడఁచినదానికిఁ గతంబు నాయొద్దఁ బది దినములనుండి పైకము లేమియేకదా!

సీ॥ పైడిరాసులువ్రాలెఁ బండెడుమాన్యాలు
కడిగిపెట్టితిఁగాదె పడుపుగొత్తె!
నిలువునీరునఁబండు పొలములన్నింటి నీ
పొట్టఁబెట్టితిఁగాదె బొంకులాడి!
దోసిళ్ళతోఁదెచ్చి కాసుల నీచేత
దారవోసితిఁగాదె తలుపులంజ!
వెలచేసి సరిలేని జిలుగుచీరెలునీకుఁ
గట్టిపెట్టితిఁగాదె కల్లలాడి!
గీ॥ గడ్డివామిముందుఁ గానుండు శ్వానంబు
పండ్లచెట్లముందు ముండ్లరీతి
పండువంటిదానిఁబడయనీయవునీవు
విటజనేష్టఘాత! వేశ్యమాత!॥

ఓ వేశ్యమాత! నిన్ననఁబనిలేదు. నాకు దొడ్డజ్ఞానోపదేశంబుచేసితివి

గీ॥ బందిఖానయొకఁడు బలు దొంగలకునెల్ల
సానిరోతపడుట జారులకును
జ్ఞానదములటంచు జ్ఞానులు వచియింతు
రదియ కంటి నేటి కబ్బురముగ॥

(విమర్శించి) హా! రామామణి! నేను వినుచుండఁగనే యామాత్ర వుండంపిన సందేశమంగీకరింతువని కలనైనఁ దలఁచనైతి. హా! మాధవా! నీకతంబునఁగదా యింతవుట్టె! సరి. బలమున బుద్ధిబలమున నేను నీకు సరిరాకపోయినను నాభూతవైద్యము ననైనను నిన్నుఁ బరాభవింతుఁగాక!

క॥ తఱివేచి నిన్ను నేనీ
పురిలోపల వెట్టిఁడంచు పురజనులెల్లన్
గరతాడనంబు సలుపఁగఁ
జరుపుదు నీదు చిత్రంబు నీదు సరివారు నగన్॥

(అంతట నిష్క్రమించును)

తృతీయాంకము.

తృతీయరంగము.

సమాప్తము.

చిత్రమాధవనాటకము

తృతీయాంకము.

చతుర్థరంగము-రామామణి శయ్యాగృహము.

(రామామణి కుర్చీపైనఁ గూరుచుండును.)

రామా---మాధవపాదపంకజరజఃపటలంబున నాగృహము నేఁడు పావనముగానున్నది. అక్కటా! ఎన్నాళ్ళాయె నాతఁడు నాయింటికి వచ్చి! ఆరుమాసములక్రిందట నొక్కపర్యాయము మాయింట నొక్క గడియసేపుండి ఇదిగో వచ్చెదననిపోయి, “అదిగో యన నారు మాసము” లన్నట్టు చేసినాఁడు. నాటఁగోలె నుపేక్షితుఁడయి నేటి కీసందేశముఁబంపుట నాయదృష్టముగాక వేఱగునే? ఆతండే యిక్కడకు వచ్చిన నాకుఁ గనకాభిషేకమ్ము సేయఁడే? ఈమారైన మరలఁబోకుండ నుపాయమ్ము నెమకుదుఁగాక!

(ప్రవేశము వెంకటస్వామి)

వెంక---అక్కయ్యో! నీకోవుత్తర మొచ్చిందేయ్.

రామా---ఏదీ! (అని యందుకొనఁగా వేంకటస్వామినిష్క్రమించుట) అక్కటా! రామశర్మ! ఏమనుచున్నావు? “నామనోహరియగు రామామణికి!

మనోహరీ!

సీ॥ పూసెజ్జపై నీవు పొలయల్క నుండంగ
పూఁబోణి నీబుగ్గఁబుణ్కినట్లు

పుంక్కినఁ బుంఖానుపుంఖంబులౌ నీదు
చూపుతూపుల నేను సొక్కినట్లు
సొక్కి తాపముదీర సొక్కి నీయధరంబు
నానని మ్మని యార్తి నడిగినట్లు
అడుగ నీచూపులు గడియారమునఁబడ
భావంబుదెలిసి నేఁ బల్కినట్లు

గీ॥ బల్క బిసహస్తపాశ నిబద్ధుఁజేసి
తనివి దీరఁగ మోవిచ్చి తాపమార్చి
నట్లు గంటిని కన్విచ్చ నద్భుతంబు
గంటిఁగలగంటి నొంటిమైఁ గంటినన్ను॥

గీ॥ కలసి యొకచోటనుండి నిన్ గాంక్షఁదీరఁ
జూడఁగలైడిభాగ్యంబు చూడకున్నఁ
గన్నులలరంగఁగలఁజూడఁగల్గె నిన్నఁ
టంచు మదినెంచి నేసంతసించుచుంటి॥

చ॥ అనయము నిన్నుఁగూడి ముదమంది సుఖింపఁగఁగోరుచుండు నా
కనువది యెప్పుడంచు మది నారటమూనుచునుంటిఁగంటి నా
కను వికసింప నిన్ గలను గాంత! దినత్రయమెల్లఁబుచ్చి నిన్
గనుగొనవత్తు నన్ను బిగికౌఁగిటఁ దన్పుదువన్న యాసతోన్॥

ఇట్లు, నీప్రియుఁడు,
రామశర్మ.”

అక్కటా! ధనమునకై మాయమ్మ యెట్టిబడుగునైన నాకంటించు నుగదా! ఈరామశర్మవంటి సరసులు గలరా! ఈతని మాయమ్మ యనరాని కారులాడి వెడలఁగొట్టెను. ఈమారైన నీరసి కాగ్రగణ్యుని సేవింతును గాక!

(ప్రవేశము వెంకటస్వామి)

వెంక---అక్కయ్యో! మాధవయ్యగారొస్తున్నారు.

రామా---తమ్ముఁడా! ఆవలగదిలోనున్న మాధవుని చిత్రపటమిటులంది కొనుము. నేనిప్పుడీతనికన్నుల మచ్చుఁజల్లుదునుగాక (వెంకటస్వామి చిత్రపటమునిచ్చి నిష్క్రమించుట)

(రామామణి శయ్యపైనఁబరుండి చిత్రపటము వక్షస్థలమున నిడికొని కలువరించును)

ఉ॥ కౌఁగిటఁజేర్పకున్న నికఁగాయముఁబాయుదు మారుతూపులన్
వేగితిఁ బేలగింజవలె వేపఁగ నేఁబగదానఁగాను నీ
వే గతియంచుఁ జిత్తమున నెప్పుడు నెంచెడి నన్ను మాధవా!
యీగతిఁజూడకిట్టు లపహాస్యము సేయుట నీకుఁబాడియే॥

హా! మాధవా! పోకుపోకు నిలు! నిలు! నన్నింక వేసటఁబెట్టకు
(ప్రవేశము మాధవుఁడు. పా. గదివాకిటముందు నిలచి)

మాధ-పా---ఏమిది! నిలునిలుమనుచుండెను. నిద్దురఁబోవుచుండెనా? మేలుకొనియుండెనా! (చూచి) కలువరింత కాఁబోలు.

రామా---

శా॥ పాపంబంచునునీకుఁదోచదొకో హా! పాపాత్మ నన్నిట్టులీ
కూపంబందునఁద్రోచి పాసిచని హా! కొన్నాళ్ళకైనన్ వెతల్
బాపన్ నీమనసిచ్చగింపదొకో? నాప్రాణంబు నీపైన మో
హౌపై పంచత్వము నొందకుండె నిసిరో! హా! మాధవా!మాధవా॥

మాధ-పా- దీనికి నాపై నింతకూర్మికలదని యెన్నఁడెఱుఁగక మోసపోయితిఁగదా!

రామా---

మ॥ ఇదిగో యిప్పుడెవత్తునంచు ననునెంతేఁ బ్రేమనమ్మించి నీ
యదయత్వంబున నారుమాసములకున్ హామాధవా! జాడలే

వు దినమ్మున్ యుగమట్లుగాఁగడుపుచున్ బోనాడి ధైర్యంబునిన్
హృదయంబందున నెప్డుదల్చు వనితన్ హేలన్ గటాక్షింపుమా॥

మాధ-పా--దీనికి నాపై నింతకూర్మిగలదని గ్రహింపనేరక యారుమా
సములనుండి బాధపెట్టి పాపముఁగట్టికొంటినిగదా!

ఉ॥ ఇంక నుపేక్షసేసిన సహింపఁగరాని మనోజవేదనన్
బంకజనేత్ర యేమగునొ ప్రాయక డాయఁగఁబోయి యక్కటా!
పొంకముబాసె నాకతనఁ బొల్పుగసుందరి నిద్రలేపి యా
టంకములేని కౌఁగిలిఁ దటాలుననీయక నెట్టులోపుదున్॥

(దగ్గరకుఁబోయి చెక్కిలి గోటమీటి నిద్ర లేవకున్న చో) ఎంతగాఢ
నిద్ర! ఏమి యీకలువరింత! ఏమియీకూర్మి!

మ॥ వెలయాండ్రెక్కడఁ గూర్మలెక్కడను మన్ వేమందిసాటింతు రీ
వెలయాలిన్ గనినైన గ్రంథములలో వేమార్లు సేయంగ నాఁ
గలనైనన్ ననుగోరునట్టివనితన్ గాంతాసమాజంబులో
వెలయాలంచు గణింపఁజెల్లునొకొ నా కాపెన్ వేశ్య వేశ్యాత్వమున్॥

(చెక్కిలి గోటమీటి నిద్ర లేపుచు)

చ॥ మనసు నెఱుంగలేక నినుమన్ననసేయని బుద్ధిమంతుఁడన్
గనికరమింతలేక నినుగారియవెట్టు దయాస్వభావుఁడన్
వనితరొ! నిన్నుఁజూడఁగనువచ్చితి నేటికి నోడకిప్డు నీ
మనసున కోపినట్టు లనుమానముబెట్టక శిక్ష. సేయుమా॥

(రామామణి నిద్దుర లేచి కన్నులు నలుపుకొనుచు)

రామా---(స్వ) ఈవేశ్యాజన్మము దినదిన గండముగదా.

ఉ॥ భోగముసానివైద్యుఁడును భూపతి భృత్యుఁడు నింటియల్లుఁడున్
రాగికి రోగికిన్ బ్రజకు రాజుకు నర్తకుఁ బ్రత్యహమ్మునన్
సాగిలి మ్రొక్కి చిత్తము ప్రసన్నముగా నొనరింపకుండినన్
వేగమ మూఁడునాశమని పెద్దలు పెద్దగఁజెప్పిరేకదా॥

ప్రకాశముగా

గీ॥ ఇల్లెఱుంగక వేరొక్క యింటికిపుడు
వచ్చినారలు మీరలెవ్వారొ కాని
వింతవారలు మాకిసుమంతయైనఁ
దెలియపఱచక వచ్చుటిదేటివింత॥

మాధ-పా--(తిరిగి ,,మనసు నెఱుంగలేక” యను పద్యమునుజదువును)

రామా---

గీ॥ నిండుజాబిల్లిఁబోలు నీనెమ్మొగంబుఁ
గాంచనామది చందురాగఱగె నహహా!
లోనఁబుట్టిన కోపంబు లోననారెఁ
జాలుఁదడవేల చెన్నుఁడ! యేలికొనుము॥

మాధ-పా--రామామణీ! నీయధరామృతపాన మబ్బినవారికాకలిదప్పు
లుండునే?

రామా---(స్వ) ఈతనిమోముఁజూడ నాకొన్న చందంబుదోఁచెడి. (ప్ర)
ప్రియా! మీకొఱకు మేలైన మామిడిపండ్లు, గంగాబొండము
లుదెప్పించితిని. వానినారగించి ననుమన్ననసేయఁ బ్రార్థించెద.

మాధ-పా--ఆహా! ఏమీ దీనితెలివి. మాటలోనే నాభావము గనిపె
ట్టినది. ఇంకబెట్టుచేసిన నాకలిదీరుటెట్లు? (ప్ర) మనోహరీ! నా
కాకలి యున్నను లేకున్నను నీముచ్చటకైన నంగీకరింతును.

(అందఱు నిష్క్రమింతురు)

తృతీయాంకము చతుర్థరంగము

సంపూర్ణము.

చిత్రమాధవనాటకము

* చతుర్థాంకము *

ప్రథమరంగము.

(ప్రవేశము-వీరబ్రహ్మసోమయాజులు-వేంకటరత్నము.)

వెంకట---ఇదుగోనయ్యా! ఈరబ్బెమ్మంగారూ! ఏంమరియాదయ్యా! ఇది! దీపాలామాసకు బుచ్చుకుంటిరి నెలరోజులలో యిస్తామని నెలళ్ళీపాయె. రెన్నెల్లాయె. ఏమో మరియాదస్తులు గందా అని మాటామరియాదా యెఱుంగని నీతిమాలిన జాతినడిగినట్టు నిన్ను అడుగనా? మాట నిలుపుకోకపోతారాఅని అడక్కుండా ఊరుకుంటే సంకురాత్రి లేదాయె, ముక్కోటి లేదాయె, దమ్మిడీగవ్వలు జమలేదాయె, పుచ్చుకునేటప్పు డెఱుంగవా అంట పుచ్చుకునేటప్పుడే యిచారించుకోవాలె. ఏముండది మాసావుకార్లపని గల్లాబుట్టంతాగాలిస్తే సిల్లిగవ్వలేనా! పదిమందీ బాకీకటాయిస్తే మేమేమి వర్తకంచేస్తాము. ఎప్పటిదప్పుడు టకాయించి పుచ్చుకోకపోవటం నాదే బుద్ధిలోపం.

వీరబ్ర---నేనిదివరకే యిత్తామనుకున్నానుగాని నీవెఱుంగనిదేమున్నది. నాయెగ్గెం అడావిడిలో కొంచెము చేయితగిలినది. అందుచేత కొంత ఆలస్యమైనదీ. ఏం ఎగేసిపొయ్యేవాడ్ని అనుకొన్నావా? నీకోస మీయూరువిడిచిపెట్టి పోతాననుకొన్నావా ?

వెంకట---చాలు! చాలులేవయ్యా! అప్పుడప్పుడీలుగానున్నప్పుడుకొంతకొంత చెల్లుచేసి మిగిలినదానికాలస్యం అయిందన్నా అందం చందం. బాకీమొదలు దమ్మిడీ చెల్లులేదు. అంతసోదక్కర లేదు. వచ్చేద్దసరాపండుగ. నాదగ్గర సరుకైపోయింది. నేనిప్పుడు సరుకులకుపోవాలె. పదిపద్దులు వసూలుచేసికొంటెనే కాని నాకు సొమ్ముపుడదు. మరియాదగా యిచ్చేస్తారా! నా లెక్కచ్చెయ్యండి. లేదా మాకేటిగాని మొమాటాలునాయిగావు. ఆరాజభటునిచేత (ప్రవేశము జులూంఖాన్) పట్టించి దండనాయకునిగారిదగ్గిర విచారణపెడతాను.

జులూం---ఇయ్యాలా! మాకీ బలేహదుష్టం ఉన్నదన్నమాటా. గస్తీ బదలాయించి యీబజార్మే వచ్చుడం బడామేలూవుంది. ఈ యీదిమే పాంపెట్టెందీలేదూ బూడ్దేలోపొర్లిందీలాగాఏక్ బోడీ బొమ్మన్ వాడు ఎదురుగా వస్తాప్పటికి మూడుచందుల్ కింద ఈ మోలనుల్చుండి ఉచ్చచేసావు చెప్పువేసి మూడుదబాయింపుల్ దబాయించి ఆడ్కీయీపుమీదా యెదుర్వేళ్ళ హల్లాపెట్టి మేహర్దరూపాయిజులూంచేసివసూలుకరుంగా; ఆమాహరానాం జులూంఖాన్ భోలేతో బొమ్మన్ బఖాల్ అంతా గాభ్రామే ఉంటారన్నమాటా. జవాన్ గాడీ సాక్కానికీ మారాజాకిచెప్పువేసి ఒకడికీ చెప్పువేయేల. ఇయ్యాల పొద్దుటినుంచి కొంకణదేశం కుక్కమోతూ యేష్పాబఖాలుయొటా తిరిగీతిరిగీ ప్రాణంచాలించింది. ఆడ్కీ ఉఁకోజవాన్ కీ తగిలించాన్ యీబర్కీ వద్చాన్ బతికిపోయాన్.

వెంకట---ఏమండోయ్ సాయిబయ్యగారూ సలాం.

జులూం---(స్వ) అరే! బఖీల్ క్యారే! ఇయ్యాలా యీడిదగ్రావదిలీం చాల. (ప్ర) ఏమండోయ్ సావుకారుగారూ! మీతలవుమీద కూకుంటామామేమ్.

వెంకట---మాకొట్టుకాడికి సుట్టకైనా రావటంలేదేమి? ఇయ్యేలేమా అబ్బాయితో అన్నా. సాయిబుగారు మనమీద బొత్తుగా శీతకన్నేసినారని చూడండీ! ఈయన డబ్బియ్యాల. ఎన్నాళ్ళడిగిన యియ్యకుండాఉన్నాఁడు. దండనాయకుఁడుగారితో చెప్పి విచారణపెట్టాలె.

(భటుఁడు వీరబ్రహ్మమును చేయిపట్టి గుంజును)

వీరబ్ర---ఇదుగో! సాయిబూ! పరువు మరియాదా లేకుండా నన్ను ముట్టుకోవటానికి నీకేమికధికారమున్నది? సేరానంలేకద. నీవు రాజభటుఁడవైతే రాజువనుకున్నావాఏమి?

జులూం---క్యారే! క్యారే! క్యాబోల్తారే! హమారా రాజా! తూ గులాం. మాకీదయాఉంది. నీకీ సేమంఉంది. మాకీ దయాఉంఛిగాదూ నీకీ సేమంఉందిలేదు.- మాఅదికారీ మన్సూలో కూకుంటాంఅన్న మాటా! మేంఎంతాచెప్పితే అంతా!

వీరబ్ర---(స్వ) అధికారుల గుడ్డితనములో వీళ్ళేతప్పుడురాతలు రాసినా చెల్లుతుంది. వీళ్ళతో ఆట్టేమాటపట్టింపులకు పోరాదు. (ప్ర) మీతో మాకెందుకు: బాకీ యెగెయ్యటంపని నాదికాదు. ఇదుగోనయ్యా! సావుకారుగారు! వినండి సాయిబుగారూ! నేను మీకియ్యవలసిన మొత్తం మాధవయ్యగారు నాకియ్యాల ఆయనకు నేను గొలుసు చేసియిచ్చాను. ఆబంగారంతాలూకుసొమ్ముచేసినందుకు మజూరీ. ఇంకా కొంత యెనకబాకీ యియ్యాలె. ఇయ్యాల సాయంకాల మైదుగంటల కిస్తామన్నారు. ఆయనయింటికి మీరువస్తిరా మీసొమ్ము మీకిచ్చేస్తాను. ఏమి ఇయ్యలేనివాణ్ణి అనుకొన్నారా! నాదారు ననుకొన్నారా!

జులూం---ఈరబ్బామ్మడుగారూ! మామామూలుమాటా ఏమిచెపతారండీ? సావుకారుగారూ! ఏళకీజ్ఞాపకం వుండంలెండి!

(ప్రవేశము-మాధవ-పా-పల్లవ-పా.)

మనకాకష్టంలేకుండా ఆమాధవుఁడుగారూ ఇటువేస్తూ వస్తున్నాఁడులెండి.

మాధ-పా--

ఉ॥ వాకిటనన్ను నిల్పి నగుబాటొనరించిన బోఁటినింక నా
పోకలు బోవకుండఁ దగుబుద్ధులుసెప్పుట ముఖ్యమారయన్
ఏకుటిలంబెఱుఁగక మదీరితముల్ నెరవేర్చు నాతికిన్
దూకము దప్పెనే మనము దుచ్ఛఁపుబుద్ధులు పుట్టెనేకటా॥

ఇంటికిఁబోయి నాయింతి నింతింతనరాని చీవాట్లుపెట్టి దారినఁబెట్టుదును. పల్లవా! నీవు బజారునకుఁబోయి మంచి త్రాడుఁగొనితెమ్ము. అల్లదుగో కంసాలియు నిటులనే వచ్చుచున్నాఁడు.

పల్లవ-పా--బలే నాసామిరంగ. కోరతలపాగా జుట్టుకుని బాజారంతా దిరిగొస్తా.

మాధ-పా--(ఎదుట కంసాలినిఁజూచి) మంచి నమ్మకమయినవాఁడవు. నమ్మిన నిన్నే నమ్మవలె. నీకొఱకెంతసేపు వేచియుంటినిమిత్రుఁడా.

శా॥ ఆరామామణియింట శయ్యపయి సత్యానందముఞ్జెంద ని
స్సారంబిల్లనితోఁచె, మిండరికముల్ సాగంగ సంసారముల్
భారంబంచనితోఁచె సౌఖ్యమొసఁగన్ వారాంగనల్ గాని యే
సీరేజాక్షులచేతనౌను రతులన్ నెయ్యంబులన్ లీలలన్॥

నేనక్కడ నీగొలుసుకై యెదురుసూచిచూచి నాకన్నులు కాయలు కాచినవి.

గీ॥ గొలుసుతెచ్చిన నన్ను నాగొలుసుత్రోడ
తనదు డెందంపు కొయ్యకు దాచికట్టు
వెలఁదియుంచును గొని తేగపెఱచినావొ
లేకయుండిన నేలకో తేకయుంట॥

వీరబ్ర---మీసరసాని కేమికాని నా ప్రాణముమీదికి వచ్చినదిప్పుడు. ఇదుగో తమగొలుసుతాలూకుపట్టీ. బంగారం వన్నె యెత్తు మజూరీ అంతకు వివరం. మొత్తం రు 850 లు. నేనీపెద్దమనిషికిబాకీ యున్నాను। ఆయన్ను త్వరగాపంపించేసారా మాటదక్కుద్ది. ఆయన ప్రయాణమై సిద్ధముగా నున్నాఁడు.

మాధ-పా--సరికాని ఇప్పుడు నాయొద్ద పైకము లేదు. అదికాక నాకు గ్రామములో కొంతపనియున్నది। ఈవెంకటరత్నముతో గూడ మాయింటికేగి యీగొలుసును నాభార్యకిమ్ము. ఆమె నీకుఁబైకమిచ్చును. పోయిపుచ్చుకొనుము.

వీరబ్ర---గొలుసామెదగ్గరకు తమరే తెస్తారా?

మాధ-పా--నీవేతీసికొనిపొమ్ము; నేను వచ్చువఱకాలస్యమగునేమో!

వీరబ్ర---అట్టాగేనయ్యా! తమవద్ద వున్నదాగొలుసు?

మాధ-పా--నావద్ద నెటులుండును? నీతోనే యుండవలె; నీయొద్దలేకున్న వెంటనే మఱలిపోవచ్చును.

వీరబ్ర---(తెల్లఁబోవుచు) కాదయ్యా! నీకోదండం. నాగొలుసిప్పించండి. ఈయన పాపం ప్రయాణమై సిద్ధముగా నున్నాఁడు. నాకోసమే అట్టేవున్నాఁడు. నాకొరకాయన ప్రయాణ భంగము కూడాను.

మాధ-పా--ఏమి యీవిడ్డూరము. ముందుకాళ్ళకు బంధము వైచినట్లున్నది. రామామణియింటికి గొలుసు తీసికొనిరాగలందులకు నేను నిన్ననవలసినదిపోగా నీవు నాపైకెల్లెదురు తిరిగితివి. కడుఁగడుసువాఁడవు. చాలుఁజాలు.-

వెంకట---ప్రొద్దెక్కిపోయెనయ్యా! నీపుణ్యమాయెను నన్ను పంపెయ్యండి.

మాధ-పా--తీసికొనిపోయి నాభార్య కిమ్మంటినిగా. ఆమె నీకుఁబైకమిచ్చును పోయిపుచ్చుకొనుమిప్పుడు వాదమేల?

వీర---రండి, రండి, చాలు! చాలు! కోడిగమనుకొన్నారాయేమి? నాగొలుసు నాకిచ్చెయ్యండి. లేకుంటే చీటిరాసి పంపించండి.

మాధ-పా--ఛీ! ఛీ! వీధిలోనేమి మాకొండాటము, ఈకంఠశోష. ఏదీ! ఆగొలుసు ?

వెంకట---మీరూ మీరూ గుద్దుకోండి, కుమ్ముకోండి, నేనుక్షణం ఆగను. నాకేమి సమాధానంచెప్తుతారు. ఇస్తే యివ్వండి, లేకుంటే లేదనండి ఆయన్నాజవానుకొప్పగించేస్తాను. డబ్బుకాడా యవారంకాడా మోమాటం ఏమిటీఅంట.

మాధ-పా--నీకు సమాధానమా ! నీకేమి సమాధానము చెప్పుమన్నాఁడవు.

వీర---నాగొలుసుతాలూకు పైకమిస్తురా లేదా ?

మాధ-పా--నీవునాకుఁగొలుసు నిచ్చుసందాక నేను నీకుఁబైకమీయనక్కఱలేదు.

వీర---ఇప్పుడేకాదండీ! తమకు నేనుగొలుసిచ్చింది అరగంట నిండాకాలేదు.

మాధ-పా--ఎంతసాహసము! నీవు నాకుఁ గొలుసునిచ్చితివా? నీతో సరసమాడుటయే నాకుఁ బనియనుకొంటివా?

వీర --మాటమన్నన యెఱుగననుకొన్నారా? యేమిటి. పుచ్చుకున్నగొలుసు నెరగవంటే పోతుందా?

వెంకట---ఊఁ! సాయబుగారూ! చూస్తారేం. ఈవీరబ్రహ్మంగారిని మీహవాలాలో వుంచుకోండి. ఏముందది. ఎన్నాళ్లుమంచిగా వున్నా కూసింతలో సెడ్డది.

జులూం---ఈరబ్యామత్ గారూ! మా రాజావారి పేరుమీద వార్కి బదుల్ నేను మీకిబందీచేస్తాం. నడు. నడు.

వీర---ఇంక నామరియాద దక్కునట్టులేదు. ఇదుగో మాధవయ్యగారూ! చెప్పుతున్నా వినండి. మరియాదా దక్కించుకుంటారా, పైకంఇచ్చెయ్యండి.

మాధ-పా--ముక్కు మొగమెఱుంగని యప్పు నొప్పుకొనుట యెట్టు. ఎవఁడురా? నన్ను బందీచేయువాఁడు? గుండెలున్న వా?

వీర---అన్నయ్యగారైతే యేంగనకా. ఈయవహారంలో వదిలిపెట్టను. నాపరువుచూడకుండా నన్ను విదిలించేస్తూ. ఉంటే ఆయనపరువు నాకేమి? ఇదుగో సాహేబుగారూ! మీకియ్యవలసినబత్తెం. వీరిని ఖైదీచేసి తీసికొనిపొండి.

జులూం---మైక్యాకర్నా? భోలోజీ! సాబ్! ఈతకరర్ తమరువింటూఉన్నార్ సాహేబ్! మీరుమాఖైదీ!

మాధ-పా--నేనునీకుఁ బ్రాతిభావ్యమిచ్చునందాక నీ వశుండనయ్యెద. (కంసాలితో) భద్రము! నీవింతవాఁడవని నేనెన్నఁడు దలఁచలేదు. నీదుకాణమున సుత్తిసమ్మెట నమ్మినఁగూడఁ దీరనియిఁడుములు గుడిపించకున్న నాపేరు మాధవుఁడుకాదనుకొనుము.

వీర---ఈయవహారంలో మీకే పరువుతక్కువగాని నాకు న్యాయం దొరక్కపోదు. ఈవూరు రాజేలుతున్నాఁడుగాని, ముండేలటంలేదు. నాకాసందేహం యెప్పుడులేదు!

(ప్రవేశము కొంకణదేశపుఁబల్లవుఁడు)

పల్లవ-కొం--సంద్రానికెల్లే పడవలు సిద్ధంగ్గాఉన్నయ్. సరుకులు నింపుకుని సాపలెత్తుకుని రుండుమూడుమాత్రం ఫూటుగా వున్నయయ్యా. సరుకెక్కువైతే సరుక్కీనష్టం. సావుకారుకీనష్టం. అని మర్రోపడవ మాట్టాడుంచానయ్యా. ఈదిలో తమరు తెమ్మన్న

పకారంగా అరటిపళ్లు, పంచదార, వక్కలాకులు తెచ్చునయ్యా! ఆల్చెంలేదు. తమరురావటం పడవబయలెల్లటం గిన్నతో చెప్పొచ్చినా.

మాధవ-పా—పడవెక్కడరాబడవా! పడవేమి నిన్ను నేఁబంపుటే

పల్లవ-కొం—తమరెప్పుడు నన్నుఁబడవకోసం పంపలేదయ్యా; ఆ తయ్యారుగావుండదయ్యా,

మాధవ-పా—నిన్ను నేఁదాఁడుఁదెమ్మని పంపలేదటరా?

పల్లవ-కొం—నేతాడెరగను, తంకెరెరగను, నన్ను రేవులో పడవ వేడయ్యో కనుక్కోరమ్మన్నారు. అంతేనాకుదెల్సు. (స్వగతము) ఏమో! యియ్యాలయ్యగారి యవారం ఆ పిచ్చిగాఉండది,

మాధవ-పా—ఆవిషయము తరువాతచర్చింతము. సరిగావినునట్టి చెవులకుఁ జెంపలకు బుద్ధిచెప్పెదను. గాడిదా! భయము న్నది. ఈగోలకేమిగాని నీవుపరుగున మనయింటికేగి నాభా కోకిల కీబీగములొసగి నావ్రాతగదిలోనున్న చందుగా లోని పైకపుసంచి నిక్కడకు దీసికొనిరమ్ము. ఎందులకని గిన నేనొకవ్యవహారవిషయమున బందినైతిననియు, నన యంములకుఁ బ్రాతిభావ్యమై నన్ను విడుదలచేయగలదని జెప్పుము.

పల్లవుఁడు-కొం—(త్వెల్లపోవుచు) అయ్యా!

మాధవ-పా—(భటునితో) కార్యస్థానమునకుఁ బోవుదమురమ్ము

(నిష్క్రమింతురు.)

పల్లవుఁడు-కొం—కోకిలమ్మగారిదగ్గిరికా! అంటే! మేంబువ్వదిన్నటికా! నన్ను పుష్పగంధీ! సడసమాడినచోటికన్న మాట ఆ పోవటానికి నాకుమనసొప్పటంలేదు. ఒప్పినాసరే! ఒప్పు

యినాసరే! అయ్యగారిమాట వినకతప్పదు.

(నిష్క్రమించును).

ప్రథమరంగము సమాప్తము.

ద్వితీయరంగము.

పాండ్యమాధవుని గృహము.

(ప్రవేశము-కోకిల, శుకి)

కోకిల—

శా॥ ఏమేమీ! భ్రమపెట్టెనే నను? నిజం బేనా యబద్ధంబొకో
నామీఁదింతయసూయ నీకుఁదగునా! నానాథ!
[సోదరితో] హా! సోదరీ!
ఏమైనన్ గనుపెట్టితో క్కొ? మొగమం దేమైన యాచూపులం
దేమైనన్ నుడులందు భావములనిం కేమున్నదే నాకిలన్॥

శుకి— మొట్టమొదట దనకునునీకు నేవిధమయిన సంబంధము లేదని చెప్పెను.

కోకిల—నేటినుండి నాసంబంధము విడఁగొట్టుకొనవలయుననిగాబోలు నట్లుచెప్పుట. అక్కటా! తరువాత.

శుకి—ఈయూరి పేరైనఁ దానెఱుఁగననియు నీపూటనే యీపురిఁజేరెననియు నొట్టుఁబెట్టికొనియె.

కోకిల—ఇది యెట్టిగ్రహచారమమ్మా! వీధిలో నాతో చెప్పినదియు నదియే యెట్టెట్టులో విస్తరినెంగిలిచేసి లేచిపోయె. నేనేమిచేయుదునే సోదరీ! తరువాత.

శుకి—

చం॥ "తగదిటు నీకు బావ" యని తాలిమి దూలగనొక్కి చెప్పితిన్

కోకి--దగదన నాతఁడేమనియెఁ?

శుకి— దానట నవ్వరియించెనంట! యే

కోకి--తగవునట్లుచేసె?

శుకి— నదితానెయెఱుంగు నికేమి చెప్పనా
వగపులుపోకలున్ నుడుల వారితమయ్యెనుగాదె సోదరీ॥

మ॥ ననుమన్నించెనుజూపులన్ వగపునన్ నాతో నమాటాడెఁ, బా
గనినామాటలఁబ్రస్తుతించె బళిరే యందంబు మైచాయ యం
చనినన్ వర్ణనసేసె నప్పు!

కోకి-- యకటా! యందంబచందబయ్యో
పనినీకో నెకోయంచు నాతనికినో వ్వన్ జెప్పువారెవ్వరో॥

(కోపముసూచింపుచు) సోదరీ! చాలుఁజాలు నింకఁజెప్పఁబనిలేదు. మీ బావగారిచెయిదములు వినివిని విసుకుపుట్టినది. (చిరాకుతో)

చం॥ గఱగఱలాడు కాయమును గాలఁ నఁగేలునవంక మోమునన్
గొఱకొఱలాడుచందమును గుత్సితమున్ గుజనత్వమున్ నుడిన్
బరుసదనంబు మూర్ఖతయుపాయములేమియు నేయెడన్ సుఖం
కరమగునే యసహ్యమికఁ గాసిలిగాసిలి కాంక్షదీరెనే॥

శుకి—(అయిష్టమునుసూచింపుచు హాస్యముగా)

ఉ॥ అట్టిడతండ యేని యికనప్పరో నీవిక బావకై వగన్
బిట్టుకృశింపనేలతగునే కదకంటకమూఢ నీకికన్

కోకి—(పశ్చాత్తాపముతో)
ఎట్టునుదోఁచ కేనిపుడు హీనపుమాటలఁ బ్రాణనాథునిన్
దిట్టితిఁగానికోపమున నెమ్మనమందున వాసిగోరదన్॥

గీ॥ "అంధుడైననుమరి వికలాంగుడైన
నెట్టిడైననునాథు సేవింపవలయు
నాతి" యనునీతి నెఱిఁగియు నాదు తెలివి
కోపమునఁబాసిపలికితిఁ బాపపునుడి॥

ఉ॥ నాలుక కన్నమానసము నాథునిమిక్కిలిగారవించెడిన్
చాలునె? వాసిఁబోలనలసారసనేత్రుని కూర్మినందనుం

'లము వెట్టనాకుం బెఱయాంత్రిడిలం దోచక యున్న నాపయిన్
'లగ నెయ్యముం గల్గుడు చానరో! మానగ లేను వానినిన్ ॥

(ప్రవేశము- పల్లవుడు కొంకణదేశజుడు),

(ప-కొం——(తొందరతో) ఇదిగోనమ్మగారు! చేపెట్టెలో పైకం సంచిప్పించండీ త్వరగా తచ్ఛణం ఆల్చంఅయితేవల్లకాదు.

—ఏమిరా! పల్లవా! ఏటికంతగారొప్పుచుంటివి.

-కొం——ఎక్కడాక్కుండా లగెత్తుకొచ్చినా నన్నుపంపెయ్యండి

—నీయజమానుడెక్కడరా? ఆయనక్షేమముగానుండెనా?

-కొం——నరుల్లో కాకుండా నరకంలో కాకుండా ఉన్నాడు మాఅయ్యగారు. అయ్యగారినో బూతంఆవగించింది. అదిమనదేశపుదికూడాకాదు. సిద్దీబూతం. ఏయేల, ఒటేదుస్తులతో ఉంటది దానికి రాతిగుండెకాబోలు! ఇనుపగుండీలెట్టుకుంటది. బిండెనాదాలుచేసినాపోదు. పట్టుకుంటేవదలదు. నిలబడితే యీడిలోదీపస్తంబాలాగ నిలబడ్డది. యొటబడితే యేటకుక్కకన్నమిన్న. పగబడితే తాసుపామయినా చాలద్దానికి. ప్రతియీడిలో సందులలో గొందులలో ఏయాలపడితేఆయాల, ఎప్పుడుపడితేఅప్పుడు, ఎక్కడబడితేఅక్కడ తయ్యారుగుంటది. యములోడి కన్నో తమ్ముడో కావలె. మరొకడుకాడు.

—నీసోదియడగ! మఱలయేమిపుట్టి మునిగినది.

-కొం——నాకేం తెలియదు, ఏదోయవారంలో మాయయ్యగారిని ఖైదీచేసినారమ్మ,

—హా! ఈశ్వరా! నేటికేమికాలమువచ్చెరా! వ్యవహారంలో బందినిం జేసినారుగా! ఏలాగున? నే వ్యవహారములోనో నీకు తెలియునటరా?

పల్లవ-కొం——ఏయేజికమో నాకు తెలియదు. పట్టుకున్న దేలాగో నేనెరగను. ఆపట్టుకున్నాయనమాత్రము తెల్లలాగూతొడుక్కున్నాడు. చేపెట్టెతీసి డబ్బుసంచియ్యండమ్మగారూ, ఈమాటలకేం ఆనక చెప్పుకోవచ్చును. అయ్యో! శీమకుట్టినంతైన తొందరలేదేమమ్మా నీకు (తాళముచెవులు మీదవైచును)

కోకి——సోదరీ! వానికాసంచిని తెచ్చియిమ్ము.

(శుకి నిష్క్రమించును.)

ఉ॥ అంతయువింతయయ్యె నిపుడంతయురంతగనయ్యె నెయ్యెడన్ ॥
గాంతుండు సామ్ము నప్పగొనగా విననేటికిటయ్యెం బల్లవా!

పల్ల-ఖంతయిదేమొదెల్దు బరుగెట్టినయీడకు డబ్బిటియ్యకా
సింతలుకొండలంతలుగ సింతలొయింతగ మార్పు సెందుగా॥

నేపోవాలె నన్నుపంపెయ్యండి. నేబయలెల్లేతల్కి మూడుకొట్టింది గందా ఇప్పుడుమల్లీ ఓటికొడద్దిదేంటింత

కోకి——గడియారములుకూడ వెనుకకునడుచు నట్లున్నదీకాలము.

పల్లవ-కొం——ఔనమ్మా! ఈగంటలకూడా ఆబూతం అగపడితే వెనక్కురకటమే.

కోకి——రక్షకభటునిచూచిన నప్పులపాలయినవారికి చోరులకుంగాని కాలమునకేమిభయము లేదు.

పల్లవ కొం——అమ్మో ఇకశానలెండి. ఈకాలమూ! బలేదొంగకాదూ పచ్చపుదొంగన్నమాట. సూస్తూ ఉండగానే కళ్లల్లోదుమ్ముకొట్టి పనులన్నీ పాడుచేసి పారిపోద్ది. దాటిపోకుండా తాటికట్టినాసిలుపదు. గోడదాటిందా దినాలు, గంటలూపట్టనేలేంసరిగందా ఒక్కనిముసాన్నికూడ మళ్లియ్యలేము. బలేదొంగ కాని జమానయ్యావస్తే గంటలుకూడా వెనక్కుమళ్లుతయ్యనుకుంటా.

శుకి——(పైకపుసంచితో ప్రవేశించును).

కోకి——పల్లవా! ఈపైకముతీసికొని మాధవుని జెఱవిడిపించి, మరల నీ పరితపించు పైకమున కొప్పగించుము.

(పల్లవుఁడునిష్క్రమించును.)

సోదరీ! నేనింకనిక్కడ నిలువఁజాలను. లోనికింబోవుదమురమ్ము. ఇంచుకంత విశ్రమింతుము, సరి ఎక్కడివిశ్రాంతి!

(అందరు నిష్క్రమింతురు)

తృతీయరంగము.

(ప్రవేశము- కొంకణదేశపు మాధవుఁడు-వీథి.)

మాధవు-కొం——

సీ॥ ననుఁజూచువారెల్ల నతులొనరైచెడివారె
మొన్నాళ్లనెయ్యమో యెన్నునటుల
చేరఁబిల్చియొకండు పిల్చెవిందునకని
యొకడురూకలసంచి నొసగినాడు
దయగలాడితడంచు దండమొక్కఁడుపెట్టె
గొనుమంచుసరకులఁ గొసరెనొకడు
పైడిగొల్సునుమీదఁబడవైచెనొక్కఁడు
సొమ్ముమాపటివేళ నిమ్మటంచు
గీ॥ కుట్టుపనివాడుమేనెల్లఁ గొలిచివిడిచి
పట్టుకమ్మాజులంగీలు గుట్టెదనని
వెంటఁబడియెనుగొన్నింటి నంటఁగట్టి
వీటిజనులెల్లరకునొక్క వెట్టివాడమొ॥
గీ॥ యక్షిణీవిద్యనెఱిఁగిరో యందరిచట
భూతమేమైన,బట్టెనో పురమునెల్ల
నన్నిపాతంబుపుట్టెనో జనులకిపుడు
లేకయివియన్నివాడమెనో నాకెఱుఁపుడు॥

ఉ॥ తాతనుబాసివచ్చియిటఁ దల్లినినన్నునుఁ గానలేకనే
నాతతదుఃఖభారమున నంతకునంతకుఁ గందుచుండనే
నీతటినీడఁజేరి యికనిట్టులదిట్టల జేతజిక్కియి
ట్లైతిరుగాడునట్లు మొగమందున వ్రాయగబోలుధాత హా!॥

ఈస్థితియంతయుఁ జాడఁజూడ నాకొకమూలదుఃఖము నొకమూలనవ్వు పుట్టుచున్నది. [విమర్శించి] ఆకోకిల నాకై యంతవిలపించుటకేమికతంబో? ఆపెయెవరైయుండనోపు. వేషభాషానటనంబులంబట్టిచూడ నాపెవేశ్యకాదని నిర్ణయింపవచ్చును. వేశ్యయేయైనచో

సీ॥ వింతమాటలచేతఁ గంతుసందడిఁజూపు
మాయమాటలచేత మరులుగొలుపు
ముళ్లమాటలలోతు సుళ్లలోఁబడద్రోయు
నయగారములచేతఁ బయికివచ్చు
గులుకులబెళుకులఁ గూలంగద్రోయుచు
నంతమంచపుకోటి కంటగట్టు
జిలిబిలిపలుకుల గిలిబాముధనమెల్ల
దులిపినొల్లగఁజేసి వెలికిఁద్రోలు
గీ॥ విటులనీరీతిఁ జేయును వెలవెలంది
కానియీలేమ సహజమైన కాంతుఁజూపె
కడుపులోవంత లేనిదికంటనీరు
వచ్చునెట్టులయీలేమ వగలఁబొగిలె॥

నిజమే! ఈపె స్వీయయేయనుకొందము. సామాన్యకాకున్న నింత పరాకెట్టుకలుగు? దీనినెట్టుసమర్థింపవలె? ఆలతాంగిభర్తయు నన్నుఁబోలినవాఁడై యుండునా! చీ!. లోకమందిట్టివింతయుండునా! అసంగతి యెట్టులున్నను నీమెస్వీయయేకాని సామాన్యకా

దని నిర్ధారణచేయవచ్చును. ఆకారణంబుననే నీపె సోదరియం
దు బద్ధానురాగుండనయియుండుట దోసముకానేరదు.
ఏమంటిని? నేనంతమాత్రమునకు నోచికొంటినా? మాటలసం
ధున మల్లవల్లివారు వీరవల్లిపోయిరన్నట్లు లేదేదియో యోచిం
పుచు నేనెంతదూరము వచ్చియుంటిని? వచ్చినవాడను రానే
వచ్చితిని ఆవలకాలువయొడ్డుననున్న పూదోటలో నీపట్టపగటి
పేరెండ పెల్లునఁగాగకుండ నించుకంత విశ్రమింతునుగాక.
ఆహా! ఏమియీవేసవికాలపు మహాత్మ్యము

సీ॥ చండప్రచండమహా సాంద్రబుక్తతులచేఁ
దపనుండుతపియింపఁ దల్లడిల్లి
వీతశ్రములుగాఁగ విమలజలంబుల
సుభగావగాహంపు సొంపుగాంచి
పాటలీసుమ సౌరభములకువ్వాడి
వన్యవాయువుల్ మేనులపైకొనంగ
నారామములయందు నారీమణులయూరు
లభయహస్తంబీయ నడలుదక్కి
గీ॥ కోకిలలు వేపఁ గలకంఠికొంగునందు
నళులు వేపంగఁ జంపకనాసలయెడ
శరణుసొచ్చుచు వేసవిసమయమందు
గడుపుచుందురు కాలంబుపశుచువాంద్రు॥

[అని నిష్క్రమించును.]

(ప్రవేశము-పల్లవుఁడు కొంకణదేశజుఁడు)

పల్లవ-కొం—తిరిగితిరిగి నాపాణంసొలొచ్చింది.

ఉ! తాలముసెయ్యిదీసికొని దబ్బునయింటికిమోయి పెట్టలో
మూలనుసందితేర! బడినుంగలకూకుడియుంటనంచునా

యేలికసెప్పితోలెనను యేడనుజాడలెదేండిరోసి సాల్
సాలు నరాలుగుంజె నలచావిడికాడికిబోయెనేమొగా॥
తెలివుండదో పిచ్చిపట్టిందో కూడా తెలియటంలేదు. ఇదేం ఖర్మరో

ఉ॥ ఆయమకీన కేమయిన నంటిసలంటెను అంటకున్న నీ
సాయనుపైకమిస్తద! పసందుగనుండది నాకు దెల్లు దొ
డ్డోయినమాదవయ్య యిపుడోయమబట్టగసిక్కిపోయె న
న్నేయిటుకన్నుకప్పె నికనెంతకు లేదుబలారెవాడిలన్॥

అంటోసొంటో ఆయమ్మకీనకీ అతికిందనుకుంటే ఈ జమానియ పట్టు
కొంటంయేందో! అంతాయింతే.

(ప్రవేశము రామామణి, వారకాంత)

రామామణి:—అమ్మయ్యో! అమ్మయ్యో! ఎంతమోసగాండ్రీ మొగ
వారు. లేనిపోనిమాటలు మొలపించి యబలల మోసపుత్తురు
గదా. నక్కజిత్తులన్ని నావద్దనుండ తప్పించుకొనిపోయె తా
మేటి మేటి యనునట్టులిపుడు నన్ను గన్నుమఱపించి యా మా
ధవుండు, నాయుంగరమును తీసికొనిపోయెగదా.

ఉ॥ ఏమియొనర్చుదాన నిపుడేమని తల్లికిఁజెప్పుదాన నా
కేమియుఁదోచదిప్పుడెటకేగెనో వానికనుంగొనంగ నా
కేమనిచెప్పువాడో యపుడిచ్చును, యీయడో యీయకున్న నే
నేమనివాదులాడెద నిదేలఘటించెనో నాకునక్కటా॥

ఛం॥ గొలుసును దెచ్చియిత్తు నిదుగోయిదుముంగరమంచు వింతమా
టల మొలపించ నేనతని టక్కులనమ్మితి నీతగింజపో
కడలకుఁ దాటిగింజగొనగా దలపెట్టితిఁగాని యిట్టులన్
దొలికగుమోసమంచు మదిదోచకపోయెను నాకునక్కటా॥

(పల్లవుడింతదనుక తెల్లపోయిచూచును)

పల్లవ. కొం:—ఓరీయమ్మోరూ! మాఅయ్యగారి పేరు తలస్తదెందుకు,

రామామణి:—ఆయన సేవకుఁడీ పల్లవుఁడిచట నేమియో యోజింపుచు నిలుచుండె. వీని సించుకఁ గదలించి చూచెదఁగాక. (ప్రకాశముగా) పల్లవా! ఏమి నీయాలోచన ముడిపడినదా? మీ యయ్యగారెక్కడ.

పల్లవ. కొం:—ఏంటీ! సోద్దెం. నాపేరు నీకెట్టా తెలిసిందమ్మా.

రామామణి:—అమ్మయ్యో! యెంతవాడవురా! ఆయయ్యగారి నౌకరువే. నీకుపుణ్యమాయెను. ఈపాటినోటిసాయము చేయలేవా!

పల్లవ. కొం:—(స్వగతం) గొలుసిస్తానని ఉంగరం పట్టుకొచ్చాడంట. ఈగోల నాకెందుకు. చివరకు నామీద కెదురుతిరుగుద్దేమో (ప్రకాశముగా) నీయయ్యగారిని నేనెరగ! గొలుసేందో ఉంగిరమోరి కిచ్చినాడ్రొ నాకేమెరుక. నడమ్మ నడునడు. నీదోవన నువ్వు నడు. నాదోవన నేనడుస్తా. నీతో నాకెందుకు.

రామామణి:—భోగముజాతిలో జన్మించి పోయినయుంగరమును సంపాదింపలేని నాసానితనమెందుకు

చం॥ చిటికిటు వేసినంతటనె చేరెడురూకలులాగునట్టి నా
కిటుకులఁజూపి నేనతనికిన్ మదిమారిచి యుంగరంబునుం
దటుకునఁదేకయున్న నిక నాపరువెట్టులనిల్చుఁ గొంత వే
సటయనిచూడ కేనటకుసాగెద వేసటలిప్డుచూపెదన్॥

ఒకటిరెండయిన నెట్టులైన సమాధానపడవచ్చును. మూడు కాసుల ముద్దుటుంగరము నెట్టులు పేక్షు సేయనగును. అతడెక్కడనున్న నీయూరెల్ల గాలించి, యాతనిఁబట్టికొని, యుంగరము, తీసికొని పోయినఁగాని, మాయమ్మ నన్ను బ్రతుకనీయదు. నేనిదె పోయెద.

(అని నిష్క్రమించును)

పల్లవ. కొం:—పడవలరేవుకై పోయిందేమో, ఆడకే యెతుకులాడుతూపోతా! అనుకున్నదోటీ! అయిందోటి. పోయినోళ్ళకోసం యెతుకులాడ్డం పోయింది. ఉన్నోళ్ళకై యెతుకులాడ్డం అవుతుండది (నిష్క్రమించుట.)

శ్రీ శారదాయైనమః.

చిత్రమాధవ నాటకము

చతుర్థాంకము.

చతుర్థరంగము.

{ ఉద్యానవనము. ప్రవేశము కొంకణ మాధవుఁడు ఒక చలువతిన్నెపై విశ్రమించి. }

మాధవ. కొం:—అహాహా! ఏమి యీయుద్యానవన రామణీయకము!

ఉ॥ బారులుదీర్చు బాటలకుఁ బ్రక్కనఁజక్కని మావిగున్న లెం
తేరమణీయమౌ ఫలములెల్లెడఁగొల్లగఁదాల్చియున్న వీ
తీరున లేజివుళ్ళుపయిఁదేటులు, పాటలుపాడిపూతపై
జోరులు సేయుచున్న విటసొంపులుపొంపిరివోవుచుండెడిన్॥

ఉ॥ చల్లనినీడఁ జేరితిని చల్లనితెమ్మెరపారుచుండె హా
మల్లెలవాసనల్ జెలగ మాటికిఁదేటులుపాటఁబాడ మే
నెల్లను జల్లరించె మరుజేయడెనాయెడవాడితూపులన్
జెల్లునె యిట్టిచోటులకుఁ జేరుటచేరెనునాకుఁగూరుముల్॥

బాపురే! నాకన్న మందమతియుండునే! మరికొంతసేపాముఱిపెంపు మిటారితో మాటలాడక నేనేలలేచివచ్చితిని.

బంధురవృత్తం.

పలుకులఁగులుకులవలపులనిలనీపాటలగంధినిఁబోలుసతుల్
గలుగరుగనులవిగలువలఁగెలుచున్ గాలికిఁగంజములంజలిసే
యు, లలిమొగముచలివెలుగునకెనయౌ నూరులురంభలదంభమడం
చు, లతయొకనువగుగునములప్రోవౌ సుందరినెన్నఁడుజెందుదునో॥

ఉ॥ నవ్వులచెగ్గుదేరువదనంబునయంబును గోరచూపులన్
జవ్వనువచ్చుకన్గవయుఁ జిక్కనిచక్కనిపైటలోపలన్

రవ్వలు సేయుచున్నవయ్యు, నాకిటఁ గన్నులఁ గట్టినట్టులై
దవ్వుల నెట్టులుండెసతి, తాలిమిఁ దూలితిఁ దాళలేనికన్॥

నాయార్తి, నాబాధ, నావేదన నెవ్వరాతన్వీమణికెఱింగించువారు.

సీ॥ చిగురుఖాణాదిని చిన్నిరెమ్మలపైనఁ బాడెడిపికమ నీపాటకాల
పండ్లెల్లదినితిని కండ్లుగానకపల్కు చిల్క! నీనాలుకచీలిపోను
దొమ్మిచేసినయట్లు ఘుమ్మనిననువేచునళులార! మీరెన్నుచులణగిపోను
తమ్ములఁదినిభూతిలమ్మునడుగెట్టు దంచ! నీ ◌డుగునేడంటిపోను

గీ॥ ఏటికులికించెదరు నన్ను నిపుడునాదు
బోటివచ్చిన మీనోళ్ళుమూయకుంద్రె
పాటఁ బల్కులఁ జూపులఁ బదములిడుట
మీరితలదాటిపోవుదురు మిమ్ముల॥

శుకమా! నిన్నుఁ దూలనాడితినని నాపై నలుకఁ బూనక, నా మనో
హారికి నామాటగా నిట్లువిన్నవింపుము.

సీ॥ నలినాక్షినయనముల్ నామీఁదబడగానె,
ముదమొప్పగాఁ దొలిమొల్కలెత్తి
సుధయుబ్బునట్టియాసుదతిముచ్చటలు వి
న్పడగానె పిదపతాఁబల్లవించి
నెలతేజువెల్లిదోచు నెలతనవ్వోలయనఁగఁ
బాలివ్రొకయావలఁ బూవుపూచి
నిముసంబునకు నొక్కనేవళంబునవచ్చి,
యుల్లంబునువ్విళులూరఁ జేసి

గీ॥ రమణఋూ రెడి నామనోరథపుఁదరువు,
సఫలకత్వంబుగాంచునాసతిసదంక

పరిచయంబునగాననిప్పాటనింత
దాన్నికై లోభపడుటకుఁ దగదటనుము॥

ఏమంటిని! ఈచిలుకా! ఆచిలుకలకొలికికి నాపలుకు లెఱింగించుట! ఎఱి
గించిన నేమిప్రయోజనము?

చం॥ పలికిన నామనోగతము బావయటంచునుబిల్చియప్పపై
నలుగుటగూడదంచు బలుకాడెను వేడెను నాసుభావమూ
కలికికొంకించుకేనిఁ బొడగట్టినయట్టులఁ గానరాదు నా
వలపులికెట్టుఁదీరు నలవారిజనేత్రనికెట్లుగాంచెదన్॥

ఉ॥ చూపుల తూపులన్ గురిసిసుందరితూటులువారఁ గొట్టెఁ బూ
దూపుల మన్మథుండునను మత్తుమురానటులేసె నన్ను నా
వేపగఁ జొచ్చెఁ గోకిలలి వేకడుఁ జిత్రము చాననెవ్వరున్
వేపరు; బోటులన్ గలప వీరులు భీరులుగారె! బాపురే॥

(ప్రవేశము పల్లవుఁడు కొంకణదేశజుఁడు)

పల్లవుఁడు. కొం:—కనపడనే కనపడడేమో నాగతేమిరా! అనుకున్నా
గాని-ఈ ఉండాడు అయ్యగారు. అమ్మయ్యా! బతికానురా జీవుడా!
అయ్యగారేంటో ఆలోచిస్తుండాడు. ఏంటేంటో తనలోతానే
గొణుక్కుంటుండాడు. ఈ సెట్టుసాటునుంచి యింటాను.
(అని చెట్టుచాటుకుఁ బోవును)

మాధవ. కొం:—ఉశ్శు! అబ్బా! ఏమియీతాపము. నీడనుకూరుచున్న
నావల కాలువనీటిపైన గాలిచల్లగ వీచుచున్న నావంత తాపోప
శమనము గాకయున్నది.

ఉ॥ కోకిల వేపునన్ను నటకుంజననాడకుఁ బోకయుంటినా
కోకిలలిట్లు వేపునికఁ గోమలి ప్రేమలఁ బొందుటెట్లు నా

కాకలి కెట్టులబ్బు మధురమ్ముల నాపగడాలు లేదు హా
వ్యాకులమయ్యె మానసమ వారితమయ్యెను దాపమెయ్యెడన్॥

శుకీ! ఇదేటిపాటి గడుసుందనమా? చలపాదితనమా! ఏయూరివాడనో, యేపనిమీదనో, యీపురిం జేర, నన్ను నీరూపలావణ్య వారాశిలో ముంచి వేయుట పాటికాదుసుమా!

పల్లవ. కొం:—కోకిలమ్మ కీయనకు అంటిసలనుకుంటే ఈదిలో నేమో ఆభోగమమ్మోరు తనకూ ఈనకీ యిలా కాలంటది. తీర యీడ కొస్తే అకోకిలమ్మ చెల్లెలికై యీన పరితపిస్తుండాడు. అయినా యెదటపడతా. లేకుంటే మరీ పిచ్చెత్తేట్టుందీసకు. (అనిముందుకు నడచును)

మాధవ. కొం:—అదుగో పల్లవుండు వచ్చుచున్నాడు. నావేదన నించుక మఱుగుపఱచవలయును.

పల్లవ కొం:—పైకమిదుగోనయ్యా! యములో జెల్లిపోయినట్టుండాడే

మాధవ. కొం:—ఎక్కడిదిరా యీపైకము. (స్వగతము) ఇదుగో పైకమనుటకన్న నిదుగో శుకమనిన నెంతబాగుండును. (ప్రకాశము) యమభటుడెవ్వరురా!

పల్లవ. కొం:—యములోడంటే యమలోకంలో ఉండేవాడుకాదయ్యగారూ, కైదీలతోటి బందికానకొట్టుకాడ తుపాకికట్టె బుజాన బెట్టుకొని నిలబడతాడే ఆయన.

మాధవ కొం:—ఏమిరాయీగోల! నాకేమియు బోధపడలేదు.

పల్లవ, కొం:—ఆయనయ్యా! ఈదిలో నిలబడతాడు. పల్లెటూళ్ళకుబోతే కాపులమీదంబడి కానుకలుచ్చుకుంటాడు. ఆయనయ్యా! ఈదిలో కాలుమడిచావని బెదరించి యెంతోటివారికి సోమవరపు కడియాలు దగిలిస్తాడు ఆయన.

మాధవ. కొం:—రక్షకభటుడటరా!

పల్లవ. కొం:—ఔనయ్యా!

మాధవ. కొం:—నీగోలచాలు! నీసోది నింతటంజాలించి, కాలువనంబడవలు సిద్ధముగా నున్నవేమో చెప్పుము. వెంటనే పోవుదము.

పల్లవుండు:—ఎందుకయ్యా! గంటకిందటనే మనవిచేస్తినిగా, పడవలు సిద్దంగా ఉన్నయ్యాని. అప్పుడు జమానియ్యాతో తమరు పెనుగులాడుతూ ఉండి నన్ను పైకంకోసం యెల్లిరమ్మంటిరి. మీకు మోక్షమిచ్చే చివదూతలిరుగో. [అని పైకముచేతికిచ్చును]

(ప్రవేశము రామామణి)

రామామణి:—ఓహో! బావగారా! ఇక్కడ నొంటిగా గూరుచున్నారేమి? కంసాలిని కలుసుకొనినట్టున్నారు. ఇదియేనా, నా యుంగరమునకు బదులు తమరిచ్చెదమన్న బంగారు గొలుసు (అని యందికొనంబోవును)

మాధవుడు:—(చివాలున లేచి) ఛీ! ఛీ! ఎవరునీవు? ఏమి యీ సాహసము! పైకిరాక దూరముగాం దొలగిపొమ్ము. నీవు భోగముతొత్తువైన నీవగలెవ్వరివద్దం జూపనగునో వారియొద్దం జూపిన బాగుండును.

పల్లవుడు:—బాబో! ఆభోగమమ్మోరీడకొచ్చిందిరో! మాదొడ్డపిశాచం

మాధవ. కొం:—[మిక్కిలి చిరాకుతో] పిశాచముకన్నమిన్న.

గీ॥ భోగముతొత్తులందరికి మోహానదీపములంద్రు మన్మథోద్వేగముతోడం గాముకులుదీపపుంబుర్వులరీతిఁ దిరిగి,
మూగుచుంజుట్టిచుట్టిపడిపోదురు మంటలనంటి, కావునన్
భోగముసానిఢాయు నెడంబోదగు వెన్కకు నెట్టివారికిన్॥

రామామణి:—చాలుఁజాలు నీసరసాలు. ఓయబ్బో! అక్కఱదీరిన వెనుక నందఱు నిట్టులేయందురు. చలితీరిన వెనుక శేలువకుట్టుచున్నదందురు. ఇప్పటికిఁ గాకపోయినను గొంతసేపటికైనను మాతో పనిపట్టకుండునా? అప్పుడు మీమాట మీకొప్పఁజెప్పకుండునా? అందరు క్షేమమనిఁ బడిపోవుచున్నారు. మమ్మొన నక్కఱలేదు. సంసారులు సానులకూట దుమ్ముకొట్టుచున్నారు. అలసిపోయిరికాఁబోలు దయచేయుడు. మాయింటికడ నించుకంత ఫలాహారము చేయుదురు.

పల్లవ కొం:—అయ్యగారూ! నీకు పొట్ట పెద్దది లేదుగదా అని యిచారంగా నున్నదినాకు.

మాధవ. కొం:—ఏమిరా!

పల్లవ. కొం:—దయ్యంతో తిండితినేవాళ్ళకెంత పొట్టుండాల!

రామామణి:—చాలులెండు! ఏమిటీమోటసరసము.

మాధవ. కొం:—పో! పొమ్మాపప్పులిక్కడనుడుకవు!

రామామణి:—పప్పులుడుకకపోయినను సరి. పులుసులు క్రాగకపోయినను సరి. నాయింటికడ నింతకుముందు మీరు పుచ్చికొనిన యుంగరము నాకిప్పింపుడు. లేదా! దానికిబదులుగా తమరిచ్చెదమనిన బంగారుగొలుసునిచ్చిన మఱింతసంతోసము. నాసొమ్ము నాకు మట్టఁజెప్పిన నేఁబోయెద. ఎందులకు తమకంతకష్టము. దయయుండిన నంతియచాలు.

పల్లవ. కొం:—కొన్ని దయ్యాలకు పసుపుకుంకమయిస్తేసాలు, కొన్నింటికో రైకగుడ్డ యిస్తేసాలు, యీదయ్యానికి గొలుసుకావాలంట. ఇస్తేరా, నిన్నునన్నుకూడా కట్టేసద్ది దానితో బద్ధరం:—

మాధవ. కొం:—ఛీ! ఛీ! పల్లవా! మనముపోవుదమురమ్ము. దీనితో వాదులాడిన మనకుఁ బరువులోపము. లేలెమ్ము.

[అనిమాధవ పల్లవులు నిష్క్రమింతురు]

రామామణి:—[స్వగతం] ఈతడిట్టివాడని నేనెన్నఁడనుకొనలేదు. ఇంక నేనెట్లు మాయమ్మ ముఖముఁజూతును. నిలచిమాటాడినకద నేనేమైన మాటలాడుట. ఇట్లుమేఘములపై నెగిరిపోవువాని నెవ్వరేమిసేయఁగలరు. ఇప్పుడు దీనికేమనుకొందును. ఇన్నినాళ్లింతటివాడనిపించుకొని, యింతస్వల్పములో నింత వెలితిపడునా? నేడీతనికి మతిభ్రమణమేర్పడి యుండవలయును. నేనిదేమార్గమున నీతనియింటికేగి యీతనిభార్యతో "నీమగనికినేడు పిచ్చియెత్తి నాయింటఁజొరఁబడి బలిమిమైనాయుంగరము తీసికొనిపోయెనని" గండాగొండిచేసిఁ దానికగు విలువఁ గొనిపోయెద. [రామామణి నిష్క్రమించును]

చతుర్థాంకము.

పంచమరంగము.

రక్షకభటకార్యస్థానప్రాంగణము.

(ప్రవేశము పాండ్యమాధవుఁడు.జులూంఖాన్.)

మాధవ. పా:—[స్వగతము.]

ఉ॥ పల్లవుడింక రాడిటకుఁ బైకమునిమ్మన నాదుభార్యతో
నుల్లమునందు నేమియనియూహాలుసేసెనొ? యీయలేదొ? నే
డల్లరిపాలుగావలసె నక్కట యక్కమలాక్షిమానసం,
బెల్లవికారమొందె నపుడెట్టులొసైచితి నేమిసేయుదున్॥

ఉ॥ ఇంతటి మానవంతుడితడెట్టులఁబట్టఁ జిక్కెనంచునా
యింతిదలంచె నొక్కొయిక నేగతినీగతి బాపికొందు

(ఎదుటఁజూచి) నా
వంతలడంగఁ బల్లవుఁడువచ్చుచునుండె
(విమర్శించి) నిదేమివింతయా
వంతయుఁ దంద్రలేక యితడాడుచుఁ బాడుచువచ్చుచుండెడిన్॥

జులూమ్‌ఖాన్ :—క్యామహారాజ్! జామిన్ దాఖల్ చేయక్‌పోతే హరఖత్ చేయటాన్కి మాసరదార్ హుకుంనహీ

మాధవ. పా:—భయపడకు. నేనుపారిపోను. మా సేవకుఁడదుగోవచ్చుచున్నాఁడు

[ప్ర. పాండ్యపల్లవుఁడు]

ఏమిర తెచ్చితివా.

పల్లవ. పా:—నేనెల్లటం పనికాకుండావుండడంకూడానా! యిదిగోనయ్యా (అనిత్రాడునందిచ్చును)

మాధవ. పా:—పైకమేదిరా?.

పల్లవ. పా:—తాడిస్తే పైకంపుచ్చుకోడూ కోమటాయన;

మాధవ. పా:—అయిదువందలరూపాయీలు త్రాటికేయిచ్చితివిరా?.

పల్లవ. పా:—నాకిచ్చిన దర్దరూపాయేగా!.

మాధవ. పా:—నేనిన్నుఁ బంపినదెందుకు?.

పల్లవ. పా:—తాడుకోసం.

మాధవ. పా:—ఓరీ! బుద్ధిహీనుఁడా! నీవీవునీతాడు తెగును.

[అనికొట్టుచున్నాడు]

జుల్మాం:—హజరత్! శాంతంచేయండి కొంచెం [అనిఅడ్డముపోవుచున్నాడు]

పల్లవ. పా:—నీశాంతం బంగారంగాను నాయీపుపగులుతూంటేనో మూల.

జులూం:—గడబిడచేస్తావ్! ఎరివాడా! నోరుదబాయించు నమ్మక్‌తింటావ్. నవుకరియేగేస్తావ్!

మాధవ. పా:—[కోపముతో] బుద్ధిలేనిమొద్దు

పల్లవ. పా:—మొద్దైనా నయమేనయ్యాగారూ! మీగుద్దుల సురుకైనా తెలియకుంటది.

మాధవ పా:—అంతేనీకర్మము. అంతకంటె నీయొద్ద యోగ్యతలేదు అడ్డగాడిద. ఇంక నెదురాడుదువులే

పల్లవ. పా:—నాచెవులు పొడుగ్గావున్నయ్య నాయేమిటయ్యాగారూ! నన్ను మాటిమాటికి గాడిదా గాడిదా అని పిలవటం నేబూంమీద పడ్డది మొదలీ యనపాదాలకాడ నౌకరీచేస్తూవుండాను ఎప్పుడెప్పటికి గుద్దులుతప్ప మరోటి యీయనచేతిమీదుగా ముట్టినట్టు కనబడదు, నిద్రపోతూంటే ఓగుద్దుతో నన్ను లేపటం కూకుంటే ఓగుద్దుతో నన్ను లెగ్గొట్టటం యీదులో కెల్లాలంటే ఓగుద్దుతో నన్ను బయటకెల్లగొట్టటం యిట్టాంటివియెన్నిబళ్లగుద్దులో చిన్నప్పటినుంచితిన్నాను. తినిమరవరాదన్నారు.

మాధవ పా:—చాలింక నోరుమూయుము. ఇంటికిపోవుదమురండు. జవాన్! నీకుఁ బ్రాతిభావ్య మింటికడనిచ్చెదను.

[అని నిష్క్రమింతురు].

చతుర్థాంకము.

షష్ఠమరంగము.

{ పాండ్యమాధవుని గృహప్రాంగణము. ప్ర॥ కోకిల
శుకి. రామామణి హుళక్కిమజేఁగొందలు }

(ప్రవేశము పల్లవ. పా. మాధవ. పా. జులూంఖాన్)

పల్లవ. పా:—అమ్మగారూ! ఇయ్యాలమీవాళ్లైనా కాపాడుకోండి.అల్లదిగో నయ్యగారి సేతులో త్రాడు

మాధవ. పా:—ఇంకనిట్టులనే వదరుచుండెదవా? (అనికొట్టును)

రామామణి:—చూచినారమ్మా నేఁజెప్పినప్పుడుతమకాగ్రహమువచ్చినది. ఏమనియెదవు నీమగనికిఁ బిచ్చిపట్టినదా లేదా?

కోకిల:—

ఉ॥ ఏమితపంబుసేసితినొ యెట్టివినోములునోచినానొ యే
మేమి సపర్యసల్పితినొ యీగతి నాపతివెఱ్ఱియాటకిం
కేమిగతంబొ నేటికిటులిట్టిఫలంబొడిఁగట్టికొంటి నా
కేమియుఁదోచకుండె నిపుడేమియొనర్చెడిదాన దైవమా॥

నిజముగా నున్మాద మావిర్భవించినట్లున్నది. నేనేమిచేయుదునే సోదరీ! ఉల్లక్కిగారూ! తమకు భూతవైద్యమందుఁ గొంచెము ప్రవేశమున్నదిగదా ఒక్కపరిచేయిచూడుడు.

హుళక్కి:—ఏమమ్మా ఏమంటిరి? నాకుఁ గొంచెముప్రవేశమున్నదనియా. ఇకనెప్పటికిట్టులనకుడు. నాకు సంపూర్ణపాండిత్యముగలదని నన్ను మహారాజుగారు మెచ్చికొని యాస్థానవైద్యునిగాఁ బెట్టికొన్నారు.

శుకి:—సోదరీ! చూడు చూడు మాబావ వెఱ్ఱివానివలె మిఱ్ఱిమిఱ్ఱి యెటులఁజూచుచున్నాడో.

రామామణి:—ఒడలెఱుంగక నెట్టులావేశముతో వడకుచుండెనో చూడుమమ్మా.

హుళక్కి:—(మాధవునివంకఁజూచి)
నాయనా ఏదీ నీచేయిఁజూపుము.

మాధవ. పా:—ఏమీ! నాచేచవిచూచెదవా?

హుళక్కి:—ఇంకసందేహమేమి! ఇయ్యదితప్పక భూతమే.
(మాధవునికై కండ్లురిమిచూచుచు)

ఝూ! మహాకాళీ! ఎవరనుకొన్నావు! నన్ను భేతాళుఁడనుకొనుము. పలుకు! పలుకు! నీవెవ్వరు.

మాధవ. పా:—హుళక్కీ! మంచిప్రయోజకుడవు! పిడుగునకు, బియ్యమునకు నొకటేమంత్రమనునట్లున్నది. నీకు రెండుమంత్రములు వచ్చునుగదాయని, యందఱకు భూతవైద్యముఁ జేయనెంచితివా యేమి? నాకుఁ బిచ్చిపట్టలేదు గిచ్చిపట్టలేదు. నీపిచ్చికళలు మాత్రము నాయొద్దఁజూపకు. అఘాయిత్తములు చేసితివా నీకుఁ బట్టిన దయ్యమును వదులఁగొట్టెదను.

కోకిల:—ఆయున్మాదమే లేకుండిన నింతయేలఁపుట్టు నాథా?

మాధవ. పా:—చీ! చీ! చాలునింక నోరుమూయుము. నేడీపాడు మొగమువాని నింటఁబెట్టికొని తలుపుతీయక నీతిమాలిన పని చేసి నీవునుఁదగుదని నలుగురిలో నోరెత్తనెంచితివా?

కోకిల:—అమ్మయ్యో! అమ్మయ్యో! ఇంకేమున్నదమ్మా నిజముగాఁ జిత్తచాంచల్యమే. నాథా మీరింటికడ భోజనము చేసినదే జ్ఞాపకములేదా? ఈరద్దియేల!

మాధవ. పా:—(కోపముతో)
నాకింట నీవన్నమిడితివా? ఏటికీకూతలు?

పల్లవ. పా:—నిజమేనయ్యా! ఇయ్యాల తమరింటికాడ బువ్వదినలేదు.

మాధవ. పా:—

ఉ॥ ప్రేలరి నోరుమూయుమని ప్రేలుచునీవలవీధినుండి యే
దోలగలేదె? నన్నునికఁదుచ్ఛపుఁబల్కులఁబల్కఁజాలుదే
కూళలఁగూడి నీతిచెడి కొంపకుఁదొంపులుతెచ్చిపెట్టు గ
య్యాళివిగావెఁనీవు నినునాదలఁదన్నెదఁబొమ్ము కల్లరీ॥

కోకిల:—నాథా!

ఉ॥ అక్కటికంబుమాని యిటులందఱిముందఱనన్నుదూరగా
నక్కట! నీకునాయమమనంబునుద్రిప్పగమందు మాకుతే
టక్కులమారిబెట్టు నొకటాయని పొక్కుచునుందునెప్డు నా
మక్కువయైనఁజూడ కవమానముసేయఁగఁబూనియుంటివా॥

మాధవ. పా:—ఏటికిన్ని ముళ్ళమాటలీబొల్లివగపులు, నీకారుకూతలు వినివిని విసుకుపుట్టి, పట్టరానికిన్కతో తలుపువీడిపోయితిని. పాపము నేను మఱల రాననుకొంటివాకో!

పల్లవుడు. పా:—నిజమేనయ్యా!

కోకిల:—(తెల్లపోవుచు)

ఈపరస్పరవిరుద్ధంబుల కేనేమియుత్తరంబొసంగుదాన!

హులక్కి:—అమ్మా! నీవూరక దిగులొందకుము. అదియంతయు నా పిశాచచేష్టితంబే.

మాధవ. పా:—నడివీదిలో బందనైయున్న నన్ను విడిపింప నీకింత యుపేక్షయా?

కోకిల:—నాథా! మీరిట్లులనిన నేనేమనుదాన. ఇప్పుడేకదా యొకకంట నీరుకార్చుచుఁ బల్లవునిచేతికి పైకమిచ్చిపంపితిని.

మాధవ. పా:—నీచేతికి పైకమిచ్చెనటరా!

కోకిల:—ఇప్పుడే వీడిక్కడకు వచ్చినది. నేనిచ్చినది.

శుకి:—ఔను బావా! నేనే సంచినితీసియిచ్చితిని.

పల్లవ పా:—బాబో! బాబో! దేవుడు సాచ్చికం కోమటాయన సాచ్చికం. అద్దరూపాయడబ్బులుంటె నేనుసిల్లిగవ్వైనాఁ యెరగను.

హులక్కి:—అమ్మా! వీనివైఖరిచూడ వీనికిఁగూడ నావహించినట్లు తోచుచున్నది. యజమానునకు సేవకునకు నొక్కటే చికిత్స సేయవలయును. వీరిద్దఱి నిప్పుడు కాలుసేతులంటఁగట్టి చీకటి

పడుసందాక చీకటికొట్టులో నుంచవలయును. ఆముఖవర్చస్సు, ఆకంటితెలివి, దానిలక్షణములప్పుడే కనుపడుచున్నవి. నిమ్మకాయలు, పేలాలు, మేకులు, రంగుదారపుకండెలు, కొత్తకుండలు, ఊచపుల్లలు తెప్పించి, యావలగది యలికించియుంచుము. రాతిరి మ్రుగ్గువేసి పలికించెదను.

మాధవ. పా:—(పైవాక్యములు విననట్లు నటించి) నాపిలుపున నీవు తలుపెందును తీయలేదు. ముందీమాటలకు సమాధానము చెప్పి మరిమాటాడుము.

కోకిల:—నాథా! అంతకోపమేల! నేనట్లు చేసియుండలేదు.

పల్లవ. పా:—నేపైకమేయెరుగనయ్యగారూ.

కోకిల:—ఓరీ! దొంగముండకొడకా! నీనాలుక చీలిపోను. ఏమిరా యీయబద్ధము.

మాధవ. పా:—

ఉ॥ జారిణిచాలుమూయుమిక సందులగొందులవారినందఱిన్
జోరుగఁబోగుచేసిననుసుళ్లనుముళ్లనుబెట్టుచుంటివీ
కారులుప్రేలునాలుకను గత్తినఁగోయుదు, మోమునూయుదున్
వీరలవీరితాతలను వ్రేల్చెదవీల్చెదఁజూడుమిత్తఱిన్॥

(అని యందఱిపైకి బోవును)

కోకిల:—ఇంకేమున్నదే అమ్మా కట్టివేయుడు కట్టివేయుడు. ఎవరికేమగునో మీదికి రానీయకుడు.

(హులక్కి మొదలగువారు మాధవపల్లవులను గట్టుదురు.)

హులక్కి:—అరుణాచలం వెంకటస్వామీ రండిరండి, దయ్యపుబలము చూడుడి. స్వాధీనమగుటయే కష్టముగా నున్నది.

మాధవ. పా:—[పెనుగులాడుచు] మీరందరు చేరి నన్ను చంపెదరాయేమి. అరివీరులఁ బెడరెక్కలు విరిచికట్టు పెరుంగుదుఁగాని కట్లఁబడుట నేఁడెఱుంగవలసె నక్కట్టా జవాన్ నేను నీఖయిదీనిగదా? నీఖయిదీ నిట్టుచేసిన నీవు సహింతువా. కుంజరయూధంబు దోమకుత్తుక జొచ్చెనన్నట్టులాయెనాగతి.

జులూం:—వదలండి ఆయన్కి వదలండి, మాఖయిదీకీ మీరూ తాకా కూడదూఅన్న మాటా.

హుళక్కి:—వీనికిఁగూడ నదియేచికిత్స చేయవలసినట్టు తోఁచుచున్నది.

కోకిల:—ఉన్నదుండగా నుయ్యూరుమీద మేఁడూరుపడ్డదన్నట్టు లీపులిమీఁద పుట్టయేమి. నీవొకడవా శనైశ్వరుఁడవు మాకు దాపరించితివి.

జులూం:—క్యా అమ్మా! మాకీయేంచెయ్యమంటూర్ మాసరుదారు హుకుం. ఆయన్కి మీరూ అంటాకూడదన్న మాట.

కోకిల:—ఈదావాను దగినసొమ్ము నేనిచ్చెద. నీవింకమాటాడకు. హుళక్కిగారూ వారినింటిలోనికిఁ దీసికొనిపొండు వీథిలో నీరద్ధియేల. ఏమిదుర్దినమువచ్చెరా! యీశ్వరా!

మాధవ. పా:—ఏమిగ్రహచారమువచ్చెరా! రామా!

పల్లవ. పా:—ఇనుముతోఁగూడితే అగ్గికి సమ్మెటపెట్టులన్నట్టులన్నదినాగతి.

శుకి:—సోదరీ! ఏమికర్మమేమిది. చూచుచూచు వారెంత యసంబద్ధముగా మాటలాడుచుండిరో?

కోకిల:—లోనికిఁ దీసికొనిపొండు.

(హుళక్కి ప్రభృతులు మాధవపల్లవులతో నిష్క్రమింతురు.)

కోకిల.—సోదరీ! నీవిక్కడనుండుము. (జవానుతో) ఎవరి వ్యవహారమున నీవు నానాథునిఁ బట్టికొంటివి?

జులూం.—ఆయనాఁ లేదూఅండి బంగారంకర్నేవాలాఁ ఈరాభామడుగారు, ఇస్నాభామడంటగా.

కోకిల.—అతని నేనెఱుంగుదు. అతనికీయవలసిన సొమ్మెంత?

జులూం.— 5 నూర్లు.

కోకిల.—ఏందుకయినదీయప్పు.

జులూం.—ఆయనదగ్గా గొలుసుపుచ్చుకున్నారంటగా.

కోకిల.—గొలుసు చేయించుచుండిరేకాని, యాతనివద్ద నింతవఱకు పుచ్చికొనలేదు.

రామామణి.—కాదమ్మా! నీమగడు మాయింటికివచ్చి నాయుంగరమును పుచ్చికొని దానికిబదులు గొలుసునిచ్చెదనని చెప్పి పోయెను, తరువాత నాతడు నాకుఁ గాలవయొద్దున కనపడినప్పుడు మెడలో గొలుసునుగూడ ధరించియున్నాడు. నాకెందుకీగొడవ. ఆయనచేతనున్న యుంగరము నాది. నాది నాకిచ్చిన ఁజాలు. మాదిమాకిచ్చిన మడిమాన్యములిచ్చుట.

కోకిల.—కరువులో నధికమాసమనునట్లు నీవుకూడ నిప్పుడే దాపరించవలయునా? ఛీ! పో!

రామా.—ఈయడావడిలో నామాటలదుకవు. మఱికొంతసేపునకు వత్తునుగాక. (అని నిష్క్రమించును)

కోకిల.—ఈగొడవ నాకుఁదెలియదు. ఆకంసాలి నిచటకుఁ దీసికొని రమ్ము.

(కొంకణ మాధవ పల్లవులు వీథివెంటబోవుట)

శుకి.—సోదరీ! సోదరీ! ఇంకేమున్నదోయమ్మ. మఱల బావవదలించి

కొని యెఱదీసిన కత్తులతో వీధివెంటఁ బరుగెత్తుచుండెను.

కోకిల.—మఱలఁ గట్టిపడవేసినఁగాని మాటదక్కదమ్మా. వీధిలో నింకెవ్వరికేమగునో. (వారలకభిముఖులై పరుగెత్తుట)

జులూం.—అరే! అల్లా! దొడ్డసైతాన్ పట్టిందిలాగుంది కత్తియిదిలించిన త్ర్వాతా, ఏమనుకుంటే పంకిపాయితు. యెక్కురండి అమ్మగార్.

కోకిల.—మరినలుగురినిఁ బిలచుకొనిపోవుదమురమ్ము. సోదరీ! అమ్మయ్యో! అమ్మయ్యో! నేనేమిసేయుదునే!

[అందఱు నిష్క్రమింతురు.]

[ప్ర॥ మాధవ. కొం॥ పల్లవుఁడు]

మాధవ. కొం.—మనకత్తులు చూచి జడిసిపారిపోయిరినుమా మచ్చలచావడికిఁబోయి, మన సరకుల నందికొని పడవల రేవునకుఁ బోవుదమురమ్ము.

పల్లవ. కొం.—ఇయ్యాల మాపటికిఁగూడా యీడుంటే మనకేంనట్టం. ఈవూళ్లోళ్లు మంచోళ్లు, చొక్కాలిచ్చేవోళ్లు కొందరు, గొలుసులిచ్చేవోళ్లు కొంధరు, పయికం యిచ్చేవోళ్లు కొందరు, మనపని బల్ వాటంగుండదిగా.

మాధవ. కొం:—ఈయూరంత నాకు ధారపోసినను నిముసము నేనిక్కడ నిలువను. (నిష్క్రమింతురు)

(ప్రవేశము హుళక్కి, వెంకటస్వామి, అరుణాచలం.)

[తెరలో జాంఘికుఁడు]

చేమత్తమైనోరికి తెలియచేసేది యేమంటే ఇయ్యాల యీవూరు కొంకణదేశంనుంచి కోమటాయన ఒచ్చిండు గనుక ఆవూరోడు యీవూరు వస్తే తలతీస్తారని రాజుగారు చాచించారు గనుక ఆయన్నియ్యాల సాయంకాలం వల్లకాళ్లల్లో వురితీస్తారు గనక అందరాడకు రావలసిందోహోయ్.

హుళక్కి:—అరుణాచలం! ఏమిరా యీచాటింపు

అరుణా:—ఇన లేదంటండీ. ఇయ్యాలపొద్దున కొంకణదేశమునుంచి ఓ కోమటి వచ్చిండు ఆయన్ను ఉరితీస్తారంట. ఏముండది. మూడు మూపున్నాళ్ళకు ఉరులతో చరలతోసరి మనబ్రతుకు.

హుళక్కి:—అగును. ప్రాతఃకాలమందు ప్రభువుగారికి విభూతినిచ్చుటకుఁ బోయినప్పుడాకోమటివాని గోల వింటిని. భార్యయుఁ బిల్లలుఁ దాను బడవలో బయనమగుచుండగా నాపడవ పగిలిపోయినదట. ఇద్దఱు పిల్లలుఁ దాను సింటికిఁ జేరిరట. ఇద్దఱుఁ బిల్లలఁ దల్లి నెవరో పడవవాండ్రు తమ పడవలో నెక్కించుకొనిరట. అని యేమేమో తన దుఃఖమును వెడలఁబోసుకొనుచుండెను.

ఈ మాధవుఁడు నీపల్లవుడును— ఓరీ అరుణాచలం నీవెఱుగవు. నీవు పుట్టితివో లేదో యప్పటికి— సముద్రములోఁ దొరకిరని పడవవాండ్రమ్మఁజూప, నీరాజుగారి మేనమామయగు సుబలుడను మహావీరుఁడు కొని, రాజుగారికి సమర్పించి యందు మాధవునకుఁ దనకూతురగు కోకిలనిచ్చి వివాహము చేసెను. ఈపిల్లలిద్దరతనికొడుకులై యుండరుగదా. కొన్ని పోలికలున్న విసుమా. యీవృద్ధవైశ్యున కీమాధవునకు మనమిప్పుడీమాటలనుకొనిన నిందేమితప్పో. మనకెందుకెవనిగ్రహచారము వానిదే.

అరుణా:—అవునయ్యా! మాయమ్మ సెప్పుతుండేది. ఏదెట్టాపోతే మనదేంపోయింది. మనకేం కొత్తామేమిటీశిచ్చలు. మనదేశంలో మామావోళ్లు మట్టిగడ్డలయితే సరేగాని యీ పొరుగూరు మ

డిసికి కూడా మనమేడ చింతపడం. దీనికేంగాని వెంకటసామీ మన హుళక్కయ్యగోరి వైద్దుకం యేంవైద్దుకంర! దయ్యాలకే కాక ప్రతిదానికి భూతవైద్యంసేస్తాడురా బుడ్డదిగినా భూతవైద్దుకమే. ఒళ్లక్కయ్యగారింటికివెళ్ళి, యీబూతి తెద్దామనుకుంటేనే జరం కొంచెం తగ్గుద్ది. ఆరింటికెళ్ళేవరకు మరికొంచెం తగ్గుద్ది.ఆరిసేతిమీదిగా వూబూదిపుచ్చికొని, యింటికొచ్చేవరకు శానాతగ్గుద్ది. నూరులో పెట్టగానే పూర్తిగా తగ్గుద్ది. మీదరమ్మాఅని మాఅయ్యోరికి తగ్గిస్తిరా.

హుళక్కి:—అదియెంతపనిరా! మంచిలావుగల యీచప్పుల్లు సిద్ధము చేసియుంచుము. బిందెనాదములకుఁ గావలయును.

అరుణా:—మేంపోతామయ్యా!

హుళక్కి:—ఇంక నేనింటికిఁబోయెద.

(అందఱు నిష్క్రమింతురు.)

చతుర్థాంకము సమాప్తము.

శ్రీశారదాయైనమః.

చిత్రమాధవనాటకము

పంచమాంకము.

ప్రథమరంగము.

(ప్రవేశము సేవకుఁడు, మాదిగరాముఁడు.)

(రాముఁడు డప్పుచేతఁబూని గోడకు జారిగిలఁబడియుండుట.)

సేవకుఁడు:—దొంగముండకొడకా! రెండుమూడుసార్లు వీధిలో చాటించినట్టే సాటించి, యీమూలొచ్చి నిలవబడ్డావూ బొత్తుగా భయములేకేడుస్తున్నావు. నీ వెట్టిపనూడలాగిస్తాను చూడు.

రాముఁడు:—అయ్యా! నీకోదండం. అంతపనిజరగాలగా. యెట్టిపనికూడ లాగడమేంది? ఏటికల్లా మాకు కొలిచేవి మేరలేనా? అయ్యగూడా ఎగ్గొడుతుండారుగదా? ఎక్కొట్టినా చరేయనుకుంటే అడేజావు బడేజావని జమానియ్యాలు మామీద సవారీలు తీస్తారు: పోనీ! ఊడలాగించునాయనా. సీధరమ్మా అని పాతసెప్పులకుంగటాలు పెట్టుకొని బతుకుతాను.

సేవకుఁడు:—ఏంకూశావు? నీతాతగాడెవడు చేస్తాడనుకొన్నావీనౌకరీ! (స్వగతం) ఈ గాడిదకొడుకులు, సరీగా నౌకరీచెయ్యరు. ఏరా ముండాకొడకా అంటే, మాకు మేరలు ముట్టలేదంటాడు. పని జరక్కుంటే ఆపాపిష్టి గుమాస్తాలు మామీదపడిసస్తారు. [ప్రకాశముగా] నీగోలకాల! ఇప్పుడేమంటావురా?

రాముఁడు:—ఏం దేఁ ద్దో సెప్పినారుగాని మరచినా. ఈపాలి సెపితివా
సీమతలకాయంతయినా పోకుండా నీబొక్కలో పెట్టుకుంటా.
ఈమాలిగీన మరస్తినా నాబుర్రతీయించు.

సేవకుఁడు:—చెప్పుకో. (పదపదమును రాముడనుసరించును.)
ఇయ్యాల కొంకణదేశమునుంచి ఓకోమటాయన వచ్చిండు గనుక ఆవూరువసుసులీవూరొస్తే ఉరితీస్తారని రాజుగారు శాశించారు గనుక సాయంకాలము ఆరుగంటలకు ఉరితియ్యేడం జరుగుద్ది గనుక

రాముఁడు:—జరుగదుగనుక

సేవకుఁడు:—ఆహా! జరుగుద్దిగనుక

రాముఁడు:—జరుగదుగనక

సేవకుఁడు:—ఓరిసీసిగదరగ. అభంబలకమంటే శుభ్యంపలుకుతాడేమి! జరుగుద్దిగనుక అనరా.

రాముఁడు:—ఏంటయ్యా! జరుగదుగనుక

సేవకుఁడు:—పోనీరా! ముండాకొడకా! నీనోటివాక్యాన జరక్కపోనీ బతుకుతాడాయన.

రాముఁడు:—ఇదంటయ్యా తెల్చిండి. మాటపొల్లొచ్చిండి. జరుగుద్ది గనుక ఏం.

సేవకుఁడు:—అదేప్రకారం. ఊరంతా సాటించిరా. (నిష్క్రమించును)

రాముఁడు:—[వీధిలో రెండుమూడుచోట్లసాటి నిష్క్రమించుట.]

ద్వితీయరంగము.

[ప్రవేశము. వెంకటరత్నమయ-వీరబ్రహ్మసోమయాజులు.]

వీరబ్ర:—పాపము వెంకటరత్నంగారూ నామూలాన మీ ప్రయాణాని కడ్డమైనదిగదా. ఆయన ఆగొలుసు పుచ్చుకున్నాడండి. మరి

యెందుకుచేతనో గ్రహచారం యెరగనంటాడు.

వెంకట:—నేను యీవూరొచ్చి కొత్త. నేనొచ్చినప్పటినుండి వెచ్చం మాదగ్గిరే పుచ్చుకుంటుండారీ మాధవయ్యగారు. అయితే వీరబ్రహ్మంగారూ యీవూళ్లో యీనపల్కుబడి ఎట్లాంటిది.

వీరబ్ర:—అందుకేమిలోపం పరువు ప్రతిష్ఠ పలుకుబడి పరపతి ఆయనకన్న యెక్కువున్నా యా యీవూళ్లో యింకోరికి. యింటికాడ కూకొని కభురంపితే యెంతసొమ్మయినా వచ్చిపడద్ది. ఆయనకుండదల్లా కొంచము పయ్యాళే గాని మరోటిలేదు. అంత మాత్రమదిలేకపోతే ఆభోగికి అదికూడా ఓలోపమే అన్న

వెంకట:—నెమ్మదయ్యా. నీపుణ్యాం. ఆయన యిటువేపేవస్తున్నాడు.

[ప్రవేశము- మాధవుడు- పల్లవుడు కొంకణదేశజులు.]

వీరబ్ర:—అదుగో ఆయన మెడలోని గొల్సును చూచారా అదే నేనిప్పుడాయన కిచ్చినది. ఎంతఘోరంగా ఎరగనన్నాడో చూచారా. అయినా పల్కరించిచూస్తాను. మాధవయ్యగారూ ఏమీ యీవింత. ఎందుకొచ్చినట్టీ యాయాసం. మీకూ సిగ్గుబాటు మాకూసిగ్గుబాటు. యింత పోరబాటుంటుందా. సుఖంగా గొల్సు దగ్గిరపెట్టుకొని యెందుకు లేదనాలి ఎందుకాజవాబ్ పట్టుకోవాలి. మీకూనాకూవున్న స్నేహానికి ఎందుకు భేదం పుట్టాలి. యిదంతగావుండగా పాపమీ సాహుకారుగారి ప్రయాణం మీమూలాన భంగమయింది యిప్పుడయినా నా గొలుసు పుచ్చుకున్నారా? యెరగమంటారా.

మాధవ.కొం:—అగును.యీగొలుసు నీవేయిచ్చితివి.నేనెరుగననలేదే.

వెంకట:—ఇదేమిటండి. గొల్సుయెరుగనని పట్టుకూడా పెట్టుకొని.

మాధవ. కో:—ఎవ్వరా విన్నవారు-

వెంకట:—చాలుచాలు లేవయ్యా. పెద్దమనిషి. ఎవరో రావటమెందుకు యీభాగ్యానికి. చెవులార విన్నవాణ్ణి నేనేవుండగ నాయదట్నే యిట్లా అబద్ధాలు చెప్తే నీమర్యాదాయెంత నీమాటెంత నీఘరానాయెంత నిలబడితే తెలుస్తుంది నీపరువు నాపరువు.

మాధవ. కో:—ఛీ ఛీ. ఎవ్వఁడీమూర్ఖుఁడు- యేమి యీ యసంబద్ధము. నీవుగాదు మరినలుగురువచ్చినను నాయెదుట నిల్వలేరు. పొండుపొండు- మిత్రోవను మీరుపొండు.

వెంకట:—మనిషికొకటా రెండానాల్కలు.

(ప్రవేశము. కోకిల, శుకి, రామామణి, మఱికొందరు.)

కోకిల:-చం॥ నిలుఁడునిలుఁడు కొట్టకుఁడు నిల్పుఁడుపట్టుఁడు కట్టుఁడాతనిన్
చలనముగాంచెవానిమది చయ్యనచేతనుగత్తిలాగుఁడీ
బలమునఁబల్లవుల్ గదిసి బంధముసేయుడి పుణ్యమాయెడిన్
నలుగురుఁజేరి వారినిక నాదుగృహంబును జేర్పవేడెదన్॥

పల్లవు. కో:—లగెత్తండి. అయ్యగారూ లగెత్తండి. మానందక్కేటట్టు లేదు. అదుగో ఆమఠంలోజేరి తలుపేసుకొందాం.

(మాధవ పల్లవులు నిష్క్రమింతురు.)

కోకిల:-ఉ॥ పట్టినకట్టినన్నిలకపారిరి వీరినిఁబట్టుకెట్టులే
దిట్టలువీరిఁగొట్టుదురొ దేవుఁడు మాయెడఁగ్రూరుఁడింటిలో
గుట్టులురట్టులయ్యెఁ బలుకుల్ నడకల్ గడువింతలయ్యె నిం
కెట్టులఁబోదు వీరికయి యేగతినీతఁడుస్వస్థుఁడౌనొకో॥

(అందరు నిష్క్రమింతురు.)

(తృతీయరంగము]

యోగినిమఠము-ప్రవేశము- కోకిల, శుకి, వీరబ్రహ్మ సోమయాజులు, వెంకటరత్నం, పౌరులు.

యోగిని—నాయనా ఏమియీయడావడి? ఏగోల నెఱుంగక యొకమూలఁజేరి కృష్ణా రామా యనుకొనెడి మముబోంట్ల సమాధినిష్ఠకు భంగంబొనర్చుట మీకుఁదగవా? బాబులారా శాంతింపుఁడు శాంతింపుఁడు.

కోకి—గీ॥ అమ్మయేమని చెప్పుదు నమ్మనీకు
మన్మనోహరుఁడిప్పుడు న్మాదమొంది
చేరెనియ్యెడవానికై చేరితిమిటఁ
బండెమానోములిటుల దౌర్భగ్యమబ్బె॥

వీరబ్ర—ఔనమ్మా ఆయన మనలోకంలోనే లేడు.

వెంకట—ఇంతగోల నాకెందెల్చు ఏమోగదాఅని ఆయనమీద కసురకున్నానుకూడా పాపం

యోగిని—ఎన్నాళ్లయినది ఆయనకీగతిపట్టి.

కోకి—ఉ॥ అమ్మక చెల్లనేటికితడైదు దినంబులనుండివింతచం
దమ్ములనుండెఁ దేటకనుదమ్ములువాడెఁ గృశించిమేనియం
దమ్ముదొఱంగెమాటలవిధమ్మది మారెను నేటికిట్టులీ
యుమ్మలికంబునాకొదవ నుమ్మదమిట్టులబుట్టెనమ్మరో॥

యోగిని—

సీ॥ సంద్రమందునవీని సరకులపడవలు
మునిగిపోయినవొక్కొ- వనజగంధి
ఆత్మసముండైన యాప్తుఁడెవ్వండేని

స్మృతిఁజెందినాఁడొక్కొ యిందువదన
కూడఁగూడదనినాతి కోరిగుండొందుచు
నీపాటువడియెనో నీరజాక్షి
మాటిలోనేదేని మూఁడకయీగతి
మూఁడునాయీగతి పూవుఁబోఁడి

కోకిల—గీ॥ మూఁడదేదియువీనికి మూఁడవదియె
గూడెవీనినివెలయాండ్ర గూడసితసు
నింటికడనుండిలాగుచు నెల్లవేళ
లందుగూర్చెను తుదకిట్టి కుందునాకు

యోగిని—అమ్మాయీ! నీవందులకాతని మందలించకుంటివా?

కోకి—నాకుఁదోఁచినవఱకుఁ జెప్పియుంటిని.

యోగిని—అంటిముట్టకుండ నెంటిపాటునఁ జెప్పితి వేమొ

కోకి—

సీ॥ రేయిసెజ్జకుఁజేర రాయిడివెట్టితి
దానఁ నాతఁడునిద్ర మానవలసె
భోజనసమయానఁ బోరువెట్టఁగ నేను
కడుపారనన్నంబు గుడువఁడయ్యె
నెంటిపాటుననున్న నులికుట్టుమాటల
నులికించఁగా నేను కలఁకఁజెందె
బదిమందిలోనున్న భావగర్భితములౌ
బాసలాడఁగదాన నీసుఁజెందె
గీ॥ నిటులనాతఁడు వెలనాతి సటలఁదవుల
కుందునట్టులనపుడప్పు డోర్పుతోడఁ

జెప్పివిసికితినానోటి చేటుకొలది
వీసమయిననుతిరుగదా వెఱ్ఱిమనసు

యోగిని—ఇందుచేత నేయతనికి మతిభ్రమణమేర్పడినది. నల్లి ప్రక్క మీఁద రాత్రిమాత్రమే కుట్టును. భార్యయన్ననో చీమవలె రేయుంబవళ్లెయ్యెడనున్నను గుట్టిపిడుచును.

గీ॥ ఈసుఁజూపెడి బాసలనింతిగ్రక్క
విసముదలపోయగా నదిబిచ్చికుక్క
విషముకన్ననుమిన్నయై వేయిరెట్లు
మతులుచెఱుపును చిటికలో మానవులకు

చ॥ పదుగురుచూచుచుండఁగను బాసలు సేసితినంటిరాత్రులన్
నిదురనుబాపితంటివిక నెయ్యముఁజూపకయొంటినుండఁగా
ముదమునుబాపితాతనికి ముద్దులగుమ్మరొనీదుచేతలన్
మదిచెడెఁజువ్వెయాతనికి మానిని వానివిగావుదోసముల్॥

చ॥ కడిరుచియింపకుండు పడకన్ గనుకుండగఁబోవదేయెడన్
దలఁపులఁదాల్మిచేకురదు తద్దయుబుద్ధులుత్రోవదప్పునిం
పడరదుమానసంబునకు నంబురుహాస్యనయంబుమీరియి
ట్లుడుగకపోరువెట్టునెడ నున్మదమబ్బకయున్నె భర్తకున్॥

శుకి—చాలుచాలు నీసరసాల్కు. సోదరీ! యీయత్తపోరు నీకేడ బ్రాప్తించె?

ఉ॥ దోసములన్ని నీపయిన ద్రోయుచునున్న బదుల్వచింపకుం
కేసరసమ్మదత్తవలె తేమియునాతనిపైనమోపకే
యూసులువల్కుచుండెనిఁక నోర్పువహింపక నీవుమాధవున్
వేసడనమ్ముఁజేర్పగదవే యికతాళినగింకపుట్టెడున్॥

కోకి—అయ్యలారా! ఇంక తాళనేల లోనికిఁబోయి నానాథుని బట్టి తెండు.

యోగిని—నాయనుమతి లేక నాయింటఁజొరఁబడు వాఁడెవ్వఁడు ?

కోకి—యీసుద్దుల కేమి ఇంకదక్కిన నిక్కట్టువడుదుము.

ఉ॥ ఈగతియిట్టులైననిక నింటికిఁబోయిమనమ్ముఁద్రిప్పఁగా
నాగతితియ్యనౌనుడుల నాడుచుపథ్యముఁజూచుకొంచువే
వేగమెవైద్యునింబిలిచి వెట్టులు మొట్టులుమాన్పకుండఁగా
నీగ్రహచారమేలహృద యేశయి కేమియొనర్చుదానవో॥

యోగిని—సుందరీ!

ఉ॥ వేయినుడుంగులేలయిట విన్ముమదీయతపోబలంబుచే
హాయియొనర్తునీపతికి నమ్మ! దిగుల్విడుమమ్మమంత్రముల్
గాయలుమూలికల్క్రియలు కట్టులుగట్టిదొసంగుబాపగో
సాయిలకైనసువ్రతము చానరొ వాదులివేలపొమ్మిఁకన్ ॥

కోకి—మీవంటి యోగినుల కాలిమగల నెడబాపుటధర్మముగాదు సుమా.

యోగిని—మాటలునోటిచేటగుసుమా! మీరిచట నల్లరిసేయుట నేను సహింపను

శుకి—సోదరీ! యీకుమ్మమనకేలా. వెంటనేపోయి రాజునకెరింగింతమురమ్ము. (శుకి కోకిల నిష్క్రమింతురు.)

వేంక—(గంటలువిని) అయిదయినట్లుండదే-ఏమున్నది. ఒప్పూరుకాపాపూరుమాల. పాపము ఆషాహుకారు అయనవూళ్లో ఎంతవర్తకుడో, ఎంతపరపలిగలవాడో నేడిట్లాకావల్సిందని దైవలిఖతముంటే మామావారికే తప్పలేదీరికి తప్పుద్దీ?

వీరభ—యేమిటది- యెక్కడిమాట?

వేంక—వినలేదండి. ఆకొంకణదేశంకోమటి నిప్పుడురిదీస్తారు. రాజుగారు బయలుదేర్తుంటారీపాటికి. మనంగూడా అక్కడికేపోదాం.

(అందరునిష్క్రమింతురు.) (తెరలో.)

ఉ॥ ఎంతకులేరుచానలిల నేమియెఱుంగనినన్ను నేడుకా
సంతయుగొంకకన్యసతు లందుమరుల్గొనినాడనంచుఁదా
సంతతఁజాలునాకుమద మంచుజనుల్వినఁబల్కెహాగృహా
భ్యంతరమందుఁద్రాటనను బంధనసేసెజగమ్ముచూడఁగన్ ॥

పంచమాంకము:

(చతుర్థరంగము)

రాజభవనప్రాంగణము ప్రవేశము: నిరంకుశుఁడు, తలారులు, రక్షకభటులు, మఱికొందరు పౌరులు.

నిరం—సమయసూచక ఘంటారావమల్లదె వినంబడుచున్నది. సేవకా! ఆకోమటిని సిద్ధముచేసితీసికొనిరమ్ము. నేఁడీతని నురిఁదీయుదురని నగరమ్మునఁ జాటఁబంపిరా ?

సేవ—చిత్తముమహాప్రభో! (అని నిష్క్రమించును).

నిరం—చ॥ తనయులఁజాయఁబాసిమది దాపముఁబాపగనోపక క్రియన్
గునియుచునున్న వానితల గోయుటకన్న సహింపరామినా
మనమునఁదోచ దేదియును మన్ననవీని క్షమింతుమన్న నా
వెనుకటివర్తనంబునకు వీట్రిప్రజల్ననువీటఁజాటరే॥

ప్ర. వర్ధమానుఁడు, వెంటరాజభటుఁడు.

వర్ధ—ఉ॥ శౌరిసపర్యకైనవిరి జాజులు సౌదలఁదాల్చునాకు నేఁ
డీరిపుసీమలోఁజివర కిట్లుస్మశానపుఁదంగెడుల్ వేసెన్

జేరెను నామమస్తమునఁ జేరెను దుర్గతి చేరెనంతముల్
నేరక నేరినాఁడనిట నెయ్యుగు నాకిక నేరుదిక్కెకో॥

శా॥ ఆహా సుందరి! నన్ను బాసి మదిలో నత్యంతముల్ గుందుచున్
దేహం బేమరి యేడ నుంటివో కో యేనీచుల్ నిన్నుఁ దాఁకిరో
దేహుల్ దీనులు కర్మబద్ధులుగదే దేవుండు మాధుండు సం
దేహం బేల మదీయదుష్కృతమె బందిన్ జేసె నన్నియ్యెడన్॥

గీ॥ ఉన్నయూరిలో నమరిఁ బడ్డమిత్రులు
మొగముఁ బెడగఁద్రిప్పి బోవుచుందు
రూరుగాని యూర నురిఁ బడ్డవానికి
జీరి పైకమిచ్చు వారలుండ్రె॥

సీ॥ ప్రాణంబునకుఁ దానుప్రాణమైననుఁ గొల్చు
భార్యకై యిపుడు నే వగతునో కో
మున్నీటిలోఁ బడి పోయిన బాలకు
లిద్దఱికొఱకు శోకింతునో కో
మొన్న మొన్నటిదాఁకఁ గన్నాకులై వీడి
యేగిన సుతులకై యేడ్తునో కో
అరిసీమలో నిశితాసిధారకు నివు
డంత మొందఁగ విలపింతునో కో

గీ॥ ఎన్నిటికటంచు నే నిప్పు డేడ్చువాడ
నేఁడుఁ బుట్టితిఁ బెరిగితి నేఁడు బ్రతికి
తేఁడఁ జచ్చుచునుంటిని యింతఁ దలఁప
కానఁగా లేము షణిములోఁ గలుగు ఫలము॥

(చాటవెంట బోవుచున్న వర్ధమానునిఁ జూచుటకై పౌరులు గుంపులు

గుంపులుగా వచ్చుచుందురు.)

తలా—ఏంచూస్తారు బాబూ! ఆయనకిట్టా రాసి పెట్టి ఉండది. మనం యేమేడిస్తే యేముండది. శివుడాగ్గలేంది శీమయినా కుట్టదు. సదురుకోండి బాబు సదురుకోండి.

రాము—(వెనుకటి ప్రకారమే తిరిగి చాటును).

వర్ధ—గీ॥ ముక్తికాంతను బెండ్లాఁడ బోవుచుంటి
ముందు తప్పెట్లమ్రోతలు మొరయుచుండ
రక్తచందన లేపంబు రవ్వపిండి
తాటిపూవులతోడను కలితుఁడనయి॥

వెంక.—చూచినారా వీరబ్రహ్మంగారూ! నాకుఁ గళ్లవెంట నీళ్లు తిరుగుచున్నవి. నేనింకఁ జూడలేను. మంచివాళ్ల మరణం చూడరాదని పెద్దలు చెప్పుతారు.

నిర్ధం—ఇంక నెవ్వరు వీనికి సహాయము సేయువారు లేరుగదా! మరియొక్కమారు చాటుఁడు.

(జాంఘికుఁడు యథాప్రకారము చాటును).

ప్రవేశము కోకిల శుకి.

కోకి—గీ॥ వినుము నామొర పృథివీశ వీను లొగ్గి
యబలనైనట్టి నాకొఁగి న్యాయమిమ్ము
రహిని విన లేదె న్యాయంబు రాజు సూవె
బలము లేనట్టివారికి బలమనంగ॥

నిరం—(ఆశ్చర్యమానసుండై) సుందరీ! నీకెవ్వరే మెగ్గు చేసిరి

కోకి—యోగిని.

నిరం—యోగినియా? ఆమె కడుసాధ్వి. పుణ్యచరిత్ర. యొకరికెగ్గు నొన

ర్చునదికాదే

కోకి—పృథివీశ్వర! ఏమనివిన్నవింతు నామగండామాధవుండే గాముల చేటునో నేడున్మదావస్థనొంది కొందఱియెడ నుంగరంబులుఁ గొందఱివద్ద పైడిగొలుసులు పైఁబడిలాగికొని వీధివెంటఁబడి పట్టుకొనవచ్చిన పెద్దమనుష్యులఁదిట్టుచుఁ గొట్టవచ్చుచు మమ్ము దిరించి బెదిరించి లేచిపోయి యాపాడుయోగినిమఠములోఁబడి తల్పుమూసికొనియె. వీధిలో నీతఁడెవ్వరినేమిచేయునో యెవ్వరీతని కేమిచేయుదురో యీయవస్థలో నింటఁగట్టిపెట్టినఁ బాగుండునని యెంచి సౌకరులతో నేనచ్చటికిఁబోవగా నాయోగిని మహాత్మనందరి జేరనీయక మమ్ము బయటికి వెడలనడచి తలుపు బిగించుకొనియెను. రాజా! ఆయోగినిచెరవిడిపించి నాకు పతిభిక్షసేయుదుమని వాగ్దానముసేయునందాక నేనుమీపాదారవిందముల వీడనోప. (అని యాతనిపాదములపైఁ బ్రాలును]

నిరం—సాధ్వీ!

ఉ॥ పోరులఁ గెల్చితన్నెదిరి పోరెడివీరుఁడు లేడటంచుఁబల్
పేరునుగొన్నవాఁడుకడు వీరుఁడుదారుఁడునీమగండు ఘో
రారివిభీషణుండుమము నన్నిటఁగొల్చిన సేవకుండుకొ
మ్మారవికల్పుఁడాతఁడు సుమాబిలిపింతును లెమ్ముకోమలీ॥

సేవకా! వేగిరముపోయి యాయోగినిందోడ్కొని రమ్ము. ఆపెవచ్చునందాక మేమిక్కడనే యుండుదుము.

[ప్ర. వేంకటస్వామి.]

వెంకట—(జనాంతికముగా) అమ్మగారూ! అమ్మగారూ! పామె కొంప. పాయె. ఇంకేముండదమ్మా అయ్యగారు కట్లిడుపించుకొన్ని

యింట్లోవుండ నౌకర్లందరిని చావమోది యీదులోకనపడ్డ ఊళ్లక్కయ్యగారిని జుట్టట్టుకలాగి గెడ్డంపట్టుకొనిపీకి నిష్ఠల్లంటించి సున్నంలోకెముకలేకుండాగుద్ది వీధినపడ్డారు. ఓరినాన్నా పంపకుంటే సెడుద్దిరంగం పరువుదక్కదు.

కోకి—ఛీ! మూర్ఖుఁడా! నీకుఁగూడఁ బిచ్చిపట్టినదా యేమి! మీయయ్యగారింటికడలేరు. యోగినిమఠములోనున్నారు. చాలుచాలూరకొనుము.

వెంకట—ఆయన్ని జూసి నే లగెత్తికొచ్చినా. మీరుగినగనపడితే- నానోట్రనాదు. ముప్పొసద్దీ.

(తెరలో)

సీ॥ సంద్రదంపుఁదరగఁల చాయఁజాపల్యంబు
సాంధ్యరాగముఁబోలు క్షణికరక్తి
బుద్బుదంబులఁ బోలుబుద్ధులనిలుకడ
మేడిపండులఁబోలు పోడుములును
విద్యుల్లతలఁబోలు నుద్యమంబులతీరు
సెలయేటినడతీరు వెలయుపోక
మత్తకరేణువు మాడ్కిమాంద్యంబును
కుండలీంద్రునిబోలు కుటిలవృత్తి
చన్నులనుబోలుచిత్తంబు కన్నుగవను
బోలుస్థైర్యంబునడుమును బోలుకూర్మి
వెలయువెలఁదులకేయెడ తెలియలేక
మోసపోదురుమగవారు బోంట్లనమ్మి॥
(అని చదువుచు మాధవుఁడు ప్రవేశించును).

కోకి—ఆహా! నానాథుఁడే నిజముగానాథుడేనా? లేక నాకన్ను చె
దరెనా! ఇప్పుడేకదా యోగినియింటఁబెట్టి తలుపుమూసినది.
హా! యీశ్వరా! యేమియీమాయ

మాధవ-పా—

కం॥ నెత్తురునోడ్చితినీకయి
కత్తులఁబలుపోట్లుదింటిఁగావఁగనిన్నున్
మొత్తితిమత్తులశత్రుల
బిత్తరిచేఁజిక్కిపోతి పృథివీశ!యిటన్॥

చం॥ నరవరనీవునాపయిమనంబున నిచ్చినయీపొలంతినన్
బరువుప్రతిష్ఠఁబాపి కడుబాధలఁబెట్టెనువీథిలోన నే
డు రహిజనుల్వినంగను గడుంగ దుకారులు ప్రేలె శంక లే
క రవరవల్సృజించెను ముఖంబునఁదిట్టెను నాయమీయవే.
(అనిపాదముల పైఁబ్రాలును)

వర్ధ—

ఉ॥ కల్లయొనిక్కమో యెదుటఁగన్పడుచుండిరి మాధవుండునున్
బల్లవుడున్యథాకృతిన నాసుకృతంపుఫలంబులోయన న్
బెల్లుగనేడ్వనేలయిక వీరునన్విడిపింపకుండురే
యెల్లసుఖంబుదుఃఖములునీశునియానలఁగాదె చేకురున్॥

మాధవ-పా—

ఉ॥ లంజలఁదార్పుకాండ్రవిటులన్ బలువిందులఁదన్నిధర్మమె
ల్లంజెడిపోవవీడికనులం బొగరుం బొరఁగప్పనాదు పి
ల్పుంజెవిఁబెట్టకేతలుపుమూసెను వీధిననన్నుఁబెట్టి యీ
లంజియనేడుకొంపసిటులన్ జెడఁగొట్టెనుమాన వేశ్వరా॥

నిరంకుశుఁడు— (ఆశ్చర్యముతో)

ఉ॥ ఎంతటితప్పుచేసితివియింతి! నిజంబయబద్ధమా?

కోకిల॥ కటా
సుంతయు నేనెఱుంగనిడిచోద్యము సోదరినేనునాతడున్
సంతసమొప్పభోజనము సల్పితిమింటనే

శుక॥ రాజవర్యర
వ్వంతయుశంకలేదు నిజమాడెనునీపదమానయన్నిటన్
[పవేశమువీరబ్రహ్మ సోమయాజులు]

వీర—ఈయనకు వెఱ్ఱిపట్టినది నిజమేకాని యిందులో మాత్రమీయ
న చెప్పినది నిజమే-

మాధవ. పా—

చం॥ పొడమదుపిచ్చికోపమును బొక్కదునాకిటమద్యమానుటన్
బొడమినవాక్కుగాదు నిజమున్వచియింతునునాకు నేడువా
కిలిబిగియించెనీపె మదికిన్ వెగటెంతొయొదోఁచియప్పుడే
గడపనువీడి పోయితిని కాంతలు వంతలముంత లేకదా॥

ఉ॥ ఈకమసాలియున్నిజమువిప్పుడు జెప్పిన "నీవుగొల్లునున్
జేకొని కేళిమందిరముఁజేరు" మటంచును జెప్పిపుచ్చినే
నాకడకేగియుంటనిజమ్మానని చెప్పను వీనికైయటన్
నేకడువేచిరామినితనిన్ గనసాగితివీథిలోనికిన్॥

చం॥ కనుపడివీథిలోన "పయికంబిడుమిప్పుడగాదెనీవుగొ
ల్లునుగయికొంటిచూడుమిదె సొమ్మునునిమ్మని వైశ్యుడొక్కడా
పెనుననునిట్లటం" చునను వేసెను "గొల్లును నేనెఱుంగనా
కొనరఁగదాని నిచ్చునపుడొప్పుగ నిచ్చెద" నంటిభూవరా॥

మహాప్రభో. వీని కెంత స్సాహసమో! నేనెన్నండు ముక్కు మొగమెఱుంగని గొలుసును దీసికొంటినని వీఁడు నాపైఁ జరపిన యఘాయిత్త్యంబుల నుడువఁదరమా!!

సీ॥ చెప్పినవినకనన్ జేపట్టిలాగించి
బందిచేయించె జవానుచేత
రాజశాసనము తిరస్కరించఁగలేక
వశుడనై యింటికి పయికముకయి
పల్లవుంబంపితిఁ బదపడినాభార్య
పైకమియ్యకవానిఁ బంపివైచి
పోదరిగూడితా సొట్టబుగ్గలవాని
నెజ్జనికంటితో మిఱ్ఱువాని
గీ॥ నొసటఁగుంకుమవాని మానసములేని
వానిఁజూడ్కికి ప్రేగగువానివాని
నాహుళక్కినిఁబిలిపింప నతఁడువచ్చి
చూచితలయూఁచినిజవిద్య జూపెనచట॥

అప్పుడు సొమ్ముకొఱకు నే నింటికేగితిని. తోడనే యాహుళక్కి.

ఉ॥ ప్రేలెడివెఱ్ఱియీతఁడని రెక్కలు వెన్కకులాగి కట్టినన్
గూలిచి మొత్తి మీఁద బడికుయ్యడదయ్యమటంచు వాగియే
గోలనెఱుంగనట్టిననుఁ గొట్టునఁగట్టిరిగట్టిఁ ద్రెంచుమీ
పాలికివచ్చినాఁడను గృపారసమున్ బయిఁజల్లవేడెదన్॥

వీర—ఆయనింటికాడ భోజనం చేసినమాట అబద్ధమే కాని ఆయన్ను కట్టేసినమాట మాత్రం నిజం

నిరంకు—కాని యాబంగారుగొలుసున తండెఱుంగునా లేదా?

వీర—స్వామిసాక్షి ప్రభువులముంద రబద్ధమ్మాడ్తానయ్యా? ఇందాక మెళ్లోవేసుకోగా వీఱందరు చూచారయ్యా.

వెంకటరత్నం:—

ఏమయ్యా మాదవయ్యగారూ! ఇక్కడికి మేమంతా అబద్ధమాడేటట్టా మీరొక్కరూ నిజమాడేటట్టానా. ఇప్పుడే కాదండీ గొలుసు నీయనదగ్గరపుచ్చుకున్నానని వొప్పుకొన్నారు. ఇంతలోనే యింత అబద్ధమా. అప్పుడు మనకూ మనకూ మాట పట్టింపుకూడా వచ్చినది. అప్పుడు వాదందరూ వెంటపడితే యోగిని మఠంలోకెళ్లి తలుపుకూడా మూసుకొన్నారు.

మాధవ. పా—

యోగిని నెఱుంగను గీగిని నెఱుంగను. దేవా యీతఁడాడు మాటలు విశ్వసింపఁ దగినవి కావు.

నిరంకు—అయ్యారే! ఏమిచోద్యము. ఇంటంగట్టిపెట్టఁ గట్టుఁ ద్రెంచికొని యెకాయెకినా కడకు వచ్చితినని మాధవుండును, యోగినిమఠముఁలోఁ జొరఁబడి తల్పుమూసికొనియెనని కోకిలయును గొలుసునిచ్చితినని కంసాలియు నీయగాఁ జూచితినని కోమటియును అందఱన్ని విధములుగాఁ జెప్పఁదొడంగిరి. ఏమిది. యపహాస్యమా నిజము చెప్పుదురా లేదా?

పల్లవ. పా—మాఅయ్యగారింటికాడ భోంచెయ్యలేదయ్యా. ఆభోగమమ్మారి యింటికాడే ఫలారంపుచ్చుకున్నారు.

రామా—నిజమేనయ్యా! ఆయన చేతి యుంగరముకూడ నాదే

మాధవ. పా—దేవా! నేనీ పెయుంగరమును దీసికొన్నమాట సత్యమే

నిరంకుశుఁడు—(రామామణితో)

నీవీతఁడు యోగియై మఠములోనికిఁ బోవుచుండఁగాఁ జూచితివా?

రామా.—చూచితినయ్యా! నాబిడ్డతోడు

నిరంకు—ఏమియీవింత, ఎవ్వఁడురాయక్కడ! వెంటనేపోయి యా యోగిని నిటకుఁదోడ్కొనిరండు. ఈమాధవుని కేగాక మీ యందఱకొక్క పరిఁబిచ్చిపట్టి నట్లున్నది.

వర్ధమాను—దేవా! నాకొక్కమాటకు శెలవిండు.

మ॥ తలగాపాడెడునెయ్యుని య్యెడకునాదైవంబుదాఁబంపెనా
కిలవర్ధిల్లెడియోగమింక గలదంచేనెంచెదన్ భూవరా

నిరంకుశు—

పలుకన్ వచ్చుభయంబుదక్కినికగాపాడంగరాఁగానెకం
డిలవద్దంచనువారలుంద్రె చెపుమాయిప్పట్టునన్ గోమటీ॥

వర్ధమా—నాయనా నీవుమాధవుండవుగావా. అబ్బీ. నీవీతని సేవకుండవ్వగు పల్లవుండవుగావా?

(మాధవ పల్లవులు తేరిచూచుట)

పల్లవు!—ఇదేమిగోలో! ఔనునేనుపల్లవుడనే.

వర్ధమా!—బాబులారా!

చం॥ ఎఱుఁగనివానిబోలెనను నెట్లనుచూచెదరేల మీరు

పల్లవ.పా—ని
న్నెఱుగుదుమయ్యకాటికడ యేటుకునీతలతీయ వీరుబల్
కఱకునగెంటు చంద్రిడినిను

వర్ధమాన— కాలముమాఱెగ బోలుమాధవా
మఱచితెనన్ను నీతరిని మాంద్యముబుట్టెనొనీకు నక్కటా

మాధవ.పా— నేనుపుట్టినపిదప నీముఖంబుచూచిన గురుతేలేదు

వర్ధమానుఁడు—

చం॥ ననువిడనాడియేగితిరినాటికి నేటికినొక్కతీరుగా
మనమునగుందుచుండుటను మారగఁబోలునుమేనునాకునా
స్వనమునుగుర్తెఱుంగరొకో పల్లవనీవిపుడైన నన్నుగన్
గొనగనునేరవొక్కొ తలకుంజెడిపోయితి నేటికక్కటా॥

అక్కటా! శోకమా నాయాప్తులకుఁగూడ నాకంఠస్వరము గురుతులేకుండ మార్చివేసితివా? నాముద్దులపట్టి నా ముద్దెపెంపుమూట నాతపములపంట నాకల్పతరువు నామాధవుండు నన్నానవాలుపట్టకుండఁ జేసితివా? ఈశ్వరా ఏమీనీచెయిదములు నాయనా నీవు నాముద్దులకొమరుండవగు మాధవుండవుకావా

మాధవ. పా—నాతండ్రినే నెఱుంగను.

వర్ధమాన—తనయా! యేమి యీగ్రహచారము. మొన్న నయిదేండ్లక్రిందటగదా తల్లిని యన్నను వెదకుదమని కొంకణదేశము నుండి బయలుదేరితిరి. ఇంతలోనేయింతమఱపా లేక యిట్టిదుర్గతినున్న నన్నునీతండ్రిని గాగ్రహింపనొల్లవా? హితులుబంధుగులుచెలిమికాండ్రెందఱైన ధనమునకైమూగుచుఁ గాలవిపర్యయంబునఁ బెడమొగముపెట్టుదురని యెఱుంగుదును గాని సుతుఁడుగూడ దుర్గతినున్నజనకునివిడనాడునని, నేటికెఱింగితిని.

మాధవ. పా. —

అయ్యా! నీవెవ్వరోనేనెఱుఁగను. నేనెవ్వరనుకొని భ్రమపడుచుంటివో. చిన్ననాటనుండి నన్నిరాజవర్యుఁడె ఱుంగు. నేజన్మించినపిదపకొంకణదేశమునుజూడనేలేదు.

నిరంకు —

కోమటీ! యిరువదియేండ్లనుండి యీమాధవుడు మాపకవర్గ

ములోనివాఁడు. ఈనకుమనీతఁడెన్నఁడును గొంకణదేశమునె
ఱుంగఁడు. నీవార్ధక్యము నీవిపద్దశయునిన్ను బారపెట్టియుండు
నుగాని, వేరొండుగాదు.

ప్ర. యోగిని. మాధవుడు. కొం, పల్లవుఁడు, కొం.

యోగిని—
రాజవర్యా! భార్యచేనవమానింపఁబడిన వీనినిజూఁడుఁడు.

కోకిల
ఏమిది! నిల్వుటద్దములిచట లేవే. ఇద్దఱుమాధవులిద్దఱుపల్లవు
లుగానబడుచుండిరేమియీవింత.

మాధవా. కొం—
ఉ॥ నాయననాకుగన్నడెను నామదిమారెనునిన్ను వర్ధమా
నాయనియంద్రుగాదె కట నాయముతప్పిన నేరమేమినీ
పీయెడఁజేసియుందువు మహీపతినీతలఁజీయబంధముల్
దీయుదునెవ్వరడ్డపడఁ దీయుదునాయువునింతమాత్రలోఁ

యోగిని— (వర్ధమానునిపాదంబులపైఁబడి)
హా! నాథా! హా! మనోహరా! హావర్ధమానా, ఈశారదనుమ
ఱచితిరా! ఆహా! యేమినాభాగ్యము! ఎన్నాళ్లకునాకన్నులుగ
లిగినఫలమునుగాంచితిని. అయ్యో! మాటాడరేమి. మీయ
నుంగుభార్యనీశారదను గురుతింపనేలేదా.

వర్ధమా— (శారదను కౌగలించుకొని)
అక్కటా! శారదా! నిజముగాశారదవే? లేక నాభ్రాంతివా
నీవేశారదవైన నీతోఁజాపకొయ్యపైఁ గొట్టుకొనిపోయిన ము
ద్దుకుఱ్ఱలేమైరో చెప్పఁగలవా.

యోగిని—
పాండ్యదేశపుఁ బడవవాండ్రునన్ను నాబిడ్డల వేరుచేసి నన్ను రేవు
లోదింపి బిడ్డలనెటకోగొంపోయిరి. నాథా! నాటినుండి యే
కాకినై కాకిపోలెదిరుగుచు, నుదరపోషణంబు చేసికొనుచు
చిత్తంబుభవదీయ పాదారవిందాయత్తంబు గావింపుచుకాలం
బుగడపుచుంటి. ఆశిశువులవృత్తాంతంబునాకావంతయైనఁ దెలి
యదు. మదీయ చిరకృతపుణ్యపరిపాకవిశేషమున నీగడియకు
మిమ్ముఁబొడఁగంటి.

నిరంకు—
ఉదయమున సెట్టిచెప్పినమాటలిప్పుడుసరిపోవుచున్నవి. ఈమా
ధవు లిద్దఱొక్క పోలిక. ఆపల్లవు లిద్దఱొక్క పోలిక. ఆవృ
ద్ధదంపతులు వీరితలిదండ్రులు. ఆహా! దైవసంకల్పము వీరల
నెట్టులగూర్చె. మాధవా! నీవీపాండ్యదేశపు రేవుపట్టణమగు
కోరకినుండి మొట్టమొదట వచ్చితివి.

మాధవ.కొం—కాదు కాదు. దేవా! నేనుకొంకణదేశమునుండివచ్చితిని

నిరంకు—విడివిడిగా నిలువుఁడు. లేకున్న నెవ్వఁడెవ్వఁడో తెలియుట
కష్టము.

మాధవ. పా—రాజవర్యా! నేను కోరకినుండి వచ్చినమాట సత్యమే

పల్లవ. పా—చిత్తముమాప్రభో! నేను మాఅయ్యగారూ ఓపారేవ
చ్చినాము.

మాధవ. పా—తమ సేనాధిపతి మమ్ము దేవరకప్పనము చేసెను.

కోకిల—మీయిద్దఱిలో మాయింటికడ భోజనముచేసిన దెవరు.

మాధవ. కొం—నేను మీయింటభోజనము చేసితిని.

కోకిల—[లజ్జ నభినయించుచు]
సోదరీ! యిందు మీ బావ గారెవరు?

శుక— అదే నాకున్ను దెలియకున్నది.

కోకిల— [ఇద్దఱుమాధవుల వంకఁజూచి]

నాథా! ఇంటికేఁడగడుపార గుడిచి నన్నిట్టులాడుట న్యాయమా!

మాధవ. పా— నీనాథుడతఁడు కాడని గట్టిగా చెప్పఁగలను.

మాధవ. కొం— నేనును కాననియే చెప్పినవినక యీయాపె నన్నల్లే బిలుచు చుండెను. ఈమె సోదరి యీసుందరాంగియు (అని శుకవాణిమోముకయి చూచి యూరకుండును)

వీరబ్ర— నేను తమచేతికిచ్చిన గొలుసు ఇదేకాదయ్యా?

మాధవ. కొం— అదియే నేను కాదన లేదే.

మాధవ. పా— నీవీగొలుసుకై నన్ను ఖయిదు చేయించినావుకావు?

వీరబ్ర— (దీనతతో)

అవునయ్యా నేనెట్టా లేదన్నా.

కోకిల— నేను పల్లవునిచేత బంపిన పైకమందనే లేదా?

పల్లవ. పా— నాచేతికి పైకమిచ్చారా అమ్మగారూ బాగా జ్ఞాపకం చేసుకోండి

మాధవ. కొం— మాపల్లవునిచేత నంపిన పైకము నాకందినది. ఓహో ఇదియా వింత. నన్నతనిఁగా నాతని నన్నుఁగా భావించుటయింతటి భ్రాంతికి యింత యల్లరికి కారణమైనది. ఇదిగో పైకము పుచ్చుకొనుఁడు [అని పాండ్యమాధవుని కందించును]

మాధవ. పా—

చం॥ ఎఱుగక యాడినట్టినుడు లెల్ల క్షమింపఁగదయ్య తండ్రిని
న్నెఱుఁగఁగఁగంటి నేటికిటులిచ్చట తండ్రి నీఁదల్లిఁదమ్ము నిర్
సరవిఁగనుంగొనంగలిగె శాంతముబూనెను చిత్తమద్దిరా
తెఱచినక్షోభమందొదవదా యమృతంబు మహాబ్ధిలోపలన్॥

(మాధవుడు తండ్రికి నమస్కరించి రాజువైపునకుఁ దిరిగి)

మాతండ్రి విడుదలకయి యీపైకమును దేవరవారికి సమర్పించెదను.

నిరంకుశుఁడు— మాధవా! ఈపైకముతో పనిలేదు. నీతండ్రిని నీవు గాంచినందులకు సంతసించితిని. దేవుండు మిమ్ముంగూర్చె. మీరందఱు సుఖముగాఁగూడి మనుటయే నాయభిమతము.

రామా— (మాధవునితో) నాయుంగరముదయచేయించిన నేఁబోయెద.

మాధవ. పా— ఇదుగో పుచ్చుకొనుము.

వర్ధమాన— భూవరా!

ఉ॥ ముక్కలుచెక్కలై నడిసముద్రమునందున నోడమున్గ మే
మొక్కెడలేక వేరుపడియుంటిమి మంటిమి యాశు నానసీ
విక్కడఁజేరఁబోవుటయు నియ్యెడ నన్విధి జేర్చియుంటవీ
కిక్కడి కేఁగుదెంచుటయు నిట్టులఁగూడిక పుట్టె భూవరా॥

నిరంకుశుఁడు— వర్ధమానా! నాయదయత్వంబు సహించి నన్ను విగతశోకునిఁ జేయవేడెద. సాధుబాధ నామనమును పరితపింపఁజేయుచున్నది. నీమనశ్శాంతికై యేమి కోరిన నొసంగెద నడుగుము.

వర్ధమానుఁడు— ఆవులావులుపోరాడి లేగలకాళ్లు ద్రొక్కినన్నరీతి మీరు మీరు కొంకణపాండ్య దేశములరాజులు పోరాడి దారితప్పి వీరివారి పట్టణంబుల జేరిన నిరపరాధుల తలదీయుట భావ్యంబుకాదు. కాన నీచట్టమును దొలగించినా మనశ్శాంతిని జేయఁగోరుచున్నాఁడ.

నిరంకుశుఁడు— నీమనస్సంతోషముకై య్యేమిచేయుమన్నను చేసెదను. నేఁడు మొదలీశాసనము రద్దుచేయఁబడును. మీరు మాకుఁ బ్రజలకు నందఱకు శుభం బొదవె. మీరునాకు విందలై

యుండఁగోరెదే. ఇత్తావు వీడి నగరుకుం బోవుదమురంఁటు.

పల్లవ. పా— ఓరన్నా! నీవు పెద్దోడవు నీవు ముందు నడవరా

పల్లవ. కొం— నువ్వే పెద్దోడివి. నీకుపెళ్ళి పేరంటం కథాకమా మీాసు నువ్వు ముందునడు. చావిట్లో మాఅయ్యగారి సరకులున్నవి. తీసుకొని దివాణాని కెల్దాము పా.

(అందఱు నిష్క్రమింతురు)

(పంచమ రంగము.)

(ప్రవేశము రాజసేవకుడు)

రాజసేవకుఁడు--గీ॥ బ్రతికియుండిన బలుసాకుగతికిమైన
శుభముఁజూడంగనగు నను సూక్తినిజము
గడియగడచినజము ప్రోలు నడచువాడు
ఆలుబిడ్డలఁజూడంగనయ్యె నహహా॥

అదృష్టమనిన వర్ధమానునిదిగాక మఱియొకనిదగునా? రాజునాజ్ఞ శిరసావహించి, నేఁబోయి పురవాసులందఱకు, రాజశాసనమిట్లెఱింగించితిని "మా మేనమామగారి రెండవపుత్రికారత్నమును నిన్ననీపురము ప్రవేశించిన కొంకణమాధవునకు నొసంగి వివాహముచేయ నెంచితిమి గాన మీారలందఱు పురము నలంకరింపవలయును" అని. ఇంక రాజసభ కేగెద.

[తెరలో]

ఉ॥ కట్టిరనంటికంబములఁగట్టిరి తోరణముల్ పతాకలన్
గట్టిరి వింతరీతులుఁగట్టిరి చాందినీల్ బసందుగా
గట్టిరి పుష్పగుచ్ఛములు గన్నులపండువగాఁ జేసిరి
ప్పట్టణమెల్లఁ జోద్యముగఁ బార్థివునానల నింతమాత్రలో॥

రాజసే--బళిరే! నామాట నానోటనుండగనే యీపురవాసులు సర్వము నిర్వహించిరి.

[అంతట నిష్క్రమించును.]

(షష్ఠ రంగము.)

వివాహమంటపము.

[ప్రవేశము నిరంకుశుఁడు, వర్ధమానుఁడు, కోకిల, శుకి, మాధవ.పా మాధవ, కొం. శారద]

నిరంకు--[శుకినిచేతఁబుచ్చికొనివచ్చి శారదకు నమస్కరింపఁజేయుచు]

గీ॥ పాలుగల్గినయప్పుడె పాయసంబు
తల్లిగలిగినయపుడె పుట్టిల్లటంచు
పెద్దలందురుగాన నీముద్దరాలి
తల్లివెలితిని దీరిచి దనుపుమమ్మ॥

శారద--(శుకిని లేవనెత్తి మూర్ధమాఘ్రాణించి)

క॥ నట్టింటిలచ్చినీవయి
నట్టుల నినుఁజూచికొందు నాతీనీతో
బుట్టువునీవును ముద్దుల
పట్టులగనిమాకు ముదము పచరింపుడోగిన్॥

వర్ధమానుఁడు--[శుకి నమస్కరింపగా]

మ॥ కొడుకుల్ గూతులుగంచుఁగోడలును గొడ్కగేముదీర్పంగనే
నడుగిట్టట్టిడకుండనింటికడ సౌఖ్యంబొప్పగానుంట కె
క్కుడుభాగ్యంబదినాకు జన్మకికనేగోర్కల్ బళాయింక నీ
బుడుతల్ పెంపుననింతలంతలగుచున్ మోదంబుగూర్తుర్ గదున్

నిరంకు--(శుకి నుద్దేశించి)

సీ॥ ఆకుసందునఁ బిందయట్టుల నీవిక
నత్తమామలలోన నడగుమమ్మ
వృక్షంబునకు నీడ వెమబడునట్టుల
మగనిజాడల నీవు మసలుమమ్మ
ఆత్మబంధులకెలు నతనిబంధులమీాద
నెక్కుడుకూర్మి జూపింపుమమ్మ

కలిమిగల్గినలోన గర్వంబునొందక
చుట్టాలఁబ్రీతితోఁజూడుమమ్మ
గీ॥ పోయిరావమ్మ కొడుకులఁబొందుమమ్మ
యప్పుడప్పుడు వార్తలవంపుమమ్మ
మమ్మునందఱ మనసులో మరువకమ్మ
మగనిదైవంబుగాఁజూచి మనగదమ్మ॥

భరతవాక్యము

(సూత్రధారుఁడుప్రవేశించి)

సీ॥ కఱకుఖడ్గమునుండి కంఠమ్ముఁదప్పించి
చంద్రమతినిగాచు శర్వుడెవడొ
అరచీరతోఁడుత నడవినల్లాడెడు
దమయంతిధవుజేర్చు ధాతయెవడొ
రాకాసిమూకల కేకలనడుమన
సీతనుబ్రోచిన సేవ్యుడెవడొ
కుచ్ఛెళ్లసభపూని గుంజుహస్తముగ్రుంగ
ద్రోవదింబ్రోచిన దేవుడెవడొ
గీ॥ అతడెమాకబ్బె కష్టాలననచికావ
ఆపదంభోనిధినిదాట నమరునావ
దురితకాంతారమునుదాటఁ దోచుద్రోవ
వానిబ్రార్థింతుమిము నెల్లఁబూనిప్రోవ॥

పంచమాంకము
సంపూర్ణము.

శుద్ధపత్రిక

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు	పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు
ii	12	సతులీల	సతులిల	19	14	సోదెమీా	చోద్యమీా
	13	యుద్ధ	యద్ద	23	10	మల్లి నే	మల్లిక నే
vii	3	యునికి	యునిక్రీ	24	22	కాలంబు	కాలము
2	23	నూర్	నూల్	25	1	ఉండానయ్యా!	ఉండనయ్యా?
4	6	జూపున	జాపున	28	3	అన్నా;నీ	అన్నా ని
	7	జేపడి	జేవడి		18	తోవడవ	వడద
	16	పిన్న	పెద్ద	29	13	సండీ	సమండీ
	16	రెండవ	మొదటి	30	1	దొమ్మలాట.	బొమ్మలాట
5	20	చూపుగా	చాపుగా		19	కెత్తుండ	కెల్తుండ
	22	పెద్ద	చిన్న	31	3	కెలొజ్జ	కేలొజ్జు
	25	దమ్మల	నన్నల		16	లిచ్చి	నిచ్చి
7	19	పోత్తూ	పోతూ	33	6	యెడయాల	యేయాల
8	1	బుంగ్రలా	బుంగలం		10	ప్రాకు	పారు
	10	కొదివెయ్యం	కొదిలెయ్యం		15	వేసి	లేని
		పెడా	పైడా	34	7	బంకగ	బింకగ
	12	ఆలెక్క్డి	ఆలెక్కది		15	వీవెందుల	నీవెందుల
	16	దమ్మలక్	నన్నలక్	35	6	బాలిక	చాలిక
9	3	యేటొచ్చి	మొటొచ్చి	36	4	నోపహో	నోపనో
10	2	చేసితి	చెపితి	38	7	సదుకొద్ది	సదునొద్ది
	21	రించండీ.	రించండి		11	మూన్యాల	మున్యాల
	11	దానితే	దానివే	39	6	మచ్చ.	మచ్చ
11	8	గరని	గలగని		6	కాడినంచి	కాడినుంచి
13	6	గంతులు	గంతెలు		11	నీగతిన్ని	నీగతి
	7	వట్టేడు	నట్టేడు		20	తప్పక	దప్పగ
	8	చింతల	చింతలు		24	సొంపొప్ప	సొంపొప్ప
14	11	ధ్యర్థన్య	ధ్వన్యర్థ	40	9	చేతో	చేత
	23	సంగమంచు	సంగమించు		12	మన్నాడో	మన్నావు
	24	స్వతంద్రతఁ	నతంద్రతఁ	43	9	విరసక్	సరసక్
		గొబ్బున	గొల్బున	44	13	నీదుచిత్రంబు	చిత్రంబు
15	19	పిత్తం	చిత్తం	48	6	బోయియ	బోలున
16	7	యెదన	యెదవ		8	నెట్టు	యొట్టు

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.	పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
50	10	ముక్కాటి	ముక్కోటి	69	10	నావేప	నేవేప
54	20	రాగలం	రానం	73	19	భార్యతో	భార్యతా
55	5	మాకోం	యీకోం	91	21	తేమియు	నేమియు
	20	గోసు	గోలుసు	94	21	తేడ	యేడ
62	12	చేగ	పేర	95	9	తాటి	కాటి
63	2	గందు	గుందు	100	19	ద్రెంచు	ద్రెంచి
68	7	నీడుగు	నీయుడుగు	103	24	మాపక	మాపోపక
	11	పోపువుమి	పోవునామి				

11 2 తప్పు. యన్నుతల్లికై వగవనాపుడు గూడనిలైన నెట్లోకో
ఒప్పు. యున్నభటుండు పోయెంబొరుగూళ్లను బోయినవారివెద్క
కుణ॥

చంద్రికాముద్రాశాలయందు వెలకు దొరకు

గ్రంథములు.

1	సత్యహరిశ్చంద్రీయము.	1	0	0
2	బుద్ధిమతీవిలాసము.	0	12	0
	జనకజానందము.—— (రామాయణ నాటకము) మా॥ వంకిపురపు కృష్ణమాచార్య విరచితము. వెల	1	0	0
3	చిత్రమాధవము. (బ్ర॥ శ్రీ దంటు సుబ్బావధానికవివిరచితము.	0	12	
4	కీర్తికాంతా స్వయంవరము. ప్రౌఢప్రబంధము రాజాగోపాలరాయవిరచితము.	0	4	0
5	తిలోత్తమ (విచిత్రమయిన నవల శ్రీ పులిగుండం రంగారాయవిరచితము.)	0	12	0
6	సాత్రాజితీయము. విచిత్రమైననాటకము. బ్ర॥ శ్రీ బలిజేపల్లిలక్ష్మీకాంత విరచితము అచ్చుపూర్తి కావచ్చినది.	0	14	0

END OF
TITLE